సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 286

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



ప్రెస్టీజ్ న్యూ ఇయర్ బొనాంజా
ఈ న్యూ ఇయర్ కి
ప్రెస్టీజ్ వారి విప్లవాత్మక ప్రొడక్ట్స్‌ని
ఇంటికి తీసుకురండి.
*ఈ ఆఫర్ డిసెంబరు 23, 2023 నుండి జనవరి 28, 2024 వరకు మాత్రమే.
75 Years of Prestige
భారతదేశంలో మొట్ట మొదటి చిందటం
నివారించే ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్
లాక్
అన్‌లాక్
Prestige FLIP-ON
LASTS A LIFETIME
ఏదైనా (3L అంతకంటే ఎక్కువ) ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్ (1 యూనిట్) కొనుగోలు చెయ్యండి మరియు ₹2 150.00 విలువగల ఒమేగా డీలక్స్ గ్రానైట్ ట్విన్ ప్యాక్ (1 సెట్) ఉచితంగా పొందండి (కాన్‌కేవ్ తవ 25 సె.మి (1 యూనిట్) మరియు ఫ్రై ప్యాన్ 20 సె.మి (1 యూనిట్)) ట్రై ప్లై ఔటర్ లిడ్ మరియు ఇన్నర్ లిడ్ సీరీస్ (3L అంతకన్నా ఎక్కువ) పై కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది.
భారతదేశంలో మొట్ట మొదటి ఆటోమేటిక్
విజిల్ కౌంటర్ ఇండక్షన్ కుక్‌టాప్ తో
మీ వంట మరింత పర్ఫెక్ట్ గా చెయ్యండి
Prestige
విజిల్ లెక్కించే ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) కొనండి మరియు పాపులర్ స్వచ్ఛ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్ (5L) (1 యూనిట్) MRP పై 15% డిస్కౌంట్ తగ్గింపు పొందండి
32.9X52 C
TTK PRESTIGE
విప్లవాత్మక
ఈజీ క్లీన్ డిజైన్
ఎత్తండి
క్లీన్ చేయండి
గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (1 యూనిట్) కొనండి మరియు డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹2 895.00 విలువగల ఎక్స్‌ప్రెస్ ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
14 విధాలుగా పనిచేసే
ఆల్ ఇన్ వన్
మిక్సర్ గ్రైండర్
POWERFUL 1000W MOTOR
5 YEAR WARRANTY ON MOTOR
ALL EDNS
(DIFFERENT MATERIAL
COLLECT FROM ALL UNITS FOLDER)
BLANK SPACE
ప్రవేశ పెడుతున్నాం
లోనే
టెక్నాలజీ™ కలిగిన చిమ్నీ
మరియు
SafeSense™ technology
Controlled through Mobile App - Prestige Smart Chef App
ఎండ్యూరా ప్రో మిక్సర్ గ్రైండర్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 795.00 విలువగల సాండ్‌విచ్ మేకర్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
ఈ ఆఫర్ ఎండ్యూరా 3, 4, 6 జార్ మిక్సర్ గ్రైండర్ మరియు డిలైట్ ప్రో మిక్సర్ గ్రైండర్ పై కూడా వర్తిస్తుంది.
ఆస్కార్ సేఫ్ సెన్స్ చిమ్నీ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹14 145.00 విలువగల రాయల్ ప్లస్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (4B) (1 యూనిట్) ఉచితంగా పొందండి
ఒమేగా డీలక్స్ గ్రానైట్ కుక్ వేర్ సెట్, ఇండియాలోనే మొట్ట మొదటి 5 - లేయర్స్ డ్యూరబల్ నాన్ స్టిక్
ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 పీస్ కుక్‌వేర్ (1 సెట్) కొనండి మరియు MRP పై 20% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 780.00 విలువగల స్వచ్ఛ్ పాపులర్ ప్లస్ అల్యూమినియం ప్రెషర్ కుక్కర్ (3L) (1 యూనిట్) ఉచితంగా పొందండి
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రొడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. సెలెక్టెడ్ మోడల్స్ స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎంచుకోబడిన స్టోర్స్‌లో మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 pc కుక్‌వేర్ (1 సెట్) లో ఫ్రై ప్యాన్ - 24cm (1 యూనిట్), గ్లాస్ లిడ్ కలిగిన కడాయి - 28cm (1 యూనిట్), ఓమ్ని తవా - 28cm (1 యూనిట్) మరియు గ్లాస్ లిడ్ కలిగిన మిల్క్ ప్యాన్ - 16cm (1 యూనిట్) ఉంటాయి. ఆఫర్ ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ లో మాత్రమే వర్తిస్తుంది. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టీటీకె ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబంధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్‌లెట్ కి విచ్చేయండి లేదా మా వెబ్ సైట్ https://shop.ttkprestige.com/new-year-offer-tc ను సందర్శించండి.
Prestige®
CUSTOMER CARE NO 080-6000 4411
Follow 'TTK Prestige' on
PRESTIGE XPERT 97423 34411
Shop Online on shop.ttkprestige.com
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
Prestige Xclusive
KARIMNAGAR: Mankamma Thota, Ph: 8008797047; Vavilapally, Ph: 7032307491; SIDDIPET: Beside Srinivasa Theatre, Hyderabad Road, Ph: 9700003187; Mancherial: Near New Bus stand, Ph: 9866045646.
Also Available at: Karimnagar: Supreme Kitchen Mall, Ph: 9989455521; Supreme Enterprises, Ph: 9989455521; Anjaiah Malayala, Ph: 0878-2231072, 9246931072; Venkateshwara Shopping Centre, Ph: 9949443815; R.KistaiahHomeAppliances, Ph: 9949030588; Ravindra metal merchant, Ph: 9849540801; Mankeshwara Steel, Ph: 9866162213; Malyala Ajay metal, Ph: 9000900908; Godavarikhani: Sainath Home Needs, Ph: 9032558888; Jagityal: Gajanand Steel, Ph: 9014790960; Sri PadmajaEnterprises, Ph: 9985211109; SriVenkateswaraSteel, Ph: 9247289351; Susmitha furniture, Ph: 8555802418; Korutla: Sri Satya sai steel, Ph: 9849600050; Laxmi Priya Steel, Ph: 6302145976; Anand Shopping centre, Ph: 9700311666; Metpalli: Sambari prabhakar Metal, Ph: 9440070504; Anand Shopping centre, Ph: 8500305100; Sambari chinnaiah, Ph: 9848013870; Peddapally: Shankar enterprises, Ph: 9701677694; Sri venkateswara Stainless steel, Ph: 9849026824; Sircilla: Tirumala Electronics, Ph: 9553344255; Subhash electronics, Ph: 9849773376; Vemulawada: B.N. Metal, Ph: 9014712245; Rudrangi: Padmaja Super Market, Ph: 9848503810; Keshavapatnam: Mahalaxmi Steel, Ph: 7013004945; SIDDIPET: Sri Venkataramana Metal, Ph: 9949660096.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 286
శనివారం 6-1-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'


భారత్ విజయగర్జన
తొలి టి20 మ్యాచ్‌లో ఆసీస్‌పై 9 వికెట్లతో టీమిండియా ఘనవిజయం -13లో


స్వల్ప లాభాల ముగింపు
ఆదుకున్న ఐటీ, ఆటో షేర్లు.. మళ్లీ 72 వేల స్థాయిపైకి సెన్సెక్స్ -13లో


ఎన్నికల ఏడాది
2024ను ఎన్నికల ఏడాదిగా పిలవాలేమో. ఎందుకంటే ఈ ఏడాది ఏకంగా 50కి పైగా దేశాల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.
- వివరాలు 6లో


ఈడీ అధికారులపై దాడి
పశ్చిమబెంగాల్‌లోని తృణమూల్ మద్దతుదారులు ఈడీ అధికారులపై దాడి చేశారు. అధికారులకు తీవ్ర గాయాలయ్యాయి.
- వివరాలు 6లో


రాజ్యసభకు స్వాతి మలివాల్
ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను రాజ్యసభకు నామినేట్ చేయనున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) ప్రకటించింది.
- వివరాలు 6లో


కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తత
కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ కొరియా దేశాలు పరస్పరం కవ్వింపు చర్యలకు దిగాయి.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

దేశంలోనే ఉత్తమ స్టేషన్‌గా రాజేంద్రనగర్ పీఎస్..



2023 సంవత్సరానికిగాను దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం అవార్డు అందించింది. జైపూర్‌లో డీజీపీ, ఐజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఈ అవార్డు అందుకున్నారు.
- వివరాలు 2లో

రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకుల భూములు



రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకులకు చెందిన భూములతోపాటు అసైన్డ్, రహదారి భూములున్నాయని మాజీ ఎమ్మెల్యే గొనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన 3 వేల ఎకరాల్లో 1,700 ఎకరాలు గాలిబ్ జంగ్‌కు చెందిన భూములున్నాయని... ప్రజారహదారులు, హరిజనుల భూములు, భూదాన్ భూములను సైతం కబ్జా చేశారని చెప్పారు.
- వివరాలు 3లో

యుద్ధం కన్న అనాథలు



రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ఎంతో మంది మరణించారు. రష్యా దాడులు తట్టుకోలేక ఉక్రెయిన్ నుంచి లక్షలాది మంది వలసపోయారు. అటు పాలస్తీనాలో ఇజ్రాయెల్ దాడులతోనూ లక్షలాది జీవితాలు అతలాకుతలమయ్యాయి. అభంశుభం ఎరుగని ఎందరో చిన్నారులు యుద్ధం మిగిల్చిన అనాథలుగా భవిష్యత్తు ఏమిటో తెలియని దుస్థితిలో పడిపోయారు.
- వివరాలు 14లో

ఆ రెండు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌కే!

విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలన్న ఎన్నికల సంఘం
వివరాలు 2లో

యూపీఎస్సీలా టీఎస్‌పీఎస్సీ!

నియామకాల కమిషన్‌ను తీర్చిదిద్దేందుకు సహకరించండి

యూపీఎస్సీ చైర్మన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తి

- ఢిల్లీలో గంటన్నర పాటు భేటీ.. నియామకాలు, పరీక్షల నిర్వహణ, పారదర్శకతపై చర్చ.. రాజకీయ జోక్యం లేకుండా టీఎస్‌పీఎస్సీ పాలక మండలిని నియమిస్తామని వెల్లడి
- రాష్ట్ర సర్కారుకు సహకరిస్తామన్న యూపీఎస్సీ చైర్మన్
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని హామీ
- కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్‌తోనూ రాష్ట్ర బృందం సమావేశం
- రక్షణశాఖ భూములను బదలాయించాలని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తులు


యూపీఎస్సీ చైర్మన్ మనోజ్‌కు జ్ఞాపిక ఇస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) తరహాలో 'తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)'ను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకోసం సహకరించాలని యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ మొదలు పోస్టుల భర్తీ వరకు యూపీఎస్సీ తరహాలోనే జరిగేలా తగిన మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వచ్చిన రేవంత్‌రెడ్డి శుక్రవారం యూపీఎస్సీ చైర్మన్‌తో, అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వినతిపత్రాలు సమర్పించారు.

తగిన సహకారం అందించండి

మంత్రి ఉత్తమ్, సీఎస్ శాంతికుమారి, ఇతర అధికారులతో కలసి ఢిల్లీలోని యూపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ మనోజ్ సోని, కార్యదర్శి శశిరంజన్‌కుమార్‌లతో రేవంత్ భేటీ అయ్యారు. సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీలో టీఎస్‌పీఎస్సీ
మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్‌కు ప్రత్యేక నిధులివ్వండి

15వ ఆర్థిక సంఘం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.2,233.54 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ సందర్భంగా సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద 2019–20 నుంచి 2023–24 వరకు ఏటా రూ.450 కోట్ల చొప్పున మొత్తం రూ.1,800 కోట్లు రావాల్సి ఉందని, వెంటనే ఇవ్వాలని కోరారు. వీటితోపాటు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

కట్టుదిట్టంగా టీఎస్‌పీఎస్సీ!

- ఇతర రాష్ట్రాల్లో అధ్యయన ప్రక్రియ వేగవంతం
- కమిషన్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా యత్నాలు

వివరాలు 2లో



తోకముడిచిన సోమాలియా పైరేట్లు

వాణిజ్య నౌక హైజాక్ యత్నాన్ని అడ్డుకున్న భారత నేవీ కమాండోలు

న్యూఢిల్లీ: భారతీయ సిబ్బందితో కూడిన లైబీరియా సరుకు నౌకను హైజాక్ చేసేందుకు సోమాలియా సముద్రపు దొంగలు చేసిన ప్రయత్నాన్ని భారత నేవీ కమాండోలు చాకచక్యంగా తిప్పికొట్టారు. అందులోని 15 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 21 మందిని కాపాడారు. ఎంవీ లిలా నార్‌ఫోక్ అనే ఓడను ఈ నెల 4వ తేదీన అరేబియా సముద్ర జలాల్లో ఉండగా సాయుధ దుండగులు హస్తగతం చేసుకున్నారు. ఆపదలో ఉన్నామని, ఆదుకోవాలంటూ ఓడ సిబ్బంది యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్(యూకేఎంటీవో)పోర్టల్‌కు సమాచారం అందించారు. అందులో 15 మంది వరకు భారతీయ సిబ్బంది ఉన్నట్లు తెలియడంతో భారత నేవీ అప్రమత్తమైంది. ఆ ప్రాంతానికి ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకను హుటాహుటిన పంపించింది. పైరేట్లను లొంగిపోవాలని హెచ్చరికలు చేస్తూ ఎంవీ లిలా నార్‌ఫోక్‌ను శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఐఎన్ఎస్ చెన్నై అడ్డగించింది. సుశిక్షితులైన కమాండోలతో కూడిన అత్యాధునిక గస్తీ హెలికాప్టర్ పి–81ను సైతం అధికారులు సిద్ధంగా ఉంచారు. నౌకలోని పరిస్థితులను దగ్గర్నుంచి అంచనా వేసేందుకు అత్యాధునిక ఎంక్యూ9బీ ప్రిడేటర్ డ్రోన్‌ను రంగంలోకి దించారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పైఅధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే కమాండోలు ఎంవీ లిలా నార్‌ఫోక్‌లోకి మెరుపు వేగంతో ప్రవేశించారు. వారిని చూసి పైరేట్లు తోకముడిచారు. గస్తీ సిబ్బంది ఇచ్చిన గట్టి హెచ్చరికలతోనే వారు భయపడి, నౌకను హైజాక్ చేసే ప్రయత్నాన్ని విరమించుకుని, పలాయన మంత్రం పఠించారని నేవీ ప్రతినిధి కమాండర్ వివేక్ మధ్వాల్ చెప్పారు. నౌకలో విద్యుత్ వ్యవస్థను, చోదక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. అన్నీ పూర్తయ్యాక నౌక ప్రయాణాన్ని మళ్లీ కొనసాగించనుందన్నారు. ఈ ప్రాంతంలో
మిగతా 5వ పేజీలో ▶

ఎవరెవరికి... ఏమేమిద్దాం!

నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్‌లో ఎడతెగని చర్చ

- సంక్రాంతి పండక్కి ముందా... ఆ తర్వాతా?
- త్వరలోనే వస్తాయంటున్న ముఖ్యమంత్రి
- తొలిదఫాలో 10 కార్పొరేషన్ల పోస్టులు ప్రకటించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల పందేరంపై అధికార కాంగ్రెస్ పార్టీలో ఎడతెగని చర్చ జరుగుతోంది. ఈ పదవులను త్వరలో భర్తీ చేస్తామని ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన తర్వాత ఈ చర్చ ఉధృతమైంది. భర్తీ త్వరలోనే ఉంటుందని చెప్పిన సీఎం ఎప్పుడన్న దానిపై స్పష్టం చేయకపోవడంతో అసలు ఈ పోస్టుల ప్రకటన ఎప్పుడు ఉంటుంది? తొలిదఫాలో ఎన్ని కార్పొరేషన్లు భర్తీ చేస్తారు? అందులో కీలకమైన కార్పొరేషన్లు ఎన్ని ఉంటాయి? ఆ కీలక కార్పొరేషన్లే కాకుండా నామినేటెడ్ హోదాలు ఎవరెవరికి దక్కుతాయన్నది ఇప్పుడు గాంధీభవన్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఏ ఇద్దరు కాంగ్రెస్ నేతలు కలిసినా ఇదే అంశంపై చర్చించుకుంటుండటం గమనార్హం. ఇక, సంక్రాంతికి ముందే నామినేటెడ్



పోస్టుల భర్తీ ఉంటుందనే చర్చ చాలా కాలంగా జరుగుతోంది. కానీ, సంక్రాంతికి ముందే ఉంటుందా? లేక సంక్రాంతి తర్వాత ఉంటుందా అన్న దానిపై కూడా స్పష్టత రావడం లేదు. అటు ఎమ్మెల్యే కోటా, ఇటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ వాయిదా
మిగతా 3వ పేజీలో ▶


భర్తీ చేయాల్సిన కార్పొరేషన్లు యాభై

వాస్తవానికి, రాష్ట్రంలో భర్తీ చేయాల్సిన కార్పొరేషన్లు చిన్నా చితకా, పెద్దవి అన్నీ కలిపి దాదాపు 50 వరకు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. వీటిని వీలున్నంత త్వరగా భర్తీ చేస్తే రెండేళ్ల పదవీ కాలం చొప్పున మరో రెండు మార్లు ఇతర నేతలకు అవకాశమివ్వచ్చని, అలా 1,500 మంది వరకు నేతలకు నామినేటెడ్ పదవులు ఈ ఐదేళ్ల కాలంలో పంపిణీ చేయవచ్చనేది టీపీసీసీ ఆలోచనగా కనిపిస్తోంది. అయితే, తొలిదఫా భర్తీ ఎప్పుడు పూర్తవుతుందన్న దాన్ని బట్టి 1,500 మంది వరకు అవకాశం కల్పించవచ్చని, జాప్యం జరిగిన కొద్దీ నేతల సంఖ్య తగ్గిపోతుందని కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, ఏఐసీసీ సిఫారసులు... ఇలా అనేక విధాలుగా కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య చాంతాడంత కనిపిస్తోంది. ఒక్కో జిల్లాకు 5–10 మంది పేర్లు వినిపిస్తున్నాయి.

గోదావరి– కావేరి అనుసంధానంపై వచ్చేనెలలో సీఎంల భేటీ

ఆయా రాష్ట్రాలకు ప్రాథమిక సమాచారం పంపిన జాతీయ నీటి అభివృద్ధి సంస్థ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరీ నదుల అనుసంధానంపై వచ్చేనెలలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ అధ్యక్షతన ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. ఈ మేరకు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) రాష్ట్రాలకు ప్రాథమికంగా సమాచారం పంపించింది. ఈ రెండు నదుల అనుసంధానానికి సంబంధించి సవివర ప్రణాళిక నివేదిక(డీపీఆర్) త్వరలోనే రాష్ట్రాలకు పంపించి అధ్యయనం చేయడానికి గడువు ఇచ్చిన తర్వాత ఈనెలాఖరులో ఆయా ప్రభావిత రాష్ట్రాల నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శులు/కార్యదర్శులతో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌ను
మిగతా 5వ పేజీలో ▶



ముసాయిదా ప్రకారం ఆయా రాష్ట్రాల్లో ఇలా..

రాష్ట్రం	నీటి కేటాయింపు (టీఎంసీల్లో)	ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)
తెలంగాణ	45	5.89
ఆంధ్రప్రదేశ్	44	5.5
తమిళనాడు	41	2.82


- కర్ణాటక 16, పుదుచ్చేరి 2 టీఎంసీలు తాగునీటికి వినియోగిస్తాయి.

ఊపిరి ఉన్నంత వరకు జైల్లోనే..

గర్భిణి హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

కూకట్‌పల్లి సెషన్స్ కోర్టు సంచలన తీర్పు

- 2018 జనవరి 27న దారుణం.. బొటానికల్ గార్డెన్ వద్ద గోనెసంచుల్లో మృతదేహం
- చాకచక్యంగా ఛేదించిన గచ్చిబౌలి పోలీసులు


5లో

సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

ప్రజలకు లబ్ధి కలిగించే పథకాల రద్దుపై నిరసన కార్యక్రమాలు


టెలి కాన్ఫరెన్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్

వివరాలు 3లో

దూసుకొచ్చిన మృత్యువు

ఆటోను తప్పించబోయి రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టిన డీసీఎం

అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం.. మరో ముగ్గురి పరిస్థితి విషమం

- మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ వద్ద దుర్ఘటన..
- డీసీఎంను వెంబడించి తగలబెట్టిన స్థానికులు
- అడ్డుకున్న పోలీసులపైనా దాడి... భయంతో టైలర్ షాపులోకి పరుగులు
- పది కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- బలగాల సాయంతో పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

5లో


ప్రమాదానికి కారణమైన డీసీఎంకు నిప్పుపెట్టిన జనం

ఇదండీ సంగతి


ఈ రకంగా కూడా ప్రచారం చేసుకోవచ్చుగా సార్!

క్లుప్తంగా...

హైకోర్టు నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయింపు

సాక్షి, హైదరాబాద్‌: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్‌బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన వంద ఎకరాల భూమిని కొత్త హైకోర్టు నిర్మాణం కోసం కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని ప్రేమావతిపేట్, బుద్వేల్ గ్రామాల్లో ఉన్న ఈ భూమిని కేటాయించింది. కాగా, గత నెలలో హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయిన సందర్భంగా కొత్త హైకోర్టు నిర్మాణం విషయం ప్రస్తావనకు వచ్చిన సంగతి తెలిసిందే.

ధరణిని ఉంచుతారా? తీసేస్తారా?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్‌: ధరణి పోర్టల్‌ను కొనసాగిస్తున్నారా? లేదా తీసేస్తున్నారా..? ఏ విషయాన్నైనా వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ధరణి పోర్టల్ కారణంగా ఎదురవుతున్న సమస్యలను 4 వారాల్లో పరిష్కరిస్తామని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) వ్యక్తిగతంగా హాజరై గత ఏప్రిల్‌లో హామీ ఇచ్చారని.. దీనిపై ఏం చర్య లు చేపట్టారో నివేదికనివ్వాలని సూచించింది. ధరణి పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలపై ఉన్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 4వారాల సమయం కావాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేశారు.

ఓటుకు కోట్లు కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కేసు నుంచి తనను తప్పించాలంటూ తెలంగాణ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ట్రయల్ కోర్టు పరిధిని సవాల్ చేస్తూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది కుటుంబ సభ్యుల్లో ఒకరు మరణించడంతో విచారణ వాయిదా వేయాలని కోరగా.. ధర్మాసనం అనుమతించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని.. ప్రజాపాలనలో పాల్గొని


తొలిసారి స్వగ్రామానికి వచ్చిన సీతక్కకు ఘనస్వాగతం



ములుగు: పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీతక్క శుక్రవారం తొలిసారి తన స్వగ్రామమైన ములుగు మండలం జగ్గన్నపేటకు వెళ్లారు. మొదటగా తల్లిదండ్రులు సమ్మక్క–సారయ్యల కాళ్లకు దండంపెట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ క్రమంలో వారు సీతక్కను చూసి ఆనందభాష్పాలతో మురిసిపోయారు. అనంతరం జగ్గన్నపేటలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రానికి మంత్రి అయినా.. తాను గ్రామ బిడ్డనేనన్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీతక్కను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులు

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



గోదావరిఖని: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను కోరారు. ప్రతీరోజు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సిందేనన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అన్ని విభాగాల జీఎంలతో బొగ్గు ఉత్పత్తి సాధనపై సమీక్షించారు. ఈ ఏడాది నిర్దేశిత 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ప్రతీరోజు విలువైందేనని సీఎండీ అన్నారు. రానున్న వేసవిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడంలో ఎదురవుతున్న అవాంతరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.అల్విన్, జీఎం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌కే!

విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలన్న ఎన్నికల సంఘం

- ఒకేరోజు ఎన్నికలు.. .విడివిడిగా నిర్వహణతో కాంగ్రెస్‌కు చాన్స్
- ఏ ఉప ఎన్నికకు పోటీ చేస్తున్నారో పోటీదారు పేర్కొనాలి
- సవివరంగా షెడ్యూల్‌లో సీఈసీ మార్గదర్శకాలు
- రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా పోలింగ్ బాక్సులు



సాక్షి, హైదరాబాద్‌: ఈనెల 29వ తేదీన ఎమ్మెల్యేల కోటాలో జరిగే రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీనే దక్కించుకునే అవకాశముంది. సంఖ్యాబలం పరంగా చూస్తే కాంగ్రెస్‌కు ఒకటి, బీఆర్‌ఎస్‌కు ఒకటి రావాల్సి ఉన్నా.. ఈ రెండు స్థానాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లు, వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో.. అధికార కాంగ్రెస్ పార్టీకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కనున్నాయి.

ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు రాజీనామా చేసిన ఏ సభ్యుడి స్థానంలో ఎన్నిక కావడానికి నామినేషన్ వేస్తున్నారో స్పష్టంగా పేర్కొనాలని కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో వారిద్దరూ గతనెల 9వ తేదీన తమ పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీలుగా వీరిద్దరికీ 30 నవంబర్ 2027 వరకు గడువు ఉన్నా.. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో వేర్వేరుగా జరిగే ఈ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్లలో ఒకటి తెల్ల, రెండోది గులాబీ రంగులో ముద్రించాలని స్పష్టం చేశారు. మొత్తం సభ్యులు(119), ఎన్నికవ్వాల్సిన స్థానాల సంఖ్య +1తో భాగించడంతో వచ్చే భాగఫలం(ఒకరికి కావాల్సిన ఓట్ల సంఖ్య 59.5)ను నిర్ధారిస్తారు. ప్రస్తుతం వేర్వేరుగా ఎన్నిక నిర్వహిస్తుండటం వల్ల ఒక అభ్యర్థికి కనీసం 59.5 ఓట్లు లభిస్తే ఆ అభ్యర్థి ఎన్నిక కావడానికి వీలుంటుంది. అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 64 మంది సభ్యులున్నందున, రెండు స్థానాలకు వేర్వేరుగా 119 మంది సభ్యులు రెండుసార్లు ఓట్లు వేయాల్సి ఉండడంతో ఈ రెండు స్థానాలూ కాంగ్రెస్‌కే దక్కనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఒకే నోటిఫికేషన్, ఒకే పోలింగ్ స్టేషన్ ఉంటే..

రెండింటికీ ఒకే నోటిఫికేషన్, ఒకే పోలింగ్ స్టేషన్ ఉన్న పక్షంలో మొత్తం సభ్యుల సంఖ్య(119)ని ఎన్నిక కావాల్సిన స్థానాలు రెండింటికి +1 కలపడం వల్ల 39.6 ఓట్లు లభిస్తే ఒక ఎమ్మెల్సీ స్థానం రావడానికి అవకాశం ఉండేది. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఒకటి, బీఆర్‌ఎస్‌కు ఒకటి కచ్చితంగా వచ్చేవి. రెండోస్థానం కైవసం చేసుకోవడానికి ఏ పార్టీకి కూడా మెజారిటీ లేనందున దాదాపు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగే అవకాశం ఉండేది. అయితే ఎన్నికల సంఘం ఈ రెండింటికీ వేర్వేరుగా ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. అసెంబ్లీలోని కమిటీ హాల్–1లో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే వారు ఎస్సీ, ఎస్టీలు రూ. 5 వేలు, మిగిలిన కులాల వారైతే రూ.10 వేలు డిపాజిట్ కట్టాలని పేర్కొన్నారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా రాజేంద్రనగర్ పీఎస్‌కు అవార్డు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్‌హెచ్‌ఓ నాగేంద్రబాబు
- అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ రవి గుప్తా



ఉత్తమ పోలీస్‌స్టేషన్ అవార్డు అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు

సాక్షి, హైదరాబాద్/రాజేంద్రనగర్: దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా 2023కుగాను ఎంపికైన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ (సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్)కు కేంద్ర ప్రభుత్వం అవార్డు అందించింది. శుక్రవారం జైపూర్‌లో జరిగిన అఖిలభారత డీజీపీ, ఐజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (స్టేషన్ హౌస్ ఆఫీసర్) బి. నాగేంద్రబాబు ఈ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా 17 వేల పోలీస్‌స్టేషన్ల నుంచి ప్రతిపాదనలు వెళ్లగా ఇందులో 74 పోలీస్ స్టేషన్లను కేంద్ర హోంశాఖ ఉత్తమ పోలీస్ స్టేషన్‌లుగా ఎంపిక చేసింది. గతేడాది డిసెంబర్ చివరి వారంలో కేంద్ర హోంశాఖ వెల్లడించిన అత్యుత్తమ పోలీస్ స్టేషన్ల జాబితాలో రాజేంద్రనగర్ పీఎస్ తొలి స్థానంలో నిలవడం తెలిసిందే. స్టేషన్‌లో పోలీసులు చేపడుతున్న విధులు, కేసుల నమోదు, వాటి పరిష్కారంలో చూపుతున్న శ్రద్ధ, భార్యాభర్తల గొడవల్లో కౌన్సెలింగ్, మహిళా భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు, మిస్సింగ్ కేసులు, గుర్తుతెలియని మృతదేహాల విషయంలో తీసుకుంటున్న చర్యలు.. స్టేషన్‌కు వచ్చిన వారిపట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు.. పీఎస్ పరిధిలో నమోదైన క్రైం రేట్.. దొంగతనాలు, దొంగతనాల్లో రికవరీ శాతం వంటి అంశాల్లో ఈ స్టేషన్‌కు అవార్డు లభించింది. కాగా, దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డు అందుకున్న రాజేంద్రనగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ బి. నాగేంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ రవి గుప్తా సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా అభినందనలు తెలియజేశారు.

యూపీఎస్సీలా టీఎస్‌పీఎస్సీ!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రక్షాళన అంశంపై చర్చించారు. వివాద రహితంగా పరీక్షల నిర్వహణ, నియామకాల్లో పారదర్శకత విషయంలో సహకరించాలని వారిని కోరారు. యూపీఎస్సీ పారదర్శకత పాటిస్తోందని, అవినీతి మరక అంటకుండా సమర్థవంతంగా పనిచేస్తోందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రశంసించారు.

ఏడాది చివరికల్లా రెండు లక్షల ఉద్యోగాలు

తెలంగాణలో చేపట్టే నియామకాల్లో నూతన విధానాలు, పద్ధతులను పాటించాలని నిర్ణయించినట్టు యూపీఎస్సీ చైర్మన్, కార్యదర్శికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రెండు లక్షల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని.. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని భావిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకాన్ని రాజకీయం చేసి.. కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. ఫలితంగా పేపర్ లీకులు, నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి ఓ ప్రహసనంగా మారిందన్నారు. తాము రాజకీయ ప్రమేయం లేకుండా టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం చేపడతామని.. సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని చెప్పారు.

రక్షణశాఖ భూములను రాష్ట్రానికి ఇవ్వండి

యూపీఎస్సీ చైర్మన్‌తో భేటీ తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో రాష్ట్ర బృందం భేటీ అయి చర్చించింది. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడర్ల నిర్మాణం, విస్తరణ కోసం.. రక్షణశాఖ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ కోరారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహిదీపట్నం రైతుబజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని.. అక్కడ రక్షణశాఖ పరిధిలో ఉన్న కాస్త భూమిలో మినహా మిగతా భాగం పూర్తయిందని వివరించారు. ఆ భూమిని వెంటనే బదిలీ చేస్తే.. నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వస్తుందన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కరీంనగర్–రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో.. ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఔటర్‌రింగు రోడ్డు జంక్షన్ వరకు 11.3 కి.మీ. మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం.. ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 18.30 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదించామని.. ఇందులో 12.68 కి.మీ. మేర నిర్మాణం, 4 ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్ (మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాల కోసం మరో 56 ఎకరాల రక్షణ శాఖ భూములను బదిలీ చేయాలని కోరారు. వీటిపై రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారు.


కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం దృష్టి సారించడం అభినందనీయం

టీఎస్‌పీఎస్సీ నియామకాల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడం అభినందనీయమని యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోని పేర్కొన్నారు. యూపీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకంలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదని.. సమర్థత ఆధారంగా ఎంపిక ఉంటుందని ఆయన వివరించారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దే ప్రయత్నానికి తాము సహకారం అందిస్తామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తోపాటు సభ్యులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామని వివరించారు. ఈభేటీలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి వాణీప్రసాద్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా టీఎస్‌పీఎస్సీ!

ఇతర రాష్ట్రాల్లో అధ్యయన ప్రక్రియ వేగవంతం

- కమిషన్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను కట్టుదిట్టం చేసేదిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురు సీనియర్ అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. వివిధ రాష్ట్రాల్లో సర్వీస్ కమిషన్లను అధ్యయనం చేయాలని ఆదేశించింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కార్యాలయానికి వెళ్లి చైర్మన్, కార్యదర్శులతో భేటీ అయ్యారు.

మెరుగ్గా ఉందని చెప్పినా..

ఇతర రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లతో పోలిస్తే టీఎస్‌పీఎస్సీ మెరుగ్గా ఉందని, ఆధునిక పరిజ్ఞానం వినియోగంలో ముందుందని అభిప్రాయాలు ఉన్నాయి. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా పనిచేసిన ఘంటా చక్రపాణి అప్పట్లో దేశంలోని సర్వీస్ కమిషన్లతో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీకి చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. దరఖాస్తుల నుంచి పరీక్షలు, నియామకాల దాకా టీఎస్‌పీఎస్సీ తీసుకువచ్చిన ఆన్‌లైన్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు అనుకరించిన సందర్భాలు ఉన్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. అయితే పలు పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ ప్రతిష్ట ఒక్కసారిగా మసకబారింది. వరుసగా పరీక్షల రద్దు కలకలం రేపింది. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీకి పూర్వ వైభవాన్ని తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది.

కఠిన నిబంధనలు.. కొత్త సాంకేతికతతో..

టీఎస్‌పీఎస్సీలో ప్రస్తుతం వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసి.. అత్యాధునిక సాంకేతికతను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి కమిషన్ నుంచి ప్రతిపాదనలు సైతం స్వీకరించింది. మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం కోసం టెక్ దిగ్గజాల సహకారం తీసుకోనుంది. కమిషన్‌లో కంప్యూటర్లను సైతం పూర్తిగా మార్చేసి.. సరికొత్త, భద్రమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉద్యోగుల బయోమెట్రిక్ ఉంటేనే కంప్యూటర్లు పనిచేసేలా సాంకేతికతను వినియోగించాలని భావిస్తోంది. ఇప్పటివరకు కేరళ, ఇతర రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును రాష్ట్ర అధికారుల బృందం పరిశీలించింది. మరింత లోతుగా అధ్యయనం జరిపాక రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందిస్తామని అధికారులు చెప్తున్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణ.. భూ వివాదాలు

ప్రజావాణికి వివిధ సమస్యలతో పోటెత్తిన ప్రజలు



లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తోన్న ప్రజావాణికి గతంతో పోలిస్తే అర్జీదారుల సంఖ్య తగ్గినప్పటికీ ప్రధానంగా ఉద్యోగాల క్రమబద్ధీకరణ, భూ కబ్జాల సమస్యలపై మాత్రం పెద్దసంఖ్యలో జనం వస్తూనే ఉన్నారు. శుక్రవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన 2200 దరఖాస్తుల్లో ఎక్కువగా అవే సమస్యలు ఉన్నాయి. గత సర్కారు కోత విధించిన వికలాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ హయంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా విధుల్లోకి చేరిన తమను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ నర్సులుగా పరిగణిస్తూ.. పూర్తిగా విస్మరించిందని గాంధీ హాస్పిటల్‌కి చెందిన పలువురు ఔట్‌సోర్సింగ్ నర్సులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని విన్నవించారు. గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషించే తమను గత కేసీఆర్ ప్రభుత్వం వెనక్కి నెట్టిందని తెలంగాణ ఉపాధి హామీ అదనపు కార్యక్రమాల అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పార్థసారధి, ఈ.నారాయణ ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మల్లారెడ్డి మా భూములను కాజేశాడంటూ బాధితుల ఆందోళన

మంత్రి మల్లారెడ్డి కబ్జా చెర నుంచి తమ భూములను విడిపించాలంటూ బాధితులు పెద్ద సంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివచ్చారు. శ్రీ మల్లిఖార్జున నగర్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీలో సర్వే నెం.648, 650, 650/2లకు చెందిన 22 ఎకరాల లేఅవుట్‌లోని 366 ప్లాట్లకు గానూ 230 ప్లాట్లను మల్లారెడ్డి కబ్జా చేశారంటూ ఫ్లెక్సీలతో ఆందోళనకు దిగారు. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు నుంచి తమ ప్లాట్లను కాపాడాలంటూ కాప్రా కృష్ణానగర్ ప్లాట్ ఓనర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

'ఫైనాన్స్' వేధింపులతో రైతు ఆత్మహత్య

- వరికోత యంత్రం కిస్తీ చెల్లించలేదని తీవ్ర ఒత్తిడి


రామారావు

చర్ల: ఫైనాన్స్ కంపెనీ బాధ్యుల వేధింపులు తాళలేక ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై చర్ల సీఐ బి.రాజగోపాల్ తెలిపిన వివరాలివి. దుమ్ముగూడెం మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతు కొమరం రామారావు (55) చోల మండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ ద్వారా రుణంపై వరికోత యంత్రాన్ని తీసుకున్నాడు. ఈ క్రమంలో కిస్తీ చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు గురువారం మధ్యాహ్నం రైతు రామారావు వద్దకు వచ్చారు. ఆ సమయాన ఆయన చర్ల మండలం పెమిడిసిలేరు సమీపంలో యంత్రంతో వరి కోసే పనుల్లో ఉండగా తీవ్రంగా ఒత్తిడి చేశారు. వరి కోశానని.. ధాన్యం అమ్మగానే కిస్తీ చెల్లిస్తానని చెప్పినా వినకుండా కంపెనీ ప్రతినిధులు వరికోత మెషీన్‌ను తీసుకుపోయారు. దీంతో మనస్తాపానికి గురైన రామారావు అక్కడే పురుగు మందు తాగాడు. వెంటనే సమీప రైతులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపే కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- 7న వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారి కల్యాణం
- మళ్లీ మార్చి 8న యాదవ సంప్రదాయం ప్రకారం మరొకసారి
- ఏప్రిల్ 8న అగ్నిగుండాల ప్రవేశంతో జాతర ముగింపు


మల్లన్న కల్యాణానికి ముమ్మరంగా ఏర్పాట్లు

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. యేటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వహించే స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. అలాగే ఫాల్గుణ మాసం చివరి సోమవారం నిర్వహించే అగ్నిగుండాల ప్రవేశాలతో జాతర ముగుస్తుంది. ఇదిలా ఉండగా ఆలయ నిర్వాహకులు మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో పాటు మరికొందరు మంత్రులకు అందజేశారు.

మూడు నెలల్లో రెండు మార్లు కల్యాణం

ఈ నెల 7వ తేదీన జాతర ప్రారంభమై ఏప్రిల్ 8వ తేదీన అగ్నిగుండాల ప్రవేశంతో ముగియనుంది. కొమురవెల్లి జాతర మూడు నెలల పాటు (12 ఆదివారాలు) కొనసాగుతుంది. స్వామివారి కల్యాణం రెండు పద్ధతుల్లో జరగనుంది. ప్రతి సంవత్సరం మార్గశిర మాసం చివరి ఆదివారం (ఈనెల 7న) వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణోత్సవం నిర్వహిస్తారు. తిరిగి మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని యాదవ సంప్రదాయం ప్రకారం మరోసారి స్వామివారి కల్యాణం (పెద్ద పట్నం) నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు.

తోటబావి దగ్గర ఏర్పాట్లు

ప్రతి ఏడాది తోటబావి దగ్గర మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో అక్కడ చలువ పందిర్లు వేస్తున్నారు. ఇప్పటికే దేవాలయం, తోటబావి దగ్గర నిర్మాణాలకు రంగులు వేశారు. ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేయనున్నారు.

భాష తెలియని 'మానవత్వానికి' జైలు

- గల్ఫ్ నుంచి హైదరాబాద్‌కు పొలాసవాసి విమాన ప్రయాణం
- పక్క సీట్లో చలికి వణుకుతున్న చిన్నారికి దుప్పటి కప్పే యత్నం
- అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆ చిన్నారి తల్లి ఫిర్యాదు
- భాష తెలియక విషయం చెప్పలేకపోయిన బాధితుడు జైలుపాలు
- తన భర్తను విడిపించాలని వేడుకుంటున్న భార్య



జగిత్యాల రూరల్: మానవత్వానికి భాష ఏమిటంటారా.. అయితే ఒక్కోసారి చేసిన సాయాన్ని సరిగ్గా చెప్పలేకుంటే ఏకంగా జైలు పాలవ్వాల్సి వస్తుందనేందుకు ఈ ఘటనే ఉదాహరణ. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి ఇంటికి వస్తుండగా మానవత్వంతో స్పందించే క్రమంలో చేయని నేరానికి జైలుపాలయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన బద్దెనపల్లి శంకరయ్య గత 14 ఏళ్లుగా సౌదీ అరేబియాలోని ఓ కంపెనీలో పని చేస్తూ వీసాపై వెళ్లి వస్తున్నాడు. డిసెంబర్ 12న రియాద్ నుంచి శ్రీలంక ఎయిర్‌లైన్స్‌లో హైదరాబాద్‌కు వస్తుండగా, అదే విమానంలో శ్రీలంకకు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కొలంబో వెళ్తోంది. విమానంలో ఆమె పిల్లలు చలి కారణంగా ఇబ్బంది పడుతుండగా, శంకరయ్య స్పందించి క్యాబిన్‌లోని బెడ్‌షీట్ తీసి పాపకు కప్పాడు. అయితే తన పాప పట్ల శంకరయ్య అసభ్యంగా ప్రవర్తించాడని సదరు శ్రీలంక మహిళ విమాన సిబ్బందికి ఫిర్యాదు చేసింది.


ప్రభుత్వాన్ని వేడుకుంటున్న శంకరయ్య భార్య, పిల్లలు

తాను ఏ తప్పూ చేయలేదన్నా వినకుండా..

శంకరయ్యకు తెలుగు తప్ప మరే భాష రాకపోవడంతో విమాన సిబ్బందికి తాను సాయం చేసిన విధానాన్ని చెప్పలేకపోయాడు. విమానం కొలంబోలో దిగిన వెంటనే పైలట్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ క్రమంలో శంకరయ్య తన వద్ద ఉన్న ఫోన్ ద్వారా పొలాసలో ఉన్న భార్య గంగలక్ష్మికి జరిగిందంతా చెప్పాడు. అక్కడి పోలీసులు శంకరయ్యను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా బెయిల్ మంజూరైంది. కానీ, అక్కడి పౌరసత్వం ఉన్న ఇద్దరు పూచీకత్తు ఇస్తేగాని విడుదలయ్యే అవకాశం లేదు. దీంతో పాటు కేసు విచారణ పూర్తయ్యే వరకు శ్రీలంక విడిచి వెళ్లరాదని అక్కడి కోర్టు ఆదేశాలిచ్చింది. అక్కడి వారు పూచీకత్తు ఇచ్చినా శ్రీలంక విడిచి వచ్చే పరిస్థితి లేపోవడంతో మార్చి 1వ తేదీకి కేసు వాయిదా వేశారు. అప్పటిలోగా సౌదీ అరేబియా వీసా కూడా గడువు ముగియనుంది. శంకరయ్య అటు ఉపాధి కోల్పోయి.. చేయని తప్పునకు దేశం కాని దేశంలో మగ్గుతుండటంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తన భర్తను ఎలాగైనా విడిపించాలని భార్య, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

టామ్‌కామ్ ద్వారా ఇజ్రాయెల్ వీసాలు

- ఇజ్రాయెల్‌లో వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో ఉపాధి అవకాశాలు
- దళారి వ్యవస్థ జోక్యం లేకుండా వీసాల జారీకి చర్యలు



మోర్తాడ్(బాల్కొండ): ఇజ్రాయెల్‌లో వ్యవసాయ, భవన నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆ దేశం జారీ చేస్తున్న వీసాల ప్రక్రియలో దళారుల జోక్యాన్ని నివారిస్తూ టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్) చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు టామ్‌కామ్ ఇజ్రాయెల్ వీసాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఇజ్రాయెల్‌లో పాలస్తీనా దేశస్తులు అధిక సంఖ్యలో ఉపాధి పొందేవారు. ఈ రెండు దేశాల మధ్య పోరు కొనసాగుతుండటంతో ఇజ్రాయెల్ తమ పొరుగు దేశమైన పాలస్తీనా వలస కార్మికుల రాకపోకలకు బ్రేక్ వేసింది. ఫలితంగా ఇజ్రాయెల్‌లో కార్మికుల కొరత తీవ్రమైంది. ఇజ్రాయెల్ పౌరులు ఎక్కువగా ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలను నిర్వహిస్తుంటారు. దాంతో ఆ దేశంలో కార్మికులుగా పని చేసేందుకు పరాయి దేశస్తుల అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో వలస కార్మికులకు దండిగా వీసాలను జారీ చేసేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ముందుకు వచ్చింది.

1.60 లక్షల మంది వలస కార్మికులకు ఉపాధి అవకాశాలు

గతేడాది మన విదేశాంగ శాఖతో ఇజ్రాయెల్ ప్రభుత్వం ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోగా వలస కార్మికులకు ఉపాధి కల్పించే అంశానికి ఆ దేశం ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో భాగంగా 1.60 లక్షల మంది వలస కార్మికులను మన దేశం నుంచి తీసుకెళ్లడానికి ఇజ్రాయెల్ వీసాల జారీ కోసం 12 కన్సల్టెన్సీలకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని టామ్‌కామ్.. ఇజ్రాయెల్ వీసాల జారీపై అవగాహన కల్పించి వలస కార్మికులు మోసపోకుండా ఉండటానికి ప్రచారం చేయడం ఆరంభించింది. వీసాల కోసం దళారులు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తుంటారు. టామ్‌కామ్ రంగంలోకి దిగి దళారుల ప్రమేయం లేకుండానే వీసాల జారీకి అవకాశం ఉందని ప్రచారం చేస్తోంది.

హైదరాబాద్‌లోనే నియామకాలు

హైదరాబాద్‌లోనే టామ్‌కామ్, న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) సంస్థల ఆధ్వర్యంలో వలస కార్మికులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అవకాశం ఉంది. ఇందుకోసం అభ్యర్థులు టామ్‌కామ్ మెయిల్ ఐడీకి దరఖాస్తులు పంపించడం, కార్యాలయం ఫోన్ నంబర్లకు సంప్రదించి వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

బీజేపీలో మనీ పాలి'ట్రిక్స్'!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి డబ్బు కూడా కారణమంటున్న నేతలు

- కొందరు పార్టీ ఫండ్‌ను ఖర్చుచేయకపోగా నొక్కేశారంటూ ఆరోపణలు
- మరికొందరి నేతలూ ఇలానే చేశారట
- ఇప్పుడు ఇదే విషయమై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయంపై నిరాశ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ హవాతో గెలుస్తామన్న ఆశల మధ్య ఊగిసలాడుతున్న బీజేపీలో ఇప్పుడు 'మనీపాలిట్రిక్స్'చర్చనీయాంశమయ్యాయి. మొన్న రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ పెద్దలు పంపించిన నిధులను కొంతమంది నేతలు ఖర్చు చేయకుండా వీలైనంత నొక్కేశారన్న ఆరోపణలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. పక్కాగా గెలుస్తామనుకున్న అసెంబ్లీ సెగ్మెంట్లను ఎంపిక చేసి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయానికి తగ్గట్టుగా ఓ మోస్తరుగా పార్టీఫండ్‌ను నేరుగా పార్టీ జాతీయ నాయకత్వమే పంపించినట్టు తెలుస్తోంది. కానీ ఆ నిధుల వినియోగం సరిగ్గా జరగకపోవడం వల్లనే గెలవాల్సిన కొన్ని సీట్లు కూడా కోల్పోవాల్సి వచ్చిందనే వాదనను ఇప్పుడు కొందరు నేతలు తెరపైకి తెస్తున్నారు. ఎన్నికల్లో ఓటమికి సవాలక్ష కారణాల్లో ఈ డబ్బు కూడా తన వంతు పాత్ర పోషించిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి వారు చేతివాటం చూపించారట

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో పలువురు అభ్యర్థులతో సహా కొందరు పార్టీ నాయకులు, ఇన్‌చార్జిలు పార్టీ ఫండ్‌తో సహా వివిధ రూపాల్లో డబ్బు వినియోగం విషయంలో చేతివాటం చూపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునేందుకు పార్టీలోని పాత-కొత్త నాయకులు, జూనియర్లు-సీనియర్లు అనే తేడా లేకుండా వ్యవహరించారంటూ నాయకత్వానికి ఫిర్యాదులు అందుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ సీటును ఇచ్చేవరకూ.. ఇన్ని రూ.కోట్లు, అన్ని రూ.కోట్లు పెడతామనీ, ఎంతైనా ఖర్చు చేస్తామన్న వారు సైతం, టికెట్ దక్కాక చేతులెత్తేసి ఎన్నికల వ్యయం పెరిగిపోయింది కాబట్టి డబ్బులు సర్దాలంటూ పార్టీని అడిగారని అంటున్నారు. తీరా ఇచ్చిన తర్వాత అవి సక్రమంగా పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదన్న ఫిర్యాదులే ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఈ తప్పులు లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాకుండా నాయకత్వం కచ్చితమైన చర్యలు తీసుకోవాలన్న వాదనలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. నిధుల వినియోగంలో ఆరోపణలు ఎదుర్కొన్నవారిని గుర్తించి ఎంపీ ఎన్నికల్లో పక్కన పెట్టకపోతే మరోసారి నష్టపోవాల్సి వస్తుందనే భావన కూడా కూడా పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌కు 10-14 లోక్‌సభ సీట్లు ఖాయం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 10 నుంచి 14 సీట్లు గెలవడం ఖాయమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి ధీమా వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, హామీలతో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మల్లు రవి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను ఖర్గేకు వివరించారు. గ్యారంటీల అమలు, నెలరోజుల ప్రజాపాలన సాగుతున్న తీరు సహా అన్ని అంశాలను ఖర్గేకు వివరించానన్నారు. గ్యారంటీల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి నిర్ణయాలు ప్రజలకు ఉపయోగపడేలా ప్రజాపాలన దిశగా సాగుతున్నాయని రవి చెప్పారు.

రైతుబంధు, రుణమాఫీ ఏమయ్యాయి?: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా రైతులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న వివరాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రైతుబంధు నిధుల గురించి మేధావులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. వరి ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా వేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ నిధులు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. డిసెంబర్ 9న రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.15 వేలు రైతుబంధు, రుణమాఫీ కింద రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం 11 పర్యాయాలు రైతుబంధు పథకం కింద రూ.72 వేల కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలి

బీజేపీ నేత మురళీధర్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన ప్రకటనలకు.. వచ్చాక చేస్తున్న ప్రకటనలకు పొంతన లేదని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణం, విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, భూముల ఆక్రమణ వంటి వాటిలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని గతంలో రేవంత్‌రెడ్డి డిమాండ్‌చేశారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వీటిపై సీఎం నోరు మెదపడం లేదన్నారు. శుక్రవారం మురళీధర్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంలో అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరితే కాంగ్రెస్‌కు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసేందుకు తావుండదు కాబట్టే దానిపై లైన్ మార్చుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అవినీతిపై న్యాయ విచారణకు బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే అందులో పూర్తి స్థాయి విచారణ జరిపే అధికారం సీబీఐకి మాత్రమే ఉందన్నారు. కాళేశ్వరంపై అవినీతి కేసును

ప్రభుత్వంపై బురద జల్లొద్దు


రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు, కుట్రలు బీఆర్‌ఎస్ నేతలు మానుకోవాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి హితవు పలికారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 28 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. రెండు హామీలను 48 గంటల్లో నెరవేర్చామని, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని, వచ్చే నెల నుంచి పెన్షన్‌ను ఒకటో తేదీన అందిస్తామని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రభుత్వం సమీక్షిస్తోందని చెప్పారు. జూన్ 2 వరకు విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకుల భూములు

అసైన్డ్, రహదారి భూములు కూడా...

- గాలిబ్ జంగ్‌కు చెందిన 1,700 ఎకరాలు ఆక్రమించారు
- వై.ఎస్. హయాంలో ఇచ్చిన భూముల్లోకి లబ్ధిదారులను రానివ్వట్లేదు... ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టాలి
- ఈ అంశంపై మల్లికార్జున్ ఖర్గే, సోనియా, రాహుల్‌ను కలుస్తా
- ఢిల్లీలో మీడియాతో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకులకు చెందిన భూములతోపాటు అసైన్డ్, రహదారి భూములున్నాయని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రామోజీ ఫిల్మ్ సిటీలో భూఆక్రమణలపై మీడియాతో ఆయన మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన 3 వేల ఎకరాల్లో 1,700 ఎకరాలు గాలిబ్ జంగ్‌కు చెందిన భూములున్నాయని... ప్రజారహదారులు, హరిజనుల భూములు, భూదాన్ భూములను సైతం కబ్జా చేశారని చెప్పారు. కార్మికుల చట్టాలను కూడా ఉల్లంఘిచారని, గతంలో ఈనాడులో పనిచేసిన వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. అనాజ్‌పూర్-ఇబ్రహీంపట్నం రహదారిని మూసేసి, కబ్జా చేశారని... దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గోనె పేర్కొన్నారు. దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో 682 మందికి 200 గజాల చొప్పున పట్టాలు ఇవ్వగా లబ్ధిదారులను వారి స్థలాల్లోకి రానివ్వట్లేదని గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. ఈ ఆస్తులను ప్రభుత్వం వెంటనే అధీనంలోకి తీసుకొని రామోజీరావుకు నోటీసులు జారీ చేయాలన్నారు. 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'చట్టం ప్రకారం నోటీసులపై రామోజీరావు కోర్టుకు వెళ్లడానికి వీల్లేదని... ఇది చాలా పటిష్టమైన చట్టమని చెప్పారు.

న్యాయ పోరాటం క్లైమాక్స్‌కు...

బ్రిటిష్ పాలకులు 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'అనే చట్టం తీసుకొచ్చారని, అందులో దేశవ్యాప్తంగా వివిధ రాజవంశాలకు చెందిన 560 మందిని చేర్చారని గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. నిజాం స్టేట్‌లో మార్వాడీ, ముస్లింలు తదితర 8 కుటుంబాలు ఉన్నాయన్నారు. అయితే ఈ రాజవంశీకులకు చెందిన రూ. లక్షల కోట్ల విలువైన ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని.. ఈ విషయంలో తాను చేస్తున్న పోరాటం క్లైమాక్స్‌కు వచ్చిందన్నారు. 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'చట్టం ప్రకారం రాజవంశీకుల మరణానంతరం వారి వారసులు మైనర్లయితే పరిశ్రమలు, ఆస్తులు, భూములను ప్రభుత్వం అధీనంలోకి తీసుకుంటుందని... వారసులు మేజర్లు అయ్యాక ఆ ఆస్తులను వారికి తిరిగి అప్పగిస్తుందని ఆయన చెప్పారు. అయితే తెలంగాణలో ఆ ఆస్తులు, భూములు అన్యాక్రాంతమయ్యాయని, రూ. లక్షల కోట్ల విలువైన 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'కిందకు వచ్చే ఆస్తులు ఒక పత్రికాధిపతి (రామోజీరావు), తెలుగు రాష్ట్రాల్లోనే నంబర్ వన్ బిల్డర్‌గా ఉన్న రామేశ్వరరావు అధీనంలో ఉన్నాయని గోనె ఆరోపించారు. వాటిలో పెద్దపెద్ద భవనాలు కట్టారని తెలిపారు. రాష్ట్రంతోపాటు అమెరికాలో పెద్ద పారిశ్రామికవేత్త, ఎయిర్‌పోర్టులు నిర్మించిన ఆయనకు స్టార్ హోటళ్లు కూడా ఉన్నాయని వాటిని తాజ్ గ్రూప్‌నకు ఇచ్చారని, అవి కూడా 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'భూములే అన్నారు.

రెండు రాష్ట్రాల సీఎంలు విచారణ చేపట్టాలి

రాజవంశానికి చెందిన వారందరినీ కలుపుకొని న్యాయం కోసం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీలను కలిసి ఆధారాలు అందిస్తానని గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ తరహా వ్యవహారాలు కర్ణాటకలోనూ ఉన్నందున చర్యలు తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఒక కమిటీ వేసి విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పత్రాలు, సమాచారం కోసం హైదరాబాద్‌లోని రాజ్యాభిలేఖ కార్యాలయానికి దరఖాస్తు చేశానన్నారు. 2008లో పాయిగా వంశానికి చెందిన 140 ఎకరాలు (రూ. 20 వేల కోట్ల విలువైన) రిలీజ్ అయ్యాయని తెలిపారు. దీనిపై రాయచూర్‌లోని ఆ కుటుంబంతో మాట్లాడానని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు హామీలిచ్చిన పథకాల అమలుకు ఆ ఆస్తులను వాడాలని కోరతామని చెప్పారు. లక్ష నాగళ్లతో (రామోజీ ఫిల్మ్‌సిటీని) దున్నిస్తానని చెప్పిన కేసీఆర్... సీఎం అయ్యాక కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి ఈ వ్యవహారాన్ని వివరిస్తానని చెప్పారు. ఆర్థిక చిక్కుల్లో నుంచి రాష్ట్రం బయటపడేందుకు తాను చెబుతున్న విషయం ఒక ఫార్ములా అని అన్నారు. ఈ సందర్భంగా గతంలో రామోజీరావు ఆక్రమణలపై 2010లో 'ఇండియా టుడే' ప్రచురించిన కథనాలను, పత్రాలను గోనె ప్రకాశ్‌రావు మీడియాకు చూపించారు.

సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- ప్రజలకు లబ్ధి కలిగించే పథకాల రద్దుపై నిరసన కార్యక్రమాలు
- గృహలక్ష్మి, దళితబంధు, గొర్రెల పంపిణీ లబ్ధిదారుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం
- ఆ పథకాలు రద్దు చేస్తే బలహీన వర్గాలు, దళితులకు ద్రోహం చేసినట్టే
- టెలి కాన్ఫరెన్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను రాజకీయ అక్కసుతో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసుకుంటూ వెళ్తోందని భారత్ రాష్ట్ర సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గత పదేళ్లలో లక్షలాదిమంది జీవితాల్లో మార్పు తెచ్చిన కార్యక్రమాలను సైతం రాజకీయ దురుద్దేశంతో పక్కన పెడుతోందని పేర్కొంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అనే విషయాన్ని కాంగ్రెస్ మరిచిపోయిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, అయితే గృహలక్ష్మిలో భాగంగా ఎంపికై, అధికారిక పత్రాలు అందుకున్న లబ్ధిదారుల పరిస్థితి ఏంటో ప్రభుత్వం తెలియజేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది యాదవుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలిగించిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కూడా రద్దు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదన్నారు. ఇప్పటికే ఈ పథకంలో భాగంగా తమ వాటా మొత్తం చెల్లించిన వారికి వెంటనే ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధును కూడా ప్రభుత్వం రద్దు చేయాలని ఆలోచిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దళితబంధును మరింతగా విస్తరించి రూ.12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి, ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులకు రూ.10 లక్షలు లేదా కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.12 లక్షలైనా వెంటనే అందించాలన్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటూ వెళ్లి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేస్తుందని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో కాంగ్రెస్ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో లబ్ధిదారులకు అండగా నిలబడేలా నిరసనలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌రావు తెలిపారు. లబ్ధిదారుల కోసం పార్టీ బాధ్యులంతా ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

అభివృద్ధి పనులు సైతం రద్దు

గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఈ ప్రభుత్వం రద్దు చేస్తోందని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మండిపడ్డారు. మున్సిపాలిటీలకు టీయూఎఫ్‌ఐడీసీ, ఇతర సంస్థల ద్వారా అందించిన అభివృద్ధి నిధుల మంజూరును ప్రభుత్వం రద్దు చేస్తోందని ఆరోపించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మంజూరును కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. దీనిపై లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఎవరెవరికి... ఏమేమిద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

పడుతుందా అన్నది చర్చనీయాంశమవుతోంది.

లోక్‌సభ ఎన్నికల్లోగా ఖాయం

అయితే లోక్‌సభ ఎన్నికల్లోగా కచ్చితంగా నామినేటెడ్ భర్తీ ఉంటుందనే చర్చ జరుగుతుండగా, సంక్రాంతిలోగా భర్తీ చేస్తే తొలి దఫాలో 10 కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులే నింపుతారని, అదే జాప్యం జరిగితే కొన్ని పెరగొచ్చని తెలుస్తోంది. కాగా, తొలిదఫా నామినేటెడ్ పందేరంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం దొరకని వారు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, జిల్లా స్థాయిలో ముఖ్య హోదాల్లో ఉన్న వారికి మాత్రమే అవకాశముంటుందని సమాచారం.

ఆశావహులు ఎవరెవరంటే..

ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలిస్తే ఒబేదుల్లా కొత్వాల్, చారకొండ వెంకటేశ్, రాజీవ్‌రెడ్డి, కేతూరి వెంకటేశ్ (మహబూబ్‌నగర్), కె.కె.మహేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రమ్యారావు, నేరెళ్ల శారద (కరీంనగర్), చల్లా నర్సింహారెడ్డి, పారిజాతా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ముంగి జైపాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సామా రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), విశ్వప్రసాద్, నల్లాల ఓదెలు (ఆదిలాబాద్), రవళి, వెన్నం శ్రీకాంత్ (వరంగల్), మెట్టు సాయికుమార్, మోతె రోహిత్, నూతి శ్రీకాంత్ (హైదరాబాద్), అన్వేశ్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్, కాసుల బాలరాజు, గడుగు గంగాధర్ (నిజామాబాద్), త్రిషా దామోదర్, ఆంజనేయులు గౌడ్ (మెదక్), బొర్రా రాజశేఖర్, లోకేశ్‌యాదవ్, కోటా రాంబాబు, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, సాధు రమేశ్‌రెడ్డి, నాగా సీతారాములు, తూళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు యాదవ్, శంకర్‌నాయక్, పున్నా కైలాశ్‌నేత, సర్వయ్య, ముత్తినేని వీరయ్య వర్మ, చెవిటి వెంకన్న యాదవ్ (నల్లగొండ) తదితరులు కీలక కార్పొరేషన్లు ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరితోపాటు గత ఎన్నికల్లో ఓడిన కీలక నేతలు కూడా బడా కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. మరికొన్ని కార్పొరేషన్లతోపాటు డైరెక్టర్ల స్థానాలను ఆశిస్తున్న కాంగ్రెస్ నేతల సంఖ్య 3 వేలకుపైగా ఉన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వారిలో కొందరికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో సబిత, మధుసూదనాచారి, కేకే, రంజిత్‌రెడ్డి, కడియం, మహేందర్‌రెడ్డి తదితరులు

మన పార్టీ వాళ్లే ఓడించారు!

- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మధ్య వాగ్వాదం
- చేవెళ్ల పార్లమెంటు సన్నాహక సమావేశంలో రచ్చకెక్కిన బీఆర్‌ఎస్ విభేదాలు
- సర్దిచెప్పిన హరీశ్‌రావు... కుటుంబ సమస్య అన్న మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహిస్తున్న పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం వేదికగా పార్టీలోని అంతర్గత విభేదాలు బహిర్గతమవుతున్నాయి. శుక్రవారం జరిగిన చేవెళ్ల సమావేశంలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మన వాళ్లే పనిచేశారని ఓడిన నాయకుడు వ్యాఖ్యానించడం కలకలం రేపింది. తాండూరు అసెంబ్లీస్థానం నుంచి ఓడిపోయిన పైలట్ రోహిత్‌రెడ్డి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిపై సభా వేదికగానే విమర్శలు చేసినట్టు తెలుస్తోంది.

ఓడిన నేతను వేదికపై ఎలా కూర్చోబెడతారు?

సమావేశంలో పైలట్ రోహిత్‌రెడ్డిని వేదికపై కూర్చోబెట్టడాన్ని పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు తప్పు పట్టడంతో వివాదం రేగింది. ఓడిపోయిన నాయకున్ని స్టేజీ మీద ఎలా కూర్చోబెడతారని, రోహిత్‌రెడ్డిని కిందికి దించాలని మహేందర్‌రెడ్డి వర్గం పట్టుపట్టింది. అదే సమయంలో మహేందర్ రెడ్డి మాట్లాడేందుకు మైక్ తీసుకోగా, ఆయన వల్లనే ఓడిపోయామని పైలట్ రోహిత్‌రెడ్డి వర్గీయులు ఆందోళనకు దిగారని సమాచారం. ఈ సమయంలోనే మహేందర్‌రెడ్డి కారణంగానే తాను ఓడినట్లు రోహిత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. దీంతో మహేందర్ రెడ్డి సైతం రోహిత్‌పై విమర్శలు చేసినట్లు చెబుతున్నారు. ఓ సమయంలో సమావేశ మందిరంలో గందరగోళం నెలకొంది. ఇరువర్గాల కార్యకర్తలు అరుచుకుంటూ కుర్చీలు విసిరేసే వరకు వెళ్లినట్లు సమాచారం. దీంతో వేదికపై ఉన్న మాజీ మంత్రి టి. హరీశ్‌రావు జోక్యం చేసుకొని పైలట్ రోహిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ సమావేశంలో గొడవ పడితే తప్పుడు సంకేతాలు వెళతాయని ఇద్దరినీ సముదాయించి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.

రోహిత్‌రెడ్డితో చిన్నపాటి వాగ్వాదం: పట్నం మహేందర్ రెడ్డి

చేవెళ్ల లోక్‌సభ స్థానానికి రంజిత్‌రెడ్డి మళ్లీ పోటీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సమావేశం అనంతరం ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కలిసి కట్టుగా పని చేయాలని నిర్ణయించామని, మరోసారి గెలిపిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలపై కొందరిలో ఆవేదన ఉందని, ఇప్పుడన్నీ సమసిపోయాయన్నారు. ఇల్లు అన్నప్పుడు ఏవో చిన్న చిన్న సమస్యలు సహజమని, అందులో భాగంగానే రోహిత్‌రెడ్డితో చిన్నపాటి వాగ్వాదం జరిగినట్లు చెప్పారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని చేవెళ్ల ఎంపీ జి. రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ సన్నాహక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆరే తన బలం, చేవెళ్ల పార్లమెంట్ ప్రజలే తన బలగమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఎజెండాతోనే ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

ఆలోచించి మాట్లాడండి


కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ హితవు



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదిన్నరేళ్ల బాధలు పడ్డ ప్రజానీకానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండటాన్ని జీర్ణించుకోలేని కేటీఆర్ చిల్లర మాటలు, చిల్లర విమర్శలు చేస్తున్నారని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నా.. 100 రోజుల్లో ప్రభుత్వం పడిపోతదని ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. కేటీఆర్ మాట్లాడే ముందు కొంచెమైనా ఆలోచిస్తే బాగుంటుందని హితవు పలికారు. తొమ్మిదిన్నరేళ్ల ప్రజల సొమ్మును తిన్న బీఆర్‌ఎస్ నేతలు ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారని కొండా సురేఖ దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకొని, ఉద్యమకారులను బయటకు పంపిన చరిత్ర ఎవరిదని ప్రశ్నించారు. మహిళలపై దాడులు జరిగినప్పుడు, కొండగట్టు మీద జరిగిన ప్రమాదంలో 63 మంది చనిపోతే స్పందించని నాయకులు ఇప్పుడు ప్రజల మీద ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. వరంగల్‌లో సెంట్రల్ జైల్‌ను కూల్చి హాస్పిటల్ కట్టడం ఎందుకు? హాస్పిటల్‌ను మంచి వాతావరణంలో కడితే బాగుంటది అని చెప్తే.. దాన్ని తప్పుగా ప్రచారం చేస్తున్న వారికి ఇంగిత జ్ఞానం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు హామీలను అమల్లోకి తెచ్చింది తమ ప్రభుత్వమని చెప్పారు. కాళేశ్వరంపై న్యాయ విచారణ అనగానే.. కేసీఆర్, కేటీఆర్‌కు వణుకు మొదలైందని, ఎవరెవరి వాటా ఎంతో.. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో కక్కించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కొండా సురేఖ తెలిపారు.

అంతర్రాష్ట్ర ఉద్యోగ బదిలీలను వేగవంతం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని లేఖ



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఏపీ విభజనానంతరం గతంలో ఆప్షన్ ఇవ్వని ప్రభుత్వ ఉద్యోగులను (జిల్లా, జోనల్, మల్టీ జోనల్) వారు కోరుకున్న రాష్ట్రానికి బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఏపీ నుంచి తెలంగాణకు 1,808 మంది.. తెలంగాణ నుంచి ఏపీకి 1,396 మంది గత ప్రభుత్వాలు సర్క్యులర్ల ప్రకారం దరఖాస్తు చేసుకున్నారన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి 1,396 మంది ఉద్యోగుల బదిలీ కోసం ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఏపీ నుంచి తెలంగాణకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న 1,808 మంది ఫైలు 18 నెలల నుంచి తెలంగాణ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు.

రేవంత్ పాలన బాగుంది

- కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- టైం బాగోలేక ఓడిపోయా.. నా పేరే ఓ బ్రాండ్
- నేను సభలో ఉంటే హరీశ్, కేటీఆర్‌లను ఆడుకునేవాడిని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పాలన బాగుందని, పరిపాలనను పరుగులు పెట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కితాబిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో రేవంత్, భట్టి ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌ను, రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని తెగేసి చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బెంజి కార్లలో తిరిగే కేటీఆర్, హరీశ్‌రావులకు ఆర్టీసీ బస్సు విలువ తెలియదని అన్నారు. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే సీఎం మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ప్రారంభించారని, ఇప్పటి వరకు 6 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా తిరిగారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని అన్నారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు రెచ్చిపోతున్నారని వ్యాఖ్యానించిన జగ్గారెడ్డి.. తాను సభలో ఉంటే వారిద్దరినీ ఆడుకునేవాడినని అన్నారు. టైం బాగోలేక ఓడానన్నారు. జగ్గారెడ్డికి పదవులతో బ్రాండ్ రాలేదని, తన పేరే ఓ బ్రాండ్ అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌కు మైక్ ఇచ్చారా?: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో కాంగ్రెస్ వాళ్లకు మైక్ ఇచ్చారా? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కనీసం ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లలేదని, ఇప్పుడు తాము సచివాలయంలో ఫైళ్ల దుమ్ము దులుపుతున్నామని అన్నారు.

> పరబ్రహ్మాను తెలుసుకొన్న వ్యక్తి అనుభవంలో సర్వభూతాలూ ఏకైక ఆత్మ (పరమాత్మ) స్వరూపాలుగా వ్యక్తమయ్యే స్థితిలో ఉంటాడు. ఏకమాత్ర పరమాత్మను (ఏకత్వాన్ని) దర్శించే జ్ఞానికి మోహం, శోకం ఎందుకుంటాయి?
> – ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 6 జనవరి 2024

హసీనాకు అగ్నిపరీక్ష!

మెరిసేదంతా మేలిమి అని ప్రజానీకాన్ని నమ్మిస్తే ఓట్ల వర్షం కురవొచ్చు. ఒకటికి రెండుసార్లు ఆ చిట్కా పనిచేసి అధికారం వచ్చినా రావొచ్చు. కానీ ఎల్లకాలం అదే మంత్రం ఫలించదని బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ నాలుగో దఫా నెగ్గేందుకు పడుతున్న అవస్థలను గమనిస్తే అర్థమవుతుంది. ఆదివారం బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ఎన్నికలు సవ్యంగా సాగుతాయనీ, ప్రజలంతా తన పక్షమేననీ హసీనా ఇప్పటికీ నమ్మబలుకుతున్నారు. పోలింగ్ కేంద్రాల ముందు బారులుతీరి ఓటు హక్కు వినియోగించుకోవటం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం బతికేవుందని చాటాలంటూ పౌరులకు ఆమె విన్నపాలు చేస్తున్నారు. అటు విపక్షం హసీనా నయవంచనను బట్టబయలు చేయాలని ప్రజలను కోరింది. ఈ ఎన్నికలను బహిష్కరించి, శని ఆదివారాల్లో దేశవ్యాప్త హర్తాళ్ పాటించాలని పిలుపునిచ్చింది. బంగ్లాలో అటు ఎన్నికల తంతు, ఇటు బహిష్కరణ పిలుపు రెండూ సాధారణ ప్రజలకు విసుగు తెప్పిస్తున్నాయి. 2014 ఎన్నికలను విపక్ష బంగ్లా నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) బహిష్కరించింది. తదనంతర ఎన్నికల్లో పోటీలో దిగి, చివరి నిమిషంలో ఆ పార్టీ ముఖం చాటేసింది. 2014లో 39 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 2019 నాటికి అది ఒక్కసారిగా 80 శాతానికి ఎగబాకింది. గత ఎన్నికల్లో అవామీ పార్టీ నేతృత్వంలోని కూటమికి 300 స్థానాల్లో ఏకంగా 96 శాతం స్థానాలు... అంటే 288 రాగా, బీఎన్‌పీ కూటమికి ఏడంటే ఏడే వచ్చాయి. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ అధికార పక్షంపై రిగ్గింగ్ ఆరోపణలు రివాజు. అయితే గత ఎన్నికలకూ, ఇప్పటికీ తేడా కొట్టొచ్చినట్టు కనబడుతోంది. అప్పట్లో హసీనా గెలుపుపై ఎవరికీ సంశయాలు లేవు. మెజారిటీ విషయంలోనే భిన్న స్వరాలు వినిపించాయి. ఈసారి అలాకాదు. ఏం చేసైనా నెగ్గి తీరాలన్న సంకల్పంతో అన్ని రకాల మాయోపాయాలకూ సిద్ధపడుతున్నారని విపక్షంతోపాటు పౌరసమాజ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

యాభై రెండేళ్ల క్రితం హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ నేతృత్వంలో పాకిస్తాన్ పాలకులపై పోరాడి బంగ్లా విముక్తి సాధించింది. ఆ వెంటనే ముజిబుర్ రెహమాన్‌ను కూలదోసి సైన్యం అధికారాన్ని ఆక్రమించింది. ఆయన్ను దారుణంగా కాల్చిచంపింది. వెంటవెంటనే జరిగిన మార్పుల్లో జనరల్ జియావుర్ రెహమాన్ అధికారం చేజిక్కించుకుని అనంతర కాలంలో దేశాధ్యక్షుడయ్యారు. బీఎన్‌పీ ఆయన నేతృత్వంలోని పార్టీయే. మరో సైనిక పాలకుడు హెచ్ఎం ఎర్షాద్ సైతం జాతీయ పార్టీని ఏర్పాటుచేశారు. మొత్తానికి మూడు సైనిక తిరుగుబాట్లు, దాదాపు 20 వరకూ విఫల తిరుగుబాట్లతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సైనిక పాలకులు ఎన్నికలు లేకుండా చేసి, పౌరుల ఓటుహక్కుకు ఎగనామం పెడితే... ప్రజాస్వామ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన పార్టీలు దొంగ ఓట్లతో, హింసతో దాన్ని మరింత నీరుగార్చాయి. తనకు మెజారిటీ ప్రజల మద్దతున్నదని చెప్పే హసీనా తొలి, మలి దఫాలకు మించి మూడోసారి పూర్తి స్థాయి నియంతగా మారారని, అసమ్మతి స్వరాలను అణిచేశారని ఆమె వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ కేసుల్లో ఇరుక్కుని 22,000 మంది విపక్ష నేతలు, కార్యకర్తలు జైళ్లలో మగ్గుతున్నారు. అధిక ధరలు తగ్గించాలని, ఉపాధి కల్పించాలని ఉద్యమించినవారిని హసీనా సర్కారు శత్రువులుగా చూస్తోంది.

హసీనా తొలిసారి అధికారంలోకొచ్చిన రోజులతో పోలిస్తే ఇప్పుడు కరెంటు కోతలు లేవు. దేశం పచ్చగా కనబడుతోంది. అడిగిందే తడవుగా విదేశీ మదుపుదారులు ఉదారంగా అప్పులిచ్చారు. ఆర్థిక రంగం పుంజుకోవటంతో నగరాలు మెరిసిపోతున్నాయి. ఆకాశాన్నంటే భవంతులు, ఎక్స్‌ప్రెస్ వేలు, వంతెనలు, భారీ దుకాణ సముదాయాలు, దిగుమతి చేసుకున్న వినియోగ వస్తువులు విస్మయపరుస్తున్నాయి. కానీ ఇప్పుడిప్పుడే ఇదంతా తిరబడుతున్న దాఖలాలు కనబడుతున్నాయి. అందాల పరదాల మాటున పాతరేసినవన్నీ పైపైకి తోసుకొచ్చి నిలదీస్తున్నాయి. బ్యాంకులు వేల కోట్లలో ఇచ్చిన అప్పులన్నీ పారు బాకీలుగా మారి బావురుమన్నాయి. ఖజానాలో కరెన్సీ మాయమై, ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటి దేశ ఆర్థిక వ్యవస్థ బిత్తరచూపులు చూసింది. విదేశీ పెట్టుబడులతో మొదలుపెట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం సరైన పర్యవేక్షణ కొరవడి నత్తనడకన సాగింది. వ్యయం అనేక రెట్లు పెరిగింది. పల్లెటూళ్లు తెల్లముఖం వేశాయి. ఉపాధి కరువై గ్రామీణులు నగరాలకు, పట్టణాలకు వలసలు కట్టారు. కరెంట్ అకౌంట్ సంక్షోభం పీల్చి పిప్పి చేస్తుండగా ఒకనాడు పైపై మెరుగులు చూసి ఎగబడి పొగిడిన అంతర్జాతీయ మీడియా వరస కుంభకోణాల వైనాన్ని వెల్లడిస్తున్నకొద్దీ దేశంలో అశాంతి ప్రబలింది. ఉద్యమాలు వెల్లువెత్తాయి. వాటి అణచివేత తప్ప హసీనా దగ్గర మరే ప్రత్యామ్నాయం లేకపోవటం విషాదాల్లోకెల్లా విషాదం.

దేశాన్ని దక్షిణాసియాలోనే 'ఎకనామిక్ టైగర్'గా రూపొందించానని ఒకనాడు సగర్వంగా చాటుకున్న హసీనా సంక్షోభంపై సరైన సంజాయిషీ ఇవ్వలేకపోతున్నారు. మానవ హక్కుల ఉల్లంఘనలపై ఇంటా బయటా ఆరోపణలు పెరుగుతున్నాయి. ఈ ఉల్లంఘనల బాధ్యులకు తమ దేశంలో ప్రవేశం ఉండబోదని అమెరికా ప్రకటించింది. వైఫల్యాలకు పాలక విపక్షాలు రెండూ బాధ్యత వహించాలని ప్రజలు భావిస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. అయితే ఇతర నేతలతో పోలిస్తే హసీనాయే ఉన్నంతలో మెరుగని మెజారిటీ పౌరులు విశ్వసిస్తుండటం విశేషం. ఏకపక్షంగా సాగే తాజా ఎన్నికల తంతులో విజయం మాటెలావున్నా హసీనాకు ముందుముందు గడ్డు పరిస్థితులు తప్పవు. ఆమె విఫల నేతగా మిగులుతారా, తప్పులు దిద్దుకుని దేశాన్ని గట్టెక్కిస్తారా అన్నది చూడాల్సివుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.దశమి రా.8.54 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: స్వాతి సా.6.22 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: రా.12.14 నుండి 1.54 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.31 నుండి 8.04 వరకు, అమృతఘడియలు: ఉ.8.56 నుండి 10.34 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అమెరికాలో తగ్గని ట్రంప్ హవా?

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడంపై చాలామందికి సందేహాలు ఉండవచ్చు. కానీ, ఆయనకు దేశంలో మద్దతుదారులు పెరుగుతున్నారనే చెప్పాలి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ట్రంప్‌కు రెండు రకాల ఇమేజ్‌లు ఉండటం. ఒకవైపేమో చట్టాలను కఠినంగా అమలు చేసే వ్యక్తిగా, సుస్థిర ఆర్థిక వ్యవస్థను అందించగలిగేవాడిగా, యుద్ధాలకు దూరంగా ఉండేవాడిగా చూస్తూంటే... ఇంకోవైపేమో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపేవాడిగా, వ్యవస్థలపై దాడి చేసేవాడిగా, దేశ ప్రాథమ్యాలను మార్చేసే వ్యక్తిగా చూస్తున్నారు. ఏమైనా ట్రంప్‌కు ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ మాత్రం సర్వేలను నమ్మొద్దనీ, తానే మళ్లీ అధికారంలోకి రానున్నాననీ ధీమాగా చెబుతున్నారు.

అమెరికాలోని ఈశాన్య కారిడార్‌లో ఇటీవల జరిగిన పలు సంభాషణలు డోనాల్డ్ ట్రంప్‌కు ఆదరణ పెరిగిన విషయాన్ని నిరూపిస్తాయి. కేంబ్రిడ్జ్‌లోని మసాచూసెట్స్‌లో తొలితరం అమెరికన్, హైతీ సంతతి మహిళ తన రోజువారీ కష్టాలను వెళ్లగక్కుతోంది. రెండ్రెండు ఉద్యోగాలు చేస్తున్నా తన ముగ్గురు పిల్లలతో జీవనం దుర్భరమవుతోందని ఆమె వాపోయింది. అంతేకాదు... ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలకు అమెరికా మద్దతుగా నిలవడాన్ని కూడా ప్రశ్నిస్తోంది. డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నామంటూ ఆక్షేపిస్తోంది. అదే సమయంలో దేశంలో అక్రమ చొరబాటుదారులు పెరిగిపోతూండటం కూడా ఆమెకు రుచించడం లేదు. చట్టబద్ధంగా దేశంలోకి వస్తున్న వాళ్లు పౌరసత్వం పొందేందుకు ఏళ్ల తరబడి తంటాలు పడుతూంటే, అక్రమ వలసదారులు మాత్రం ఎంచక్కా మంచి జీవితాన్ని అనుభవిస్తున్నారన్నది ఆమె ఆరోపణ. ఈ ఆర్థిక, వలసల సమస్యలకు బాధ్యుడు జో బైడెన్ అని ఆమె నిశ్చితాభిప్రాయం. అందుకే తాను ఈసారి ట్రంప్‌కు ఓటేస్తానని చెబుతోంది. ట్రంప్‌పై క్రిమినల్ కేసులున్న విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు. వ్యవస్థ తమలాంటి ప్రజల మాదిరే ట్రంప్‌ను కూడా హింసిస్తోందని అంటోంది.

న్యూయార్క్‌లోని ఓ యువ ఊబర్ డ్రైవర్ ఏమంటున్నాడో చూడండి. డొమినికన్ రిపబ్లిక్ నుంచి వలస వచ్చిన ఈ యువకుడు 2016లో ట్రంప్‌కు ఓటేయవద్దని తన మిత్రులందరికీ చెప్పాడు. ఇప్పుడు మాత్రం తన ఆలోచనలు మారిపోయాయని అంటున్నాడు. బైడెన్ఏలుబడిలో నేరాలు పెరిగిపోయాయని అతడి ఆరోపణ (నిజానికి తగ్గాయి). అమెరికా యుద్ధాల్లో చిక్కుకుపోవడం కూడా ఇతడికి ఇష్టం లేదు. బైడెన్ వృద్ధుడు అయ్యాడని ఈ యువకుడి నమ్మకం (బైడెన్‌కు 81 ఏళ్లు. ట్రంప్‌కు 77). జనవరి 6 (2021) ఘటన (క్యాపిటల్‌పై ట్రంప్ అనుచరుల దాడి) మీద భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, వలసదారుల సమస్య అతడిని పీడిస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకూ న్యూయార్క్ నగరం దాదాపు 16,000 కాందిశీకుల నివాసానికి అనుమతులు జారీ చేసింది. ఇప్పటికే పనిభారంతో ఉన్న నగర పరిపాలన వ్యవస్థ మరో 68,000 మంది బాగోగులు చూసుకుంటోంది. ఈ చర్యలు కాస్తా అక్రమ వలసల విషయంలో ప్రజల్లోని వ్యతిరేక భావనలను మరింత పెంచుతున్నాయి. ఈ వ్యతిరేకత అటు డెమొక్రాట్లతోపాటు ఇటు రిపబ్లికన్లలోనూ కొనసాగుతూండటం గమనార్హం.

వాషింగ్టన్ డీసీలో ఉంటున్న సియెర్రా లియోన్ జాతీయుడి ఆలోచనలు ఎలా ఉన్నాయో చూడండి. 2008లో వలస వచ్చిన ఈ వ్యక్తి ఇప్పుడు అమెరికన్ పౌరుడు. ట్రంప్‌కు ఓటేసేందుకు ఎదురు చూస్తున్నాడు. ఉక్రెయిన్, ఇజ్రాయెల్‌లకు అమెరికా ఎందుకు మద్దతిస్తోందో ఇతడికి అర్థం కావడం లేదు. బైడెన్ చాలా యుద్ధాలు చేస్తున్నాడంటాడు. ట్రంప్ అధికారంలోకి వస్తే ఇజ్రాయెల్‌కు మద్దతు మరింత



పెరుగుతుందన్న వాదనను తిప్పికొడుతున్నాడు. బైడెన్ ఏలుబడిలో రోజువారి వెచ్చాల ధరలు, అద్దెలు పెరిగిపోయాయనీ, ఆఫ్రికా దేశపు వ్యక్తిగా, ముస్లింగా జాతి వివక్ష విషయంలో డెమొక్రాట్లు, రిపబ్లికన్లలో తేడా ఏమీ లేదంటాడు.

రిపబ్లికన్ల వైపు అనూహ్య మొగ్గు

ఎక్కడైనా సరే, రాజకీయ వాతావరణం ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఆయా పార్టీల మూలభూతమైన మద్దతుదారులు నమ్మకంగా ఉన్నారా, లేదా? అన్నది ఒక ప్రామాణికమవుతుంది. తన ప్రాబల్యాన్ని విస్తరించుకోవడం ఇంకో కొలమానం. ఇప్పటివరకూ చెప్పుకున్న సంభాషణలన్నింటినీ ఒకసారి పరిశీలిస్తే ట్రంప్‌కు ప్రాథమిక స్థాయిలో ఉన్న ఆదరణ తగ్గలేదు సరికదా... ఎంతో కొంత పెరిగిందని స్పష్టమవుతుంది. హైతి, డొమినికన్ రిపబ్లిక్, సియెర్రా లియోన్‌లకు చెందిన అమెరికన్ పౌరులు ట్రంప్ మద్దతుదారులుగా మారతారని ఎవరూ ఊహించరు. అయితే సర్వేలు, ఇతర అంశాలను పరిశీలిస్తే స్పానిష్, నల్లజాతీయుల్లో ఒక వర్గం కూడా నెమ్మదిగానైనా డెమొక్రాట్ల నుంచి రిపబ్లికన్ల వైపునకు మొగ్గుతున్నట్లు తెలుస్తుంది.

జాతి ఆధారిత సమూహాలను కాసేపు పక్కనబెడితే... మిగిలిన వర్గాల్లో మాత్రం ట్రంప్ మాటలు బలమైన ముద్రే వేశాయని చెప్పాలి. కొంత తప్పుడు సమాచారం, ఎన్నికల సంవత్సరంలో జోబైడెన్ ప్రభుత్వ పోకడలపై నెలకొన్న అసంతృప్తి వీటికి ఆజ్యం పోస్తున్నాయి. వేర్వేరు వర్గాలు ట్రంప్ నుంచి వేర్వేరు రకాల సందేశాలు అందుకుంటున్నాయి. ఒక్కటైతే వాస్తవం. ట్రంప్ ఆదరణ పైపైకి పోతోంది. కాకపోతే ఇందుకు భిన్నమైన పార్శ్వాలు ఉన్నాయి.

బాగున్న బైడెన్ రికార్డ్

మొదటిది... ప్రస్తుతమున్న ప్రజల మూడ్ ఈ క్షణానికి సంబంధించింది మాత్రమే. ప్రచారం చేసేవారికి ఫీడ్‌బ్యాక్ లూప్‌గా ఉపయోగపడుతుంది కానీ విలువ తక్కువ. 2024 నవంబరులో ఏమవుతుందో ఎవరికీ తెలియదు. ట్రంప్ మళ్లీ ఈ స్థాయిలో పుంజుకుంటాడని గత ఏడాది ఎవరు ఊహించారు?

రెండు... ట్రంప్ ఎదుర్కొంటున్న కేసులు పెద్ద సవాల్లే విసరనున్నాయి. కొలరాడో, మైన్‌లలో నమోదైన కేసుల్లో ఓటుపై నిషేధం పడటం ట్రంప్‌కు లాభిస్తోంది. బాధితుడిగా ప్రచారం చేసుకుంటున్నారు. సుప్రీంకోర్టు ఈ తీర్పులను రద్దు చేయవచ్చు. కానీ ఓ పార్టీ తరఫున అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న వ్యక్తి నాలుగు క్రిమినల్ శిక్షలు ఎదుర్కొంటున్నాడన్నా, పోలింగ్ రోజుకు ముందు మరిన్ని కేసులు ఎదుర్కునే అవకాశం ఉందన్నా దాని ప్రభావం ఓటింగ్‌పై కచ్చితంగా ఉంటుంది.

మూడు... బైడెన్ స్థానిక ఎన్నికల ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అయినప్పటికీ 1973లో తొలిసారి సెనేటర్‌గా ఎన్నికై అంచలంచెలుగా ఎదిగిన బైడెన్ ఇలాంటి స్థితి నుంచి బయటపడటం చాలా సార్లు చూశాము. పాలన విషయంలో ఆయనపై ఎలాంటి మచ్చ లేకపోవడం, కోవిడ్ నుంచి సమర్థంగా బయటపడటం, ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి వంటి అంశాల్లో చక్కటి సమతౌల్యం కనిపిస్తూండటం బైడెన్‌కు కలిసివచ్చే అంశాలు. ఈ చర్యలన్నింటి ఫలితం కూడా వడ్డీరేట్లు, ధరలు తగ్గడంలో ప్రతిఫలిస్తోంది. అదే సమయంలో మార్కెట్ కూడా పుంజుకుంటూండటం గమనార్హం. మౌలిక సదుపాయాలు, వాతావరణం, తయారీ రంగాలకు సంబంధించి బైడెన్ ఇప్పటికే విప్లవాత్మకమైన కొన్ని చట్టాలను ఆమోదింపజేసుకున్నారు.

బైడెన్‌కు ఇంకో రెండు సానుకూల అంశాలున్నాయి. అబార్షన్‌పై వచ్చిన తీర్పు విషయంలో రిపబ్లికన్లపై బోలెడంత వ్యతిరేకత ఉంది. ట్రంప్ ఒంటెత్తు పోకడలపై కూడా ప్రజల్లో అభ్యంతరాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ యుద్ధం కొంతమంది వామపక్ష, ముస్లింల ఉత్సాహాన్ని దెబ్బకొట్టినప్పటికీ, యూదుల మద్దతు బైడెన్‌కు లభించేలా చేసింది. అందుకేనేమో బైడెన్ చైనా అధ్యక్షుడికి సైతం సర్వేలను నమ్మొద్దనీ, తానే మళ్లీ అధికారంలోకి రానున్నాననీ ధీమాగా చెప్పారు.

చివరగా... అమెరికాలోని రెండు పార్టీలకూ దాదాపుగా సమ స్థాయిలో మద్దతు ఉంది. అందుకే అమెరికాను 47 శాతం– 47 శాతం దేశమంటారు. రాష్ట్రాలకు రాష్ట్రాలు అటు ఇటో మొగ్గి ఉంటాయి. అన్ని అధ్యక్ష ఎన్నికల ఫలితాలు అటు ఇటూ మారిపోయే ఆరు లేదా ఏడు స్వింగ్ స్టేట్స్‌పై ఆధారపడి ఉంటాయి. అరిజోనా, నెవడా, మిషిగన్, విస్కాన్సిన్, జార్జియా, పెన్సెల్వేనియాల్లోని కొన్ని వేల మంది ఓటర్లు ఎటు మొగ్గు చూపుతారన్న అంశంపై అధ్యక్షుడి ఎన్నిక ఆధారపడి ఉంటుంది. కాకపోతే ప్రస్తుతానికి మాత్రం పరిస్థితి డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా ఉందని చెప్పకతప్పదు.

వ్యాసకర్త వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



చివరకు మిగిలేది



ఎవరూ నీ వాస్తవ స్నేహితులు కారు. నువ్వు ఈ ప్రపంచంలోకి ఒంటరిగా వస్తావు. ఒంటరిగా పోతావు. ఈ ప్రయాణంలో కొన్ని అనుభవాలు ఉంటాయి. కానీ, ఉండిపోయేదల్లా నీ ఆత్మతో నీ సంధానం.

– కామ్యా బుచ్, డిజిటల్ నోమడ్

రెండూ కావాలంటే...



చాలామంది ఐఏఎస్ అధికారులు అవినీతిపరులు. నిజాయితీగా ఉన్నవారిలోనేమో చాలామందికి అత్యంత పొగరు. అవినీతికి పాల్పడకపోతే ఇక వారికి దేవుడి హోదా వస్తుందని అనుకుంటారు. నేను వందలాది మంది 'బాబు'లను కలిసివుంటాను. బహుశా ఇద్దరు మాత్రమే నీతిపరులు, నిరాడంబరులు.

– రామ్‌ప్రసాద్ సి., ఆంత్రప్రెన్యూర్

ఆలయమే ఆధారం



అయోధ్యలోని రామాలయం ఇంకా నిర్మాణంలోనే ఉంది. పూర్తికావడానికి ఇంకో 2–3 ఏళ్లు పట్టేట్టుంది. జనవరి 22న 'ప్రాణ ప్రతిష్ఠ' చేయడం రాజకీయోద్యమం తప్ప మరొకటి కాదు. నిజంగా రాముడితో, మతంతో ఏ నిమిత్తమూ లేదు. ఉండివుంటే నిర్మాణం పూర్తయ్యేదాకా ప్రస్తుత ప్రభుత్వం ఆగివుండేది. కానీ తమ రిపోర్ట్ కార్డులో చూపించుకోవడానికి ఏమీలేదని బీజేపీకి తెలుసు.

– రోహిత్ రోహన్, వ్యాఖ్యాత

గొంతు పెగలదా?



తమ దేవుడి జన్మస్థలం మీద బలవంతంగా నిర్మించారని ఇండియాలో లక్షలాది మంది నమ్మడం వల్ల బాబ్రీ మసీదు నేలమట్టమైంది. కానీ చైనాలో ఎన్నో మసీదులను కూలగొడుతున్నారు. ఎందుకంటే చైనా ఇస్లాంను సహించదు. అయినా ఎవరూ మాట్లాడరు. ముస్లిం బ్రదర్‌హుడ్ ఎక్కడ?

– యానా మీర్, జర్నలిస్ట్

క్లినిక్ హ్యూమర్



పేషెంట్ భార్య అతడి గురకను రికార్డ్ చేసింది. అది ఎంత బిగ్గరగా ఉందో అతడు అంగీకరించడం లేదు. పేషెంట్: డాక్టర్, ఒకప్పుడు ఈమె నా ఛాతీ మీద పడుకొని, నా గుండె కొట్టుకునే శబ్దాన్ని వినేది. పేషెంట్ భార్య: ఒకప్పుడు నువ్వు 70 కిలోలు ఉండేవాడివి, ఇప్పుడు 130 అయ్యావు. నీ గుండె శబ్దమే వినబడటం లేదు.

– జోయీతా, ఫిజిషియన్

ద్వీపాలను బతకనివ్వండి!



మాల్దీవుల విస్తీర్ణం 298 చదరపు కిలోమీటర్లు. లక్షద్వీప్‌ది కేవలం 32 చ.కి.మీ. లక్షద్వీప్ లోని పగడపు దిబ్బలు ఇప్పటికే వెలిసిపోతున్నాయి లేదా చనిపోతున్నాయి. కాబట్టి దయచేసి వాటిని తర్వాతి మాల్దీవుల పేరుతో ప్రచారం చేసేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించండి. కొన్ని ప్రదేశాలను వాటి మానాన వాటిని వదలడమే మంచిది. అంతగా కావాలంటే, 6,000 చ.కి.మీ. ఉన్న అండమాన్ దీవులను దృష్టిలో ఉంచుకోవచ్చు.

– లవ్‌లీనా అరుణ్, ట్రావెలర్

ఏమైనా అంటారు!




పెళ్లికి, పార్లమెంటుకు, ప్రధాని లేదా రాష్ట్రపతితో సమావేశానికి మీకు నచ్చిన బట్టలు ధరించవచ్చు, మీ పిల్లలకు మీకు నచ్చిన పేరు పెట్టుకోవచ్చు, అది పూర్తిగా ఇతరులకు అన్యాక్రాంతం చేయలేని మీ హక్కు. కానీ వాటినే మీరు పబ్లిక్‌లో పెడితే, జనానికి కూడా వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

తొలి ముస్లిం మహిళా విద్యావేత్త

ఆధునిక భారత మొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్. సావిత్రీబాయి పూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలు, పిల్లలకు అక్షరజ్ఞానం ప్రసాదించిన విద్యాదాత. ఆధునిక భారత విద్యారంగానికి మార్గదర్శకురాలు. మనువాద, అగ్రవర్ణ సంప్రదాయవాదులు సంప్రదాయం పేరుతో శూద్రులకు విద్యను నిరాకరించినప్పుడు, దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాల మహిళలు, పిల్లల విద్యాహక్కు కోసం గళమెత్తిన ధీరవనిత. సావిత్రీబాయి, జ్యోతిరావు పూలేలతో కలిసి విద్యాభివృద్ధికి పాటుపడిన త్యాగమయి. జ్యోతిరావ్ పూలే నేతృత్వంలోని 'సత్యశోధక్' (సత్యాన్వేషణ) ఉద్యమంలో అగ్ర భాగస్వామి.



ఫాతిమా షేక్

1848లో దళిత పిల్లలు, మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడానికి ప్రయత్నించి నప్పుడు, 'మత వ్యతిరేక చర్య'గా పేర్కొంటూ జ్యోతిరావు, సావిత్రీబాయి పూలేలను కుటుంబ సభ్యులూ, గ్రామస్థులూ ఇంటినుండేగాక, గ్రామం నుండి కూడా బహిష్కరించినప్పుడు, ఫాతిమా షేక్, ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి సహాయం చేసి ఆదుకున్నారు. పూలే దంపతులు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే ఉంటూ, అదే ఇంట్లో పాఠశాల నడిపేవారు. పూలే ఆలోచనల నుండి ప్రేరణ పొందిన ఉస్మాన్ తన సోదరిని సావిత్రీబాయితోపాటు, ఉపాధ్యాయురాలిగా శిక్షణ ఇప్పించాడు. సావిత్రీబాయితో పాటు, ఫాతిమా కూడా నాటి అగ్రవర్ణ, ఆధిపత్య వర్గాల నుండి సామాజికపరంగా అనేక అవమానాలను, కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. 'ఫాతిమా నాకు ఎంతగానో సహకరించింది. ఆమె సహకారంతోనే నేను ఇన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అని రాశారు సావిత్రి. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుసేన్, అబ్దుల్ కలామ్‌లతోపాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్నీ తమ రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో పొందుపరిచింది. 2021లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఎనిమిదవ తరగతి పాఠ్య పుస్తకంలో ఫాతిమా షేక్‌పై పాఠాన్ని ప్రవేశపెట్టి ఆమె సేవలకు తగిన గుర్తింపును కలిగించింది.

– మదీహా అర్జుమంద్ । 93476 05557

దేశ గతిని మార్చిన పదేళ్ల పాలన

అభిప్రాయం



డా॥ చింత ఎల్లస్వామి

దాదాపు పదేళ్లు పూర్తిచేసుకుని బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పాలనలో తనదైన ముద్రను వేసింది. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే విభిన్నమైన పాలన అందించింది. అవినీతికి దూరంగా, ప్రజాధనం వృథా కాకుండా పెట్టిన ప్రతి పథకం అట్టడుగు స్థాయి పౌరుని వరకూ చేరింది. నరేంద్ర మోదీ ప్రధానిగా ఈ పదేళ్ల పాలన మన దేశ గతిని పూర్తిగా మార్చివేసింది. భారత్ నేడు ప్రపంచంలో నిర్ణయాత్మక శక్తిగా మారింది.

కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛభారత్ అభియాన్' కార్యక్రమం చేపట్టి దేశవ్యాప్తంగా ప్రజలు తాముగా శుభ్రంగా ఉండటమే కాక, తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేసుకోవడానికి శ్రీకారం చుట్టింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా కొన్ని కోట్ల మంది భారతీయులకు బ్యాంకు ఖాతాలే లేవు. అందుకే 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' పథకం ద్వారా దాదాపుగా 50 కోట్ల మందికి ఉచిత బ్యాంకు ఖాతాలను కల్పించి వారిని దేశ ఆర్థిక కార్యకలాపాలలో భాగస్వాములను చేసింది కేంద్రం. 'మేకిన్ ఇండియా' పథకం ద్వారా దేశంలోనే వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తోంది. 'సుకన్య సమృద్ధి యోజన', 'జన సురక్ష బీమా యోజన', 'ముద్ర యోజన' లాంటి కార్యక్రమాలతో సామాన్య ప్రజలను ఆర్థిక కార్యకలాపాలలో భాగస్వాములను చేసింది. 'ఉజ్వల' పథకం కింద కోట్లాది మందికి సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లను అందించింది. 'స్కిల్ ఇండియా' పథకంతో దేశంలోని యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ అందించింది. రైతులకు 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకం కింద ఏడాదికి రూ. 6000 అందిస్తోంది. ఎరువులపై సబ్సిడీ ఇవ్వడం, పండించిన పంటలకు మద్దతు ధరను పెంచడం, పంట నష్టపోయిన రైతులకు 'ఫసల్ బీమా యోజన' కింద బీమా ప్రీమియం చెల్లించడం వంటివి రైతులకు ఎంతో మేలు చేకూర్చాయి. 'పీఎం ఆవాస్ యోజన' పథకం కింద గృహాలను నిర్మించడం, 'పీఎం గతి శక్తి' పథకం కింద వాయు రవాణా, జల రవాణా, రోడ్డు రవాణా మార్గాలను అభివృద్ధి చేయడం జరిగింది.



స్వదేశీ పరిజ్ఞానంతో కరోనా వ్యాక్సిన్‌ను తయారుచేసి దాదాపుగా 102 కోట్ల మందికి 220 కోట్ల కరోనా టీకాలను ఉచితంగా అందించింది. 'పీఎం గరీబ్ కళ్యాణ యోజన' కింద దేశంలో ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా బియ్యాన్ని, నిత్యావసర సరుకులను అందించింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ప్రవేశపెట్టింది. 21వ శతాబ్దపు యువతకు అనుగుణంగా 'నూతన విద్యా విధానం– 2020'ను కేంద్రం తీసుకొచ్చింది. ఆర్థిక సంస్కరణలో భాగంగా జీఎస్టీ ప్రవేశపెట్టింది. దీని వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయి. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇస్తున్న రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేసి జమ్మూ–కశ్మీర్ మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నది. ఈ కాలంలోనే అంతరిక్ష రంగంలో మన దేశం అగ్రరాజ్యాల సరసన చేరింది. నూతన పార్లమెంటు వేదికగా మహిళలను రాజకీయ రంగంలో క్రియాశీలం చేయడం కోసం 33 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లును ఆమోదింపచేసింది. అయోధ్యలో అశేష హిందువులకు మోదం చేకూర్చుతూ న్యాయసమ్మతంగా రామాలయాన్ని నిర్మింపచేస్తున్నది. జి–20 దేశాల సదస్సు విజయవంతం కావడం మనందరికీ గర్వ కారణం. 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా నిరంతరం దేశ ప్రజలతో సంభాషిస్తూ ప్రజలకు ఏం కావాలో తెలుసుకుంటున్నారు ప్రధాని మోదీ.

వ్యాసకర్త ఏబీవీపీ తెలంగాణ మాజీ జాయింట్ సెక్రెటరీ
మొబైల్: 99081 86025

ఇక్కడ ఏదీ సొంతం కాదు!

తోటిమనిషికి ద్రోహం చేయకుండా ఉండడం, ఎల్లప్పుడూ నిజమునే మాట్లాడడం, సమస్త ప్రాణులకూ వాటి భాగాన్ని వాటికి పంచి ఇవ్వడం, అందరియందు దయాభావం కలిగిఉండడం, మనస్సును, మిగతా ఇంద్రియాలను చాపల్యానికి లోనుకాకుండా చూసుకోవడం, యుక్త వయసులో పెళ్ళి చేసుకుని గృహస్థుడై సంతానాన్ని పొందడం, మనసు మృదుభావంతో నిండివుండేలా చూసుకోవడం, లజ్జితుడుగా ఉండడం, చంచలత్వానికి లోనుకాకుండా ఉండడం వంటి మంచి గుణాలను తనవిగా చేసుకోవడం అన్నది ధర్మాలలోకెల్ల శ్రేష్ఠమైన ధర్మంగా స్వాయంభువ మనువు కాలం నాటికే చెప్పబడింది. ఏ వ్యక్తి తాను ఇతరుల నుండి భయాన్ని పొందడో, తన నుండి ఇతరులకు భయాన్ని కలుగజేయడో, ఆ వ్యక్తి రాగద్వేషాలను జయించినవాడౌతాడు. అందులోనే అతడికి ఆత్మస్వరూప సాక్షాత్కారం సిద్ధిస్తుంది. పూర్వ కాలంలో మిథిలను పాలించిన జనక మహారాజు మోక్ష స్వరూపాన్ని, పరమాత్మ తత్వాన్ని గురించిన పూర్తి జ్ఞానాన్ని సాక్షాత్కరించుకున్నవాడుగా చెబుతారు. ఆ మహారాజుకు సంబంధించినదిగా ప్రసిద్ధమైన ఒక గాథ ఈ విధంగా చెబుతుంది:

జ్యోతిర్మయం

అనన్తం బత మే విత్తం యస్య మే నాస్తి కిఞ్చన,
మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కిఞ్చన.

(వ్యాసుని మహాభారతం, శాంతిపర్వం, 17వ అధ్యాయం, 19వ శ్లోకం)

'చూసేవాళ్ళకు నా వద్ద రాసులకొలదిగా సంపద ఉన్నట్లుగా కనబడుతుంది. అయితే అందులో ఏ ఒక్కటి కూడా నాకు చెందినదిగా నేను భావించను. అందుచేతనే అగ్నికి ఆహుతై మిథిలా నగరం మొత్తం దహనమైనప్పటికీ, అందులో నాదంటూ ఏదీ కాలి బూడిద కాదు!' అని పై గాథ భావం. సొంత భావన, విషయ లాలస అనేవి లేని మనసు చేసే ఆలోచన ఏ విధంగా ఉంటుందో ఈ గాథ స్పష్టం చేస్తుంది.

ఈ సమస్త భూమండలాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలే మహాసామ్రాట్టుకు కూడా, ఆహారంగా తీసుకున్నది అరిగించుకోవడానికి ఉండేది ఒక్క ఉదరమే! వాస్తవం అదైనప్పుడు, రాజ్యాధికారము, రాజభోగము గురించి గొప్పగా చెప్పుకోవడంలో అర్థం ఏముంటుంది?– అన్నది ఎప్పటినుంచో విజ్ఞులు చెబుతున్న ఆలోచించవలసిన మాట!

– భట్టు వెంకట రావు

క్లుప్తంగా...

ఖర్గే, కేసీలతో షర్మిల భేటీ


ఏపీ రాజకీయాలపై చర్చ..
వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్‌ షర్మిల శుక్రవారం విడివిడిగా భేటీ అయ్యారు. భేటీలకు ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సైతం హాజరయ్యారు. అర్ధగంట పాటు జరిగిన భేటీలో ఏపీ రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టి పెట్టుకొని పార్టీని బలోపేతం చేయాల్సి ఉందని, ఆ దిశగా రాష్ట్ర నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఇద్దరు నేతలు సూచించినట్లు తెలిసింది. ఇక పార్టీలో అప్పగించే బాధ్యతలపైనా భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. భేటీ అనంతరం షర్మిల మాట్లాడుతూ, బాధ్యతల అప్పగింతపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు. ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. అనంతరం షర్మిల హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్




సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు సమాన వాటా దక్కేలా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో తీవ్ర అన్యాయానికి గురైన వర్గాలు ప్రస్తుత సీఎం రేవంత్‌వైపు ఆశగా చూస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టు అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్, జిల్లా కోర్టుల్లో ప్రభుత్వ ప్లీడరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర పోస్టుల భర్తీలో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

29, 30 తేదీల్లో చలో ఢిల్లీ

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని, జనగణనలో కులగణన చేయాలని, బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనవరి 29, 30 తేదీల్లో చలో ఢిల్లీ నిర్వహించనున్నట్టు కృష్ణయ్య తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం 14 బీసీ సంఘాల సమావేశం సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్ వద్ద వేలాదిమందితో భారీ ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

గుండెపోటుతో టెన్త్ విద్యార్థి మృతి



శ్రీకాంత్

ధన్వాడ: గుండెపోటుతో పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం బుడ్డమ్మకొండతండాకు చెందిన బాల్యానాయక్, లలిత దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు శ్రీకాంత్ (15) కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అల్పాహారం తిని తన గదిలోకి వెళ్తుండగా మెట్లపైనే కుప్పకూలిపోయాడు. వెంటనే సిబ్బంది ధన్వాడ ఆస్పత్రికి తరలించగా వైద్యులు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి నారాయణపేటకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు.. విద్యార్థి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. రోజూ ఉదయం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తారు. శుక్రవారం శ్రీకాంత్‌ను వైద్య సిబ్బంది పరీక్షించగా బాగానే ఉన్నాడు. మృతుని తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రేపు ఐడీపీ 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్'


సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా విద్యాసేవల్లో పేరొందిన ప్రముఖ ఐడీపీ ఎడ్యుకేషన్ దేశంలోనే అతి పెద్ద ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈనెల 7 హోటల్ తాజ్ కృష్ణలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీన్ని నిర్వహించనుంది. ఆస్ట్రేలియా, కెనడాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ ఫెయిర్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 55 దేశాల నుంచి యూనివర్సిటీలు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొంటారని ఐడీపీ ఎడ్యుకేషన్ సౌత్ ఏసియా, మారిషస్ రీజనల్ డైరెక్టర్ పీయూష్ తెలిపారు.

ఊపిరి ఉన్నంత వరకు జైల్లోనే

- గర్భిణి హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు
- కూకట్‌పల్లి సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- 2018 జనవరి 27న దారుణం..బొటానికల్ గార్డెన్ వద్ద గోనెసంచుల్లో మృతదేహం
- చాకచక్యంగా ఛేదించిన గచ్చిబౌలి పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు



బింగి(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలిలోని బొటానికల్‌గార్డెన్ వద్ద రెండు గోనె సంచుల్లో ఏడు ముక్కలుగా దొరికిన బింగి దారుణహత్య కేసులో కూకట్‌పల్లి సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. నలుగురిని దోషులుగా తేలుస్తూ వారు బతికి ఉన్నంతకాలం జైల్లోనే ఉండేలా జీవితఖైదు విధించింది. బిహార్‌లోని బాంకా జిల్లా మోహన్‌మల్టీ గ్రామానికి చెందిన బింగి అలియాస్ పింకి అలియాస్ శాలినిది నిరుపేద కుటుంబం. రాజస్తాన్‌లో ఓ ఇటుకల పరిశ్రమలో పనిచేసే ఈమె తండ్రి దబ్బోలెయ్యా ఏడాదికి ఓసారి మాత్రమే సొంతూరుకు వచ్చి వెళ్లేవాడు. 2005లో ఉత్తరప్రదేశ్‌లోని సస్బల్ జిల్లా చాందూసిటౌన్‌కు చెందిన దినేష్‌తో బింగి వివాహం జరగ్గా, వీరికి ముగ్గురు సంతానం. భర్తతో విభేదాలు ఏర్పడిన తర్వాత బింగికి చాందూసి ప్రాంతానికే చెందిన వికాస్ కశ్యప్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. వికాస్‌తోపాటు ఒక కుమారుడిని తీసుకొని బింగి 2017లో సొంతూరుకు వెళ్లింది. ఈ క్రమంలోనే అక్కడ వికాస్‌కు మరో మహిళ మమత ఝూతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. దీంతో బింగిని వికాస్‌ను వదిలిపెట్టాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వికాస్, భర్త అనిల్ ఝూలతో కలిసి మమత హైదరాబాద్‌కు వచ్చింది. అప్పటికే మమత ఝూ కుమారుడు అమర్‌కాంత్ ఝూ నగరంలోని దలాల్ స్ట్రీట్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. వీరంతా కలిసి సిద్ధిఖీనగర్‌లోని ఓ ఇంట్లో దిగారు. వికాస్, మమత సిద్ధిఖీనగర్‌లోనే చాట్‌బండార్ నిర్వహించేవారు.

హైదరాబాద్‌కు వచ్చి హతం: అతికష్టం మీద వికాస్ చిరునామా తెలుసుకొని బింగి వీరి వద్దకు చేరుకుంది. అప్పటి నుంచి వికాస్, మమత మధ్య గొడవలు మొదలయ్యాయి. అప్పటికే బింగి 8 నెలల గర్భిణి. ఆమెను ఆస్పత్రికి తీసుకెళితే ఖర్చు అవుతుందని, బిడ్డ పుడితే వికాస్ డబ్బులన్నీ వారికే ఖర్చుపెట్టాల్సి వస్తుందని భావించిన మమత ఆమె హత్యకు పథకం వేసింది. దీనికి వికాస్ సహా మిగిలిన వారూ సహకరించడానికి అంగీకరించారు. 2018 జనవరి 27 రాత్రి 12 గంటల ప్రాంతంలో మమత, వికాస్‌లు బింగితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో మమత బింగి మెడ పట్టుకుని బలంగా గోడవైపు తోసింది. దీంతో బింగి కుప్పకూలిపోగా మమత, వికాస్ ఆమె నోరు, కాళ్లు, చేతులు గట్టిగా పట్టుకున్నారు. మమతతోపాటు ఆమె భర్త అనిల్ ఝూ, కుమారుడు అమర్‌కాంత్ ఝూ బింగి శరీరంపై ఇష్టమొచ్చినట్టు పిడిగుద్దులు కురిపించారు. దీంతో బింగి చనిపోయింది.

మృతదేహాన్ని ముక్కలు ముక్కలు చేసి....


బింగి మృతదేహాన్ని ఒకరోజంతా బాత్‌రూమ్‌లోనే ఉంచారు. మర్నాడు అమర్‌కాంత్ ఎలక్ట్రికల్ కటింగ్ మెషీన్, రెండు గోనె సంచులు తీసుకొచ్చాడు. మెషీన్‌తో బింగి తల, మొండెం, కాళ్లు, చేతులు ముక్కలుగా చేసి రెండు గోనె సంచుల్లో ప్యాక్ చేశారు. అమర్‌కాంత్ తాను పనిచేస్తున్న బార్‌లో ఫ్లోర్ మేనేజర్, ఒడిశావాసి అయిన సిద్ధార్థ బర్దన్‌కు చెందిన బైక్ తీసుకొచ్చాడు. మమత సాయంతో గోనె సంచుల్నీ తీసుకువెళ్లి బొటానికల్ గార్డెన్ వద్ద పడేశారు. దీనిపై జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్‌లో నీలిరంగు చొక్కా ధరించి.. ముఖానికి కళ్లద్దాలు పెట్టుకున్న వ్యక్తి, గోనెసంచులతో మహిళ వెనుక కూర్చున్న దృశ్యాలు కనబడ్డాయి. నిందితులు వినియోగించిన ఆ బైక్ బౌద్ధనగర్‌కు చెందిన విజయ్‌కుమార్ బాద్రే పేరు మీద ఉంది. అతడి నుంచి 2009లో శశికుమార్‌గౌడ్ వద్దకు చివరకు సిద్ధార్థ బర్దన్ చేతికి వచ్చింది. ఇతడు హఫీజ్‌నగర్‌లో రాంగ్‌రూట్‌లో వెళుతూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. ఆ సమయంలో విధించిన 'స్పాట్ పేమెంట్ చలాన్'ద్వారా అతడి ఫోన్ నంబరు తెలిసింది. అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, అమర్‌కాంత్, మమత, వికాస్, అనిల్ పేర్లు వెలుగులోకి వచ్చి కేసు ఓ కొలిక్కి వచ్చింది. 13 రోజుల్లోనే పోలీసులు ఈ కేసులో నిందితులను అరెస్టు చేశారు. ఆ తర్వాతే హతురాలు బింగి అని తేలింది. కేసు దర్యాప్తు చేసిన గచ్చిబౌలి పోలీసులు నిందితులపై అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారించిన కూకట్‌పల్లిలోని ఆరో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు దోషులుగా తేలిన నలుగురూ బతికి ఉన్నంత కాలం జైల్లోనే ఉండేలా శిక్ష విధించింది. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఇన్‌స్పెక్టర్ ఎం.గంగాధర్ (ప్రస్తుతం ఏసీపీ) దాఖలు చేసిన చార్జిషీట్ పోలీసు అకాడమీలో ఓ సబ్జెక్ట్‌గా మారింది.

తండ్రీకొడుకును బలిగొన్న టిప్పర్

- అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్
- బైక్‌ను ఈడ్చుకెళ్లిన టిప్పర్.. పెట్రోల్ ట్యాంకుకు మంటలు
- అక్కడికక్కడే తండ్రి మృతి... కొడుకు సజీవదహనం



కుమార్



ప్రదీప్

హైదరాబాద్ (నాగోలు): టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం తండ్రీకొడుకు ప్రాణం తీసింది. ఈ సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్‌కు చెందిన కుతాడి కుమార్ (40)కు భార్య సుగుణమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమార్ తన భార్యతో కలిసి పండులకు దాణా సరఫరా చేస్తుంటారు. ఖాళీ సమయాల్లో ఆటో కూడా నడుపుతాడు. కొంతకాలం క్రితం కుంట్లూరు సమీపంలోని పాపన్నగూడ చౌరస్తాలో పలువురు గుడిసెలు వేశారు. అందులో కుమార్ గుడిసె కూడా ఉంది. కుమార్ రెండో కొడుకు ప్రదీప్(13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి కుమార్ ప్రదీప్‌ను తీసుకొని గుడిసె వద్దకు వెళ్లి అక్కడే నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున కుత్బుల్లాపూర్‌కు వెళ్లేందుకు పయనమై ఔటర్‌కు వెళ్లే రేడియల్ రోడ్డుపైకి వచ్చారు. ఇంతలో బండ్లగూడ నుంచి ఓఆర్‌ఆర్ వైపునకు వెళుతున్న టిప్పర్‌ను పాపన్నగూడ చౌరస్తా దగ్గరకు రాగానే డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి కుమార్ నడుపుతున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కిందపడిన కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ఉన్న ప్రదీప్ టిప్పర్ కింద ఇరుక్కున్నాడు. డ్రైవర్ టిప్పర్‌తో అలాగే ముందుకెళ్లాడు. దీంతో మంటలు చెలరేగి బైక్ పెట్రోల్ ట్యాంకుకు అంటుకున్నాయి. వెంటనే యాదగిరి టిప్పర్ అక్కడే వదిలేసి పారిపోయాడు. టిప్పర్ కిందే ఉన్న ప్రదీప్ బైక్‌తో సహా మంటల్లో కాలిపోయాడు. మంటలు వ్యాప్తి చెంది టిప్పర్ క్యాబిన్ కూడా పూర్తిగా కాలిపోయింది. అక్కడ నుంచి వెళుతున్న వారు పోలీసులకు కాల్ చేయగా, ఫైర్ ఇంజిన్‌తో మంటలను అదుపు చేశారు. లారీ కింద పూర్తిగా కాలిపోయి ఉన్న ప్రదీప్‌ను బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. తండ్రీకొడుకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సుగుణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్ యాదగిరిని అదుపులోకి తీసుకున్నారు.

ఆస్తికోసం తండ్రిని చంపిన తనయుడు

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

గూడూరు: ఆస్తికోసం తండ్రిని ఓ కొడుకు కొట్టిచంపాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణి గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. కందాలం లింగాచారి(70) దేవేంద్రమ్మకు ముగ్గురు కొడుకులు. వారికి పెళ్లిళ్లు అయి వేరుగా ఉంటున్నారు. లింగాచారి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పూజారిగా పనిచేస్తున్నాడు. చిన్నకొడుకు రమేశ్ మద్యానికి బానిసై తిరుగుతుండగా, కోడలు గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యంమత్తులోనే తిరుగుతున్న రమేశ్ ఆలయం వద్ద ఉన్న తండ్రి వద్దకు గురువారంరాత్రి వెళ్లాడు. తనకు మరికొంత ఆస్తి కావాలని, భార్యను కాపురానికి తీసుకురావాలని తండ్రితో గొడవపడ్డాడు. తండ్రి వినకపోవడంతో కత్తితో పొడిచి చంపి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి పది దాటినా లింగాచారి ఇంటికి రాకపోవడంతో దేవేంద్రమ్మ రెండో కుమారుడిని ఆలయానికి పంపింది. తండ్రి రక్తపుమడుగులో పడి ఉండటంతో అతను వెంటనే కుటుంబసభ్యులకు తెలిపాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

గోదావరి-కావేరి అనుసంధానంపై | వచ్చేనెలలో సీఎంల భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్‌డబ్ల్యూడీఏ హైదరాబాద్ విభాగం కేంద్రానికి పంపించింది. దీనికి ఎన్‌డబ్ల్యూడీఏ ఆమోదముద్ర వేసిన వెంటనే సంబంధిత రాష్ట్రాలకు ఆ నివేదిక పంపిస్తారు. రెండు నదుల అనుసంధానికి రూ.74,329 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ప్రాజెక్టు చేపట్టిన ఐదేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా అందులో పేర్కొన్నారు. ఈ పాజెక్టు పూర్తయితే ప్రతీ సంవత్సరం రూ.9824.49 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుందని లెక్కకట్టారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపడతారు. దీనికి రూ.3381 కోట్లు అవుతుందని అంచనా. ఇక ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని149 టీఎంసీల నీటిని గోదావరి-కావేరి అనుసంధానం కింద తరలించాలని కేంద్రం భావిస్తున్న సంగతి విదితమే. ఒకవేళ ఛత్తీస్‌గఢ్ ఈ 140 టీఎంసీల నీటిని వినియోగించుకున్న పక్షంలో.. మహానది-గోదావరి మధ్య 230 టీఎంసీల నీటిని తరలించే ప్రక్రియ చేపడతామని కేంద్రం స్పష్టం చేసింది. వాటిని కావేరికి తరలిస్తామని వెల్లడించింది. ఇప్పటికే పలు సమావేశాల్లో గోదావరి-కావేరి నదుల అనుసంధానికి సంబంధించి సమ్మతి లభించింది.


త్వరలోనే గోదావరి బోర్డు సమావేశం కూడా...

గోదావరినది యాజమాన్య బోర్డు సమావేశం త్వరలోనే జరగనున్నట్టు సమాచారం. తదుపరి బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల సమాచారం అందులో చేర్చాలని ఏపీ ప్రభుత్వం గతంలో కోరింది. ఈ మేరకు బోర్డుకు ఏపీ జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి లేఖ కూడా రాశారు. ఎల్లంపల్లి బ్యారేజీ పరిసర ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలతోపాటు కుప్తి, ఎస్సారెస్పీ రెండో దశ వినియోగం, ఇందిరమ్మ వరద నీటి కాలువ, కాళేశ్వరం అదనపు టీఎంసీల వినియోగంపై చర్చించాలని కోరింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి సమాచారం ఇవ్వాలని గోదావరి యాజమాన్య బోర్డు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.

సాగర్ నుంచి ఏపీకి 5 టీఎంసీలు

ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాలకు 5 టీఎంసీల నీరు విడుదల చేయాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. శ్రీశైలం కోటాను సాగర్‌కు మళ్లించింది. ఉమ్మడి జలాశయాల నుంచి ఇరు రాష్ట్రాలకు 80 టీఎంసీల నీటిని కేటాయించిన సంగతి తెలిసిందే. శ్రీశైలంలో కేటాయించిన నీటిని వినియోగించుకోలేకపోయామని, అందువల్ల నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి ఐదు టీఎంసీల నీటి విడుదల చేయాలని ఏపీ కోరిక మేరకు బోర్డు అనుమతినిచ్చింది. బోర్డు ఆర్థిక పరిస్థితిపై ఈనెల 12వ తేదీన అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పా'పాల' బేరం



కిష్టయ్య

కేయూ క్యాంపస్: వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య శుక్రవారం ఏసీబీ వలకు చిక్కారు. శుక్రవారం పాలవ్యాపారి వద్ద రూ.50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వివరాలు... నగరంలోని కాశీబుగ్గకు చెందిన పాలవ్యాపారి పెండెం రాజేందర్ నాలుగేళ్లుగా యూనివర్సిటీలోని నాలుగు హాస్టళ్ల మెస్‌లకు పాలు సరఫరా చేస్తున్నారు. ఇందుకుగాను రూ.19 లక్షల మేర పాలబిల్లు హాస్టల్ ఆఫీస్ నుంచి రావాల్సి ఉంది. ఆడిట్ ఆఫీస్, హాస్టల్ ఆఫీస్‌లోనూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కిష్టయ్య బిల్లు పాస్ చేసేందుకు రూ.75 వేల లంచం ఇవ్వాలని పాలవ్యాపారిని డిమాండ్ చేశారు. చివరికి రూ.50 వేలు ఇచ్చేందుకు వ్యాపారి ఒప్పుకోవడంతో గత నెల 31న రూ.14 లక్షల బిల్లు పాస్ చేశారు. అయితే తనకు ఇస్తానన్న రూ.50 వేల కోసం కిష్టయ్య తరచూ అడుగుతుండగా, లంచం ఇవ్వడం ఇష్టంలేని రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తాజాగా వర్సిటీలోని ఆడిట్ ఆఫీస్‌లో ఉన్న కిష్టయ్య పాలవ్యాపారి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారి సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆటోను తప్పించబోయి రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టిన డీసీఎం
- అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం.. మరో ముగ్గురి పరిస్థితి విషమం



పింకితో తల్లి సునీత



జున్ను



పన్ని



ఎస్‌ఐ శ్రీనివాస్‌ను అడ్డుకుని దాడికి యత్నిస్తున్న జనం

జడ్చర్ల/ బాలానగర్: మృత్యువు తరిమినట్టుగా డీసీఎం దూసుకొచ్చింది. సంతలో కూరగాయలు తీసుకొని రోడ్డు దాటుతుండగా ఐదుగురిని బలితీసుకుంది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత కూడా డీసీఎం ఆగకుండా వెళ్లడంతో స్థానికులు కోపోద్రిక్తులయ్యారు. ఆ డీసీఎంను వెంబడించి మరీ తగులబెట్టారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. ప్రతి శుక్రవారం బాలానగర్‌లో వారాంతపు సంత నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వచ్చి తమకు కావాల్సిన సరుకులు తీసుకెళతారు. ఈ క్రమంలోనే సాయంత్రం సంతమార్గంలోకి వెళ్లేందుకు జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై ఓ ఆటో యూటర్న్ తీసుకుంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళుతున్న డీసీఎం ఆ ఆటోను తప్పించబోయి రోడ్డు దాటుతున్న వారిని, ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి పంచాయతీ పరిధిలోని బీబీనగర్ తండాకు చెందిన పన్ని(50), బాలానగర్ మండలం మోతీఘనపూర్‌కు చెందిన తల్లీకూతురు వంగూరు సునీత(32), పింకీ(8), రాజాపూర్ మండలం సేవియాతండాకు చెందిన జున్ను(3), బాలానగర్‌కు చెందిన జశ్వంత్(10) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరితో పాటు సునీత భర్త వంగూరు రాజు, మధ్యప్రదేశ్‌లోని అనుపూర్ జిల్లాకు చెందిన భద్రుసింగ్, బాలానగర్‌కు చెందిన మౌనికలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

డీసీఎంను వెంబడించి.. ఆపై నిప్పంటించి

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ డీసీఎంను సంఘటన స్థలంలో ఆగకుండా వెళ్లాడు. దీంతో స్థానిక యువకులు వెంబడించి పెద్దాయపల్లి గేటు దగ్గర డీసీఎంను పట్టుకున్నారు. ఆ సమయంలో డ్రైవర్ వాహనం దిగి పారిపోగా పోలీసులు డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు డీసీఎంకు నిప్పంటించి దహనం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న జడ్చర్ల రూరల్ సీఐ జములప్ప, రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బందిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడులకు పూనుకున్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపిస్తూ వెంటపడి దాడులు చేయడంతో పోలీసులు ప్రాణరక్షణ కోసం సమీపంలోని టైలర్ షాపులోకి వెళ్లి షటర్ మూసుకున్నారు. అనంతరం దుస్తులు మార్చుకొని దాడి నుంచి బయటపడ్డారు. అనంతరం డీఎస్పీ మహేష్ సంఘటన స్థలానికి వచ్చేందుకు ప్రయత్నించారు. ప్రజలు ఆగ్రహంగా ఉండటంతో కొన్ని కిలోమీటర్ల దూరంలోనే నిలిచిపోయారు. డీసీఎం మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్‌పై కూడా స్థానికులు దాడి చేశారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారికి ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు గంటల పాటు మండలకేంద్రం రణరంగంగా మారింది. శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీసులు ప్రత్యేక బలగాలను రప్పించి పరిస్థితిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు.

గీతంలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- వర్సిటీ ఐదో అంతస్తు నుంచి కిందకు దూకిన రేణుశ్రీ
- విద్యార్థిని దూకే వీడియో వైరల్



రేణుశ్రీ(ఫైల్)

ఐదో అంతస్తు నుంచి బీటెక్ విద్యార్థిని రేణుశ్రీ దూకే ముందు దృశ్యం

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: గీతం యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి- శంషీగూడలోని శిల్పా బృందావన్ కాలనీకి చెందిన రాహుల్-లక్ష్మీసరస్వతీల కూతురు రేణుశ్రీ (18) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరింది. ఎప్పటిలాగే తరగతి గదికి వెళ్లిన రేణుశ్రీ శుక్రవారం సాయంత్రం సమయంలో వర్సిటీ ఐదో అంతస్తుపైకి వెళ్లి ఫోన్ మాట్లాడింది. అనంతరం కిందకు దూకింది. విషయం తెలుసుకున్న యూనివర్సిటీ నిర్వాహకులు చికిత్స నిమిత్తం వెంటనే పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. కాగా, రేణుశ్రీ మృతికి గల కారణాలు ఇంకా తెలియడం లేదు.

రెగ్యులర్‌గా క్లాస్‌లకు వెళ్లాలి

ఇటీవల రేణుశ్రీని తండ్రి రాహుల్ కలిసినట్టు తెలిసింది. ఆమె క్లాస్‌లకు సరిగ్గా వెళ్లడం లేదని మందలించారని, ఇకముందు రెగ్యులర్‌గా వెళ్లాలని చెప్పినట్టు సమాచారం. ఇంతలోనే ఏమైందో తెలియదు గానీ రేణుశ్రీ ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతురాలి బాబాయి సుమంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె ఎవరితో ఫోన్‌లో మాట్లాడిందో ఆరా తీస్తున్నారు. త్వరలో వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ పురుషోత్తంరెడ్డి చెప్పారు. కాగా, రేణుశ్రీ ఐదో అంతస్తు నుంచి దూకే వీడియో వైరల్‌గా మారింది. ఆమె కిందకు దూకుతుండగా పలువురు విద్యార్థులు వీడియో తీసి ఇతరులకు పంపారు.

తోకముడిచిన సోమాలియా పైరేట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వాణిజ్య నౌకల స్వేచ్ఛా యానానికి అనువైన వాతావరణం కల్పించేందుకు ఇతర దేశాల భాగస్వామ్యంతో పనిచేసేందుకు నేవీ కట్టుబడి ఉంటుందని వివరించారు. సముద్ర దొంగల బారి నుంచి తమ నౌకను రక్షించిన భారత నేవీకి లీలా గ్లోబల్ సీఈవో స్టీవ్ కుంజెర్ ధన్యవాదాలు తెలిపారు.

ఇలా ఉండగా, ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రభావం నౌకా రవాణాపైనా పడింది. 21 మంది భారతీయ సిబ్బందితో కూడిన లైబీరియాకు చెందిన ఎంవీ కెమ్ ప్లుటో నౌకపై డిసెంబర్ 23న భారత పశ్చిమ తీరంలో డ్రోన్ దాడి జరిగింది. భారత్ వైపు చమురుతో వస్తున్న మరో నౌకపై ఎర్ర సముద్రంలో డ్రోన్ దాడి జరిగింది. మాల్టాకు చెందిన ఎంవీ రుయెన్ అనే నౌకను పైరేట్లు డిసెంబర్ 14న హైజాక్ చేశారు.

ఎన్నికల ఏడాది



చరిత్రలో తొలిసారిగా 50కి పైగా దేశాల్లో ఒకే ఏడాది ఎన్నికలు

2024ను ఎన్నికల ఏడాదిగా పిలవాలేమో. ఎందుకంటే ఈ ఏడాది ఏకంగా 50కి పైగా దేశాల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి! ఒక్క ఏడాదిలో ఇన్ని దేశాల్లో ఎన్నికలు జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. అలా 2024 రికార్డులకెక్కబోతోంది. పైగా అత్యధిక జనాభా ఉన్న టాప్ 10 దేశాల్లో ఏకంగా ఏడు ఈసారి ఎన్నికల పోరుకు సిద్ధమవుతుండటం విశేషం. ఆ లెక్కన ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది ఈ ఏడు ఓటు హక్కును వినియోగించుకోనుండటం ఇంకో విశేషం! ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న భారత్ మొదలుకుని అగ్ర రాజ్యం అమెరికా దాకా ఈ జాబితాలో ఉన్న ముఖ్యమైన దేశాలను ఓసారి చూద్దాం...

- సాక్షి, నేషనల్ డెస్క్

బంగ్లాదేశ్

17 కోట్ల జనాభా ఉన్న బంగ్లాదేశ్ ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న తొలి దేశం. జనవరి 7న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అయితే విపక్షాలన్నింటినీ నిర్వీర్యం చేసి ఏకపక్ష ఎన్నికల ప్రహసనానికి తెర తీశారంటూ ప్రధాని షేక్ హసీనా ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అణచివేతను తట్టుకోలేక పలువురు విపక్ష నేతలు ప్రవాసంలో గడుపుతున్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో పాటు విపక్షాలన్నీ బాయ్‌కాట్ చేసిన ఈ ఎన్నికల్లో హసీనా మరోసారి నెగ్గడం, వరుసగా ఐదోసారి అధికారంలోకి రావడం లాంఛనమే కానుంది. ప్రజాస్వామ్యానికి చెల్లుచీటీ పాడి చైనా మాదిరిగా దేశంలో హసీనా ఏక పార్టీ వ్యవస్థను నెలకొల్పేలా ఉన్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

తైవాన్

చైనా పడగ నీడన తన స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్న తైవాన్‌లో జనవరి 13న అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. అధికార డీపీపీ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు సై ఇంగ్ వెన్‌కు బదులుగా లై చింగ్ టే బరిలో ఉన్నారు. ఆయనకు వెన్‌కు మించిన స్వాతంత్య్ర ప్రియునిగా పేరుంది. ఉదారవాద క్యోమింటాంగ్ నేత హో యూ యీ, తైవాన్ పీపుల్స్ పార్టీ తరఫున కో వెన్ జే ఆయనను సవాలు చేస్తున్నారు. డీపీపీ 2016 నుంచీ అధికారంలో కొనసాగుతోంది. ఈసారి కూడా అది అధికారంలోకి వస్తే యుద్ధానికి దిగైనా తైవాన్‌ను విలీనం చేసుకుంటానంటూ చైనా ఇప్పటికే బెదిరిస్తోంది. దాంతో ఈ ఎన్నికలు తైవాన్‌కు ఒకరకంగా జీవన్మరణ సమస్యగా పరిణమించాయి.

పాకిస్తాన్

24 కోట్ల జనాభా ఉన్న పాక్ అనిశ్చితికి మారుపేరు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 8న సార్వత్రిక ఎన్నికలు జరగాలి. కానీ అవి వాయిదా పడే సూచనలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. సైన్యాన్ని ఎదిరించి ప్రధాని పదవి కోల్పోయి అవినీతి కేసుల్లో జైలు పాలైన పీటీఐ చీఫ్ ఇమ్రాన్‌ఖాన్ పోటీకి దారులు మూసుకుపోయినట్టు కన్పిస్తున్నాయి. ఆయన నామినేషన్లు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగడం అనుమానంగా మారింది. సైన్యం దన్నుతో పాకిస్తాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్) విజయం, ప్రవాసం నుంచి తిరిగొచ్చిన ఆ పార్టీ నేత నవాజ్ షరీఫ్ మరోసారి ప్రధాని కావడం లాంఛనమేనని అక్కడి రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఇండొనేసియా

27 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న ఇండొనేసియాలో కూడా ఫిబ్రవరిలో ఎన్నికలున్నాయి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షునితో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ పార్లమెంటు సభ్యులకు ఫిబ్రవరి 14న ఒకే రోజున ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రెండు టర్ములు పూర్తి చేసుకున్న అధ్యక్షుడు జొకో విడొడొ స్థానంలో రక్షణ మంత్రి 72 ఏళ్ల ప్రాబొవో సుబియంటో బరిలో ఉన్నారు. గంజర్ ప్రనోవో, అనీస్ బస్వేదన్ గట్టి పోటీ ఇస్తున్నారు.

భారత్

140 కోట్లకు పైగా జనాభా, 90 కోట్ల పై చిలుకు ఓటర్లతో ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్యంగా అలరారుతున్న భారత్ ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతోంది. ఇన్ని కోట్ల మంది ఓటర్లు అత్యంత శాంతియుతంగా, ప్రజాస్వామికంగా ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ప్రపంచమంతా అబ్బురపాటుతో వీక్షించడం పరిపాటిగా మారింది. ఈ ఎన్నికల్లో ప్రధానిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ ఖాయమని అత్యధిక రాజకీయ అంచనాలు చెబుతున్నాయి. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిని 2014లో ఆయన ఒంటి చేత్తో అధికారంలోకి తేవడం తెలిసిందే. 2019లోనూ మోదీ మేజిక్ రిపీటైంది. ఈసారి దానికి ఎలాగైనా అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ సారథ్యంలో 28 విపక్ష పార్టీలతో కూడిన విపక్ష ఇండియా కూటమి ప్రయత్నిస్తోంది.

మెక్సికో

జూన్ 2న ఎన్నికలకు మెక్సికో సిద్ధమవుతోంది. 13 కోట్ల జనాభా ఉన్న ఈ దేశ చరిత్రలోనే తొలిసారిగా అధ్యక్ష పదవితో పాటు మొత్తం 32 రాష్ట్రాల గవర్నర్లు, జాతీయ కాంగ్రెస్, స్థానిక సంస్థల స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. క్లాడియా షేన్‌బామ్ రూపంలో ఈసారి తొలిసారిగా ఓ మహిళ అధ్యక్ష పదవి చేపట్టే ఆస్కారం కనిపిస్తుండటంతో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. సైంటిస్టు, మెక్సికో సిటీ మాజీ మేయర్ అయిన ఆమె అధికార మొరేనా పార్టీ తరఫున బరిలో దిగుతున్నారు.

యూరోపియన్ యూనియన్

యూరోపియన్ యూనియన్‌లోని మొత్తం 27 దేశాల ప్రజలూ కీలకమైన ప్రతి ఐదేళ్లకోసారి యూరప్ పార్లమెంటులో తమ ప్రతినిధులను ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకుంటారు. విద్య, వైద్యం మొదలుకుని ఉపాధి దాకా ఆ దేశాలను తీవ్రంగా ప్రభావితం చేసే పలు కీలక రంగాలకు సంబంధించి నిర్ణాయక చట్టాలు చేయడంలో పార్లమెంటుదే కీలక పాత్ర. దాంతో జూన్ 6 నుంచి 9 దాకా జరగనున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొత్తం 720 మంది పార్లమెంటు సభ్యులు ఎన్నికవుతారు.

దక్షిణాఫ్రికా

6 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న ఈ దేశంలో మే–ఆగస్టు మధ్య సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 1994లో దేశంలో వర్ణ వివక్ష అంతమయ్యాక జరుగుతున్న ఏడో ఎన్నికలివి. అప్పటినుంచీ అధికారంలో కొనసాగుతున్న ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్సీ) ఈసారి విజయానికి కావాల్సిన 50 శాతం మార్కును దాటడం కష్టకాలమేనంటున్నారు. గత అక్టోబర్‌లో జరిగిన సర్వేలో ఆ పార్టీకి మద్దతు 45 శాతానికి పడిపోయింది. అవినీతి మకిలి అధ్యక్షుడు సిరిల్ రామాఫోసాకు ఈసారి ప్రధాన అడ్డంకిగా మారేలా కన్పిస్తోంది. అధికారంలోకి వస్తూనే పూర్వ అధ్యక్షుడు జాకబ్ జుమా అవినీతిని క్షమించడం తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. అధికారుల్లో పెచ్చరిల్లిన అవినీతి పరిస్థితిని ఏఎన్సీకి మరింత ప్రతికూలంగా మార్చిందంటున్నారు. విపక్ష డెమొక్రటిక్ అలయెన్స్ దానికి గట్టిపోటీ ఇచ్చేలా కన్పిస్తోంది.

అమెరికా

33 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న అగ్ర రాజ్యంలో అధ్యక్ష ఎన్నికలు ఎప్పుడూ ప్రపంచాన్ని ఆకర్షించేవే. అధ్యక్షున్ని ఎన్నుకోవడంతో పాటు ప్రతినిధుల సభలో మొత్తం స్థానాలతో పాటు సెనేట్లో మూడో వంతు సీట్లకు కూడా పోలింగ్ జరుగుతుంది. అయితే ఈసారి నవంబర్ 5న జరగనున్న ఎన్నికలపై మరింత ఆసక్తి నెలకొనేలా ఉంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెంపరితనమే అందుకు ఏకైక కారణం! 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని ఒప్పుకునేందుకు ఆయన ససేమిరా అనడం, తననే విజేతగా ప్రకటించాలంటూ మొండికేయడం తెలిసిందే. డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌ను అధ్యక్షునిగా ప్రకటించకుండా అడ్డుకునేందుకు ఏకంగా క్యాపిటల్ భవనంపైకి తన మద్దతుదారులను దాడికి ఉసిగొల్పారు ట్రంప్. ఆ కేసులో ఆయన దోషిగా తేలడం, ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హునిగా మారే ప్రమాదంలో పడటం విశేషం! ఈ గండం గట్టెక్కితే ట్రంప్ మరోసారి బైడెన్‌తోనే తలపడతారు.

ఘనా

3 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో డిసెంబర్ 7న ఎన్నికలు జరగనున్నాయి. వరుసగా రెండోసారి అధ్యక్షునిగా కొనసాగుతున్న నానా అకుఫో అడో స్థానంలో కొత్త నేతను ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. అధికార న్యూ పేట్రియాటిక్ పార్టీ, విపక్ష నేషనల్ డెమొక్రటిక్ కాంగ్రెస్ మధ్య ఈసారి హోరాహోరీ ఖాయమంటున్నారు.

క్లుప్తంగా...

సార్వత్రిక ఎన్నికలను వాయిదా వేయాలి

పాక్ సెనేట్ తీర్మానం

ఇస్లామాబాద్: ఫిబ్రవరి 8వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగాల్సిన పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితి మరింత ముదురుతోంది. అతి శీతల వాతావరణ పరిస్థితులు, ఖైబర్ ఫంక్తున్వా వంటి ప్రావిన్సుల్లో భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ఫిబ్రవరి 8వ తేదీన జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ సెనేట్ తీర్మానం ఆమోదించింది. స్వతంత్ర సభ్యుడు దిలావర్ ఖాన్ చేసిన ప్రతిపాదనకు ఊహించని మద్దతు లభించింది. అయితే, పాకిస్తాన్ ఎన్నికల సంఘం(ఈసీపీ) సెనేట్ తీర్మానాన్ని తోసిపుచ్చింది. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వు ద్వారా మాత్రమే ఎన్నికల షెడ్యూల్ మారుతుందని పేర్కొంది.

దావూద్ కుటుంబీకుల ఆస్తులకు రూ.2 కోట్లకు పైగా ధర

ముంబై: 1993 ముంబై పేలుళ్ల కేసు సూత్రధారి, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం కుటుంబసభ్యులకు చెందిన రెండు స్థిరాస్తులు వేలంలో రూ.2 కోట్లకు పైగా ధర పలికినట్లు అధికారులు తెలిపారు. స్మగ్లర్లు, ఫారిన్ ఎక్ఛేంజి మానిప్యులేటర్స్ చట్టం కింద శుక్రవారం ముంబైలోని ఆయకార్ భవనంలో వేలం చేపట్టామన్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ఖేడ్ తహశీల్ ముంబాకే గ్రామంలోని నాలుగు చోట్ల ఉన్న భూములను వేలానికి ఉంచినట్లు చెప్పారు. వీటిలో సుమారు 171 చదరపు మీటర్ల భూమి ధర వేలంలో అత్యధికంగా రూ.2.01 కోట్లు, మరో 1,730 చదరపు మీటర్ల స్థలం రూ.3.28 కోట్లు పలికిందని చెప్పారు. ఈ రెండింటిని ఢిల్లీకి చెందిన లాయర్ కొనుగోలు చేశారని వివరించారు. మిగతా రెండు ప్లాట్లకు ఎవరూ టెండర్లు వేయలేదని వివరించారు.

619కి చేరిన జేఎన్.1 కేసులు

న్యూఢిల్లీ: దేశంలోని 12 రాష్ట్రాల్లో జనవరి 4వ తేదీ వరకు కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 619 నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో కర్ణాటకలో అత్యధికంగా 199 కేసులు నమోదయ్యాయన్నారు. ఆ తర్వాత కేరళలో 148, మహారాష్ట్రలో 110, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఏపీలో 30, తమిళనాడులో 26, ఢిల్లీలో 15, రాజస్తాన్‌లో 4, తెలంగాణలో 2, ఒడిశా, హరియాణాల్లో ఒక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి.

జైలు శిక్షపైనా అప్పీలు!

నేవీ అధికారుల కేసులో పురోగతి

న్యూఢిల్లీ: ఖతర్‌లో గూఢచర్య ఆరోపణలపై జైల్లో ఉన్న 8 మంది భారత మాజీ నేవీ అధికారులకు మరింత ఊరట. వారికి విధించిన మరణశిక్షను అక్కడి న్యాయస్థానం ఇటీవలే జైలు శిక్షగా మార్చడం తెలిసిందే. దానిపై కూడా ఖతార్ సుప్రీంకోర్టులో అప్పీలుకు వీలు కల్పించడంతో పాటు అందుకు 60 రోజుల గడువిచ్చినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. 8 మంది మాజీ అధికారుల్లో ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా జైలు శిక్ష విధించినట్టు చెబుతున్నారు. వాటి వివరాలను ఖతార్, భారత్ గోప్యంగా ఉంచుతున్నాయి.

ఇక్బాల్ అన్సారీకి అయోధ్య ఆహ్వాన లేఖ

అయోధ్య: రామజన్మభూమి–బాబ్రీ మసీదు కేసులో కక్షిదారు అయిన ఇక్బాల్ అన్సారీ రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమ ఆహ్వానం అందుకున్నారు. అయోధ్యలోని రామ్ పథ్ సమీపంలో కొటియా పంజిటొలా వద్ద ఉన్న తమ నివాసానికి శుక్రవారం ఉదయం ఆహ్వాన లేఖ వచ్చినట్లు అన్సారీ కుమార్తె షామా పర్వీన్ పీటీఐకి చెప్పారు. ఆహ్వాన లేఖను తన తండ్రి స్వయంగా అందుకున్నారని ఆమె తెలిపారు.

ఫిన్లాండ్, స్వీడన్‌లో రికార్డు స్థాయి చలి

స్టాక్‌హోమ్: నార్డిక్ దేశాలైన నార్వే, స్వీడన్, ఫిన్లాండ్‌లను చలి వణికిస్తోంది. 25 ఏళ్ల తర్వాత స్వీడన్, ఫిన్లాండ్ దేశాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 40 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఎముకలు కొరికే చలికి తోడు దట్టమైన మంచు కురుస్తుండటంతో మూడు దేశాల్లోనూ రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. స్వీడన్‌లోని ఉత్తరప్రాంతంలో ఉష్ణోగ్రతలు 1999 తర్వాత -43.6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడం ఇదే మొదటిసారని వాతావరణ శాఖ తెలిపింది. 1951లో, తిరిగి 1999లోనూ -49 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు గుర్తు చేసింది. పొరుగునే ఉన్న ఫిన్లాండ్‌లోని వైలివియెస్కాలో ఉష్ణోగ్రత మంగళవారం -37.8 డిగ్రీలుగా నమోదైంది.

హైకోర్టు జడ్జీలుగా ఐదుగురు

న్యూఢిల్లీ: నాలుగు హైకోర్టుల్లో నియామకానికిగాను సుప్రీంకోర్టు కొలీజియం అయిదుగురు జడ్జీల పేర్లను ప్రతిపాదించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో భేటీ అయిన కొలీజియం ఈ మేరకు కేంద్రానికి సిఫారసులను పంపించింది. కొలీజియంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా ఉన్నారు. జమ్మూ కశ్మీర్ అండ్ లద్దాఖ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ రాహుల్ భారతి, జస్టిస్ మోక్షా ఖజూరియా కజ్మిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియంకోరింది. బాంబే హైకోర్టులో అదనపు జడ్జి అభయ్ అహుజాను శాశ్వత న్యాయమూర్తిగా, కోల్‌కతా హైకోర్టు న్యాయాధికారి చైతలి చటర్జీ(దాస్)ను అదే హైకోర్టులో న్యాయమూర్తిగా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయాధికారి అరవింద్ కుమార్ వర్మను అదే హైకోర్టులో జడ్జిగా నియమించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

బెంగాల్‌లో ఈడీ అధికారులపై దాడి

టీఎంసీ నేత ఇంట్లో సోదాలు జరుపుతుండగా ఘటన

అధికారులకు గాయాలు, వాహనాలు ధ్వంసం





దాడిలో గాయపడిన ఈడీ అధికారి, దెబ్బతిన్న వాహనం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) మద్దతుదారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై విచక్షణా రహితంగా దాడికి దిగారు. ఘటనలో అధికారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ పరిణామంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశాయి. అరాచకానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గవర్నర్ సీవీ ఆనంద బోస్ పేర్కొన్నారు. రేషన్ పంపిణీ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఈడీ అధికారులు సందేశ్‌ఖలిలోని టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇంట్లో సోదాలు జరుపుతున్నారు. అదే సమయంలో ఒక్కసారిగా అక్కడికి చేరుకున్న షాజహాన్ మద్దతుదారులు రెచ్చిపోయి ఈడీ అధికారులపై దాడికి తెగబడ్డారు. దాడిలో అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. షాజహాన్ అనుచరులు అధికారుల వాహనాల్నీ వదల్లేదు. వాటిని ధ్వంసం చేశారు. రక్షణగా వచ్చిన కేంద్ర పారామిలటరీ బలగాలపైనా దాడికి దిగారు. సోదాలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా సిబ్బందిపైనా దాడి చేశారు. వారి వాహనాల్ని తుక్కు చేశారు. గాయపడిన ఈడీ అధికారులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అక్కడి నుంచి బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు అధికారులకు ఆస్పత్రిలో చికిత్స చేయించనున్నారు. రాష్ట్రమంత్రి జ్యోతిప్రియో మాలిక్‌కు షాజహాన్ సన్నిహితుడు. రేషన్ కేసులోనే గత ఏడాది మాలిక్ అరెస్టయ్యారు. షేక్ షాజహాన్‌పై ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపినట్లు ఈడీ అధికారి ఒకరు పీటీఐకి చెప్పారు. ఘటనతో సంబంధమున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రాష్ట్ర పోలీసులు చెప్పారు.

సందేశ్‌ఖలి ఘటనను రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తీవ్రంగా ఖండించారు. ఈడీ అధికారులపై దాడిని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అనాగరిక చర్యను, విధ్వంసాన్ని ఆపాలని కోరారు. రాజ్యాంగానికి లోబడి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కేంద్ర అధికారులపై దాడి సమాఖ్య వ్యవస్థపై జరిగిన దాడిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ పేర్కొన్నారు. ఘటనపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించి, రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ కోరారు.

ఆప్ తరఫున రాజ్యసభకు మలివాల్

సంజయ్ సింగ్, ఎన్‌డీ గుప్తాలకు మళ్లీ అవకాశం

న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను రాజ్యసభకు నామినేట్ చేయనున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) ప్రకటించింది. అదేవిధంగా, పార్టీకే చెందిన రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్, ఎన్‌డీ గుప్తాలకు మరో విడత ఎగువసభ సభ్యులుగా కొనసాగించాలని నిర్ణయించింది. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఈ మేరకు ప్రకటించింది. హరియాణా రాజకీయాల్లో కీలకంగా ఉండాలన్న రాజ్యసభ ఎంపీ సుశీల్ కుమార్ గుప్తా అభిప్రాయం మేరకు ఆయన స్థానంలో స్వాతి మలివాల్‌కు మొదటిసారిగా అవకాశం కల్పిస్తున్నట్లు ఆప్ పేర్కొంది. ఆమె 2015లో ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. పార్టీ నిర్ణయం మేరకు శుక్రవారం సాయంత్రం డీసీడబ్ల్యూ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఆప్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయన వినతి మేరకు శుక్రవారం ప్రత్యేక కోర్టు..ఈ నెల 19న జరిగే రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు సంజయ్ సింగ్‌కు వెసులుబాటు కల్పించాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చింది.

సుప్రీంకోర్టులో రెండు మద్యం సీసాలు

- లిక్కర్ సీసాలను కోర్టు గదిలో ప్రదర్శించిన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ
- వాటిని చూసి బిగ్గరగా నవ్వేసిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్
- ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన కేసులో విచారణ సందర్భంగా ఉదంతం

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానంలో అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా రెండు మద్యం సీసాలు కోర్టు గదిలో ప్రత్యక్షమయ్యాయి. ట్రేడ్ మార్క్ ఉల్లంఘనపై రెండు మద్యం కంపెనీల మధ్య నెలకొన్న వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. పిటిషనర్ల వాదించిన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ ఈ మద్యం సీసాలను కోర్టులోకి తీసుకొచ్చారు. ధర్మాసనం ఎదుట ప్రదర్శించారు. వాటిని చూసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆశ్చర్యపోయారు. బిగ్గరగా నవ్వారు. అసలు ఏం జరిగిందంటే.. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన జేకే ఎంటర్‌ప్రైజెస్ అనే లిక్కర్ కంపెనీ 'లండన్ ప్రైడ్' పేరుతో మద్యం తయారు చేస్తోంది. ఈ పేరు తాము తయారు చేస్తున్న 'బ్లెండర్స్ ప్రైడ్' మద్యం పేరును పోలి ఉందని పెర్నాడ్ రికార్డ్స్ అనే మరో లిక్కర్ కంపెనీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతేకాకుండా లండన్ ప్రైడ్ లిక్కర్ బాటిల్ 'ఇంపీరియల్ బ్లూ' లిక్కర్ బాటిల్ మాదిరిగానే ఉందని ఆరోపించింది. లండన్ ప్రైడ్ పేరుతో లిక్కర్ తయారు చేయకుండా దాన్ని నిషేధించాలంటూ పెట్టుకున్న పిటిషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు గతేడాది తిరస్కరించింది. దీన్ని సవాలు చేస్తూ పెర్నాడ్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపించారు. ధర్మాసనం అనుమతితో లండన్ ప్రైడ్, ఇంపీరియల్ బ్లూ లిక్కర్ సీసాలను తీసుకొచ్చి తన టేబుల్‌పై ఉంచారు. వాటిని చూసి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నవ్వు ఆపుకోలేకపోయారు. 'వాటిని మీతోపాటే తీసుకొచ్చారా?' అని రోహత్గీని ప్రశ్నించారు. రెండు సీసాల మధ్య సారూప్యతను స్వయంగా చూపించడానికే తీసుకొచ్చానని ఆయన బదులిచ్చారు. ఈ కేసులో ట్రేడ్ మార్క్ ఉల్లంఘన జరిగిందని చెప్పారు. జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. గతంలో బాంబే హైకోర్టులో ఇలాంటి కేసులో తాను తీర్పు ఇచ్చానని గుర్తుచేసుకున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుపై స్టే విధిస్తున్నట్లు చెప్పారు. జేకే ఎంటర్‌ప్రైజెస్‌కు నోటీసు జారీ చేశారు.

ఫ్యూయల్ సెల్ పరీక్ష సక్సెస్: ఇస్రో

బెంగళూరు/హైదరాబాద్: భవిష్యత్తులో అంతరిక్షంలో ఉపగ్రహాలు తదితరాలకు నిరంతర ఇంధన సరఫరాలో కీలకం కాగల ఫ్యూయల్ సెల్ పనితీరును విజయవంతంగా పరీక్షించినట్టు భారత అంతరిక్ష సంస్థ ఇస్రో పేర్కొంది. ''జనవరి 1న పీఎస్ఎల్వీ–సి58 ద్వారా భూ దిగువ కక్ష్యలోకి చేర్చిన ఫ్యూయల్ సెల్ ఆధారిత ఇంధన వ్యవస్థ (ఎఫ్‌సీపీఎస్)లోని పాలీమర్ ఎలక్ట్రోలైట్ మెంబ్రేన్ పరీక్ష విజయవంతమైంది. దీనిద్వారా కొద్ది సమయం పాటు 180 వాట్ల విద్యుదుత్పత్తి జరిగింది'' అని శుక్రవారం తెలిపింది. సంప్రదాయ బ్యాటరీ సెల్స్‌తో పోలిస్తే ఈ ఫ్యూయల్ సెల్స్‌కు చాలా తక్కువ ఖర్చవుతుంది. పైగా ఇవి అధిక సామర్థ్యంతో పని చేస్తాయి. పూర్తిగా పర్యావరణహితం కూడా. వీటిని అంతరిక్షంతో పాటు భూమిపై కూడా పలురకాలుగా వాడుకోవచ్చు''అని వివరించింది. భావి అంతరిక్ష ప్రయోగాలకు అవసరమైన డిజైన్లపై అవగాహనకు వచ్చేందుకు తాజా పరీక్ష దోహదపడుతుందని చెప్పింది. కృష్ణబిలాలపై పరిశోధనల నిమిత్తం జనవరి 1న ప్రయోగించిన ఎక్స్‌పోశాట్ బాగా పని చేస్తోందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.

అయోధ్య ఎయిర్‌పోర్టుకు మహర్షి వాల్మీకి పేరు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం, ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు–అయోధ్యధామ్' అని పేరుపెట్టాలన్న ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించాలని కూడా నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. రైల్వేలో 'సున్నా కర్బన ఉద్గారాల' లక్ష్యాన్ని సాధించడానికి అమెరికాతో ఒప్పందానికి అనుమతించింది. మారిషస్ భాగస్వామ్యంతో ఉమ్మడిగా బుల్లి ఉపగ్రహం అభివృద్ధికి అవగాహనా ఒప్పందానికి కూడా అంగీకరించింది.

'పృథ్వీ విజ్ఞాన్'కు ఆమోదం

ఎర్త్ సైన్సెస్ రంగంలో ఐదు వేర్వేరు పథకాల కింద పరిశోధనలకు, కేటాయించిన నిధుల వినియోగానికి ఉద్దేశించిన 'పృథ్వీ విజ్ఞాన్'కు కార్యక్రమానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని అమలుకు రూ.4,797 కోట్లు కేటాయించింది. ఇది ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. వాతావరణం, సముద్రం, క్రయోస్పియర్, పోలార్ సైన్స్, సీస్మాలజీ, జియోసైన్సెస్ వంటి అంశాలపై పరిశోధనలు చేయనున్నారు. పృథ్వీ విజ్ఞాన్ కింద రీసెర్చ్ ప్రాజెక్టులను విదేశీ సంస్థలకు అప్పగించడానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. గయానా నుంచి ముడి చమురు కొనుగోలుతో పాటు హైడ్రో కార్బన్ రంగంలో పరస్పర సహకారానికి ఒప్పందం కుదుర్చుకునేందుకూ అంగీకరించింది. గయానాలో ముడి చమురు అన్వేషణ, ఉత్పత్తిలో భారతీయ కంపెనీలకు సైతం భాగస్వామ్యం కల్పిస్తారు.

ప్రపంచ దేశాలతో అయోధ్య అనుసంధానం: మోదీ

అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలపడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. దీన్ని వాల్మీకి మహర్షికి దేశ ప్రజల తరఫున ఘనమైన నివాళిగా అభివర్ణించారు. అయోధ్యను ప్రపంచ దేశాలతో అనుసంధానించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు

ఉభయ కొరియా దేశాల మధ్య పరస్పరం కవ్వింపు చర్యలు

సియోల్: కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ కొరియా దేశాలు పరస్పరం కవ్వింపు చర్యలకు దిగాయి. వివాదాస్పద సముద్ర సరిహద్దు వద్ద శుక్రవారం ఉదయం ఇరు దేశాల సైన్యాలు సముద్రంలోకి పెద్ద సంఖ్యలో ఆర్టిలరీ షెల్స్‌ను ప్రయోగించాయి. 2018లో కుదిరిన ఇంటర్-కొరియన్ మిలటరీ ఒప్పందాన్ని ఉత్తర కొరియా, దక్షిణ కొరియా ఉల్లంఘించాయి. తమ పశ్చిమ సరిహద్దు వద్ద ఉత్తర కొరియా దాదాపు 200 ఆర్టిలరీ షెల్స్ ప్రయోగించిందని దక్షిణ కొరియా సైనికాధికారులు వెల్లడించారు. ఉత్తర కొరియా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని, శాంతికి విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. గత ఏడాది కాలంలో కిమ్ జోంగ్ ఉన్ సైన్యం ఈ స్థాయిలో ఫైరింగ్‌కు పాల్పడడం ఇదే మొదటిసారి. ఉత్తర కొరియాకు దక్షిణ కొరియా సైన్యం సైతం దీటుగా బదులిచ్చింది. ఆర్టిలరీ షెల్స్ ప్రయోగించింది. తాజా ఘటనతో రెండు దేశాల నడుమ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదం కనిపిస్తోంది. ఆయుధ పరీక్షలను ఉత్తర కొరియా మరింత ఉధృతం చేసే అవకాశం ఉందంటున్నారు. కొరియా ద్వీపకల్ప పశ్చిమ తీరంలో సముద్ర సరిహద్దును పూర్తిగా నిర్ధారించలేదు. ఇక్కడ ఘర్షణలు జరగడం పరిపాటిగా మారింది. 1999, 2002, 2009, 2010లో రెండు దేశాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి.

ఎన్‌కౌంటర్‌లో లష్కరే ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది హతమయ్యాడు. శుక్రవారం వేకువజామున దక్షిణ కశ్మీర్‌లోని బోటిగామ్ గ్రామంలో ముష్కరుల సంచారం ఉందన్న నిఘా సమాచారం మేరకు బలగాలు కార్డన్ సెర్చ్ చేపట్టాయి. దాక్కున్న ఉగ్రవాది ఒక్కసారిగా కాల్పులకు దిగాడు. ప్రతిగా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో హతమైన ఉగ్రవాదిని బిలాల్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. చెక్ చొలాన్ ప్రాంతానికి చెందిన భట్ లష్కరే తోయిబాలో సభ్యుడు. ఘటనా స్థలి నుంచి ఏకే రైఫిల్‌తోపాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కుల్గామ్‌లోని సుద్సన్‌కు చెందిన ఫయాజ్(22) రాజ్‌పుటానా రైఫిల్స్ జవానుగా ఉండేవారు. బంధువు ఇంటికి పెళ్లికని వచ్చిన ఫయాజ్‌ను ఉగ్రవాదులు నిర్బంధించి 2017 మేలో కాల్చి చంపారు. ఈ ఘటనలో భట్ ప్రమేయం ఉన్నట్లు అప్పట్లో కేసు కూడా నమోదైనట్లు షోపియాన్ సీనియర్ ఎస్పీ తనుశ్రీ తెలిపారు. గ్రెనేడ్ విసిరి ఇద్దరు స్థానికేతర కార్మికులను చంపిన ఘటనలో భట్ హస్తముందని చెప్పారు.



పత్తి మార్కెట్‌కు రెండు రోజుల సెలవు

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌కు శని, ఆదివారం సెలవని కార్యదర్శి రాజ తెలిపారు. శుక్రవారం వ్యాపారులు క్వింటాల్ పత్తికి రూ. 6800 చెల్లించారు.



దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/17.0

జిల్లాలో వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి. చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ పోలీసులకు శిక్షణ



శిక్షణలో ట్రాఫిక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులను మరింత సుశిక్షితులుగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారితో శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలోని జాన్‌విల్సన్ మెమోరియల్ హాల్, పరేడ్ గ్రౌండ్‌లో రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. శిక్షణలో ట్రాఫిక్ సిబ్బంది ప్రాథమిక విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కూడళ్ల వద్ద వాహనదారులను పంపించుటకు సక్రమమైన పద్ధతిలో చేతి ద్వారా ఆచరించాల్సిన సంకేతాలపై శిక్షణ అందించామని వివరించారు. అంతేకాకుండా మోటారు వాహనచట్టం, సెంట్రల్ మోటార్ వెహికల్ రెగ్యులేషన్ (సీఎంవీఆర్), మోటార్ వెహికల్ డ్రైవింగ్ రూల్స్ (ఎంవీడీఆర్), ట్రాఫిక్‌కు సంబంధించిన ఐపీసీ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) లక్ష్మీనారాయణ, ఏసీపీలు వేణుగోపాల్, ప్రతాప్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ జోసెఫ్, అమరవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృందం



ఆసుపత్రిలో పర్యవేక్షిస్తున్న కేంద్ర బృందం

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని శుక్రవారం టీబీ ముక్త్ భారత్ కేంద్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఓపీ, ఐపీ, పేషెంట్ వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. బృందం ప్రతినిధి డాక్టర్ ప్రమోద్‌రెడ్డి సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పేషెంట్లకు అందించాల్సిన సేవలు వివరించారు. ఆసుపత్రిలో చేయాల్సిన మార్పులు చేర్పులపై సలహాలు సూచనలు అందించారు.

సముచిత స్థానం కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ మాదిగ



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

కరీంనగర్: విద్యారంగానికి సంబంధించిన పదవుల నియామకాల్లో తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామిక పాలన, సామాజిక న్యాయం అమలు చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దానికి కట్టుబడి ఉండాలన్నారు. అందులో భాగంగా విద్యారంగానికి సంబంధించి ఉన్నత విద్యా మండలి, వైస్ చాన్స్‌లర్లు, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌లు, టీఎస్‌పీఎస్సీ, యూనివర్సిటీ పాలక మండళ్లు, ప్రవేశ పరీక్షల సెట్స్ కన్వీనర్స్ మొదలగు నియామకాల్లో మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిగల మీద కక్ష్య సాధింపు చర్యలు చేపట్టి అన్ని రంగాల్లో తీవ్రంగా అణచివేసిందని అన్నారు. అహంకారం, దొరతనంతో కేసీఆర్ మాదిగలను అవమానించాడని, రేవంత్‌రెడ్డి అలాంటి తప్పిదాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు కట్టుబడి ఉండాలన్నారు. సమావేశంలో నాయకులు బెజ్జంకి అనిల్, ఇంజం వెంకటస్వామి, రేనుకుంట్ల సాగర్, దండు అంజయ్య, చెంచాల నవీన్, కనకం అంజిబాబు, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, మారంపెల్లి శ్రీనివాస్, గుడిసె తిరుపతిరాజ్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ

కొత్తపల్లి(కరీంనగర్): ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరణ్ రెడ్డి శనివారం కరీంనగర్‌కు రానున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లాకు తొలిసారిగా వస్తున్న సందర్భంగా అధికారులు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఆయన నెలవారీ విద్యుత్ సమీక్షా నిర్వహిస్తారని తెలిసింది.

ప్రజాపంపిణీలో బినామీలు!

- జిల్లాలో 60 నుంచి 70 మంది నకిలీ డీలర్లు
- గుట్టు రట్టుకు ప్రభుత్వం చర్యలు
- బోగస్‌లను ఈనెల 20లోగా ఏరివేయాలని ఆదేశం

కరీం'నగరం'లోని కిసాన్‌నగర్‌లో రేషన్ డీలర్ భద్రయ్య రెండు చౌక ధరల దుకాణాలు నిర్వహిస్తున్నాడు. అవి ఎప్పుడు తెరిచి ఉంటాయో.. మూసి ఉంటాయో తెలియని పరిస్థితి. ఇక సదరు డీలరు అసలు డీలరు కాకపోవడం మరో విశేషం. భద్రయ్య ఒక్కరే కాదు జిల్లాలో ఇలాంటి వారెందరో. ప్రజా పంపిణీలో చోటుచేసుకున్న పదనిసలు ఎన్నెన్నో!

జిల్లాలో గ్రామ పంచాయతీలు	313
మొత్తం రేషన్ దుకాణాలు	566
సుమారుగా బినామీలు	60-70
రేషన్ కార్డులు	2,76,120
బియ్యం సరఫరా	6, 402 మెట్రిక్ టన్నులు

కరీంనగర్ అర్బన్: చౌకధరల దుకాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో దశాబ్దాలుగా బోగస్ దందా సాగుతోంది. అనర్హులకు కొమ్ముకాసే అధికారులుండటంతో బినామీ డీలర్ల దందా అప్రతిహతంగా సాగుతోంది. అసలైన రేషన్ డీలర్లు వివిధ కారణాలతో మరణించడం, పలువురు వదిలేయడం, మరికొందరు కేసుల భయంతో పక్కకు తప్పుకోవడంతో నయానో బయానో డీలర్లుగా చలామణిగా అవుతుండగా ఇటీవల పలువురిని డీలర్లుగానూ నియమించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 'సాక్షి'లో 'డీలరు కాని డీలర్లు', 'కాగితాల్లోనేనా కార్యక్షేత్రంలోనా' శీర్షికన పలు కథనాలు ప్రచురించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బోగస్ రేషన్ డీలర్ల ఏరివేతకు ఆదేశాలు జారీచేయగా పౌరసరఫరాలశాఖ తదనుగుణ చర్యలకు సిద్ధమవుతోంది. ఈ నెల 20లోగా బోగస్ డీలర్లను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించగా ఇప్పటికే సదరు డీలరు కాని డీలర్లు తమ ఉనికి కోసం లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం.



లెక్క తేలితే మరిన్ని ఖాళీలు

జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 20శాతం దుకాణాలు డీలర్లు లేక ఇన్‌చార్జీలతో నడుస్తున్నాయి. నగరంలో అత్యధికంగా ఖాళీలుండగా హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, మానకొండూరు, తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, వీణవంక, గంగాధర, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో డీలర్లు లేని చౌక ధరల దుకాణాలున్నాయి. అయితే బినామీ డీలర్లను ఏరివేస్తే డీలర్ల ఖాళీల సంఖ్య పెరగనుంది. పౌరసరఫరాలశాఖ అధికారులు ఏరివేతలో కీలకం కానుండగా పక్కాగా పరిశీలన జరిపితే నియామకాలు, బినామీల రట్టుతో మామూళ్ల వ్యవహారం వెలుగుచూడనుంది.

బినామీలదే గుత్తాధిపత్యం

జిల్లాలో బినామీ డీలర్లకు కొదువ లేకపోగా రేషన్ బియ్యం పక్కదారిలో వీరిదే కీలకపాత్ర. కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి పట్టణాల్లో వీరి గుత్తాధిపత్యమే ఉంటుందన్న వాదనలు ఉన్నాయి. రేషన్ బియ్యం రావడమే తరువాయి కార్డుదారుల వద్ద కొనుగోలు చేసి అక్రమార్కులకు సరఫరా చేస్తున్నారు. ఇతర డీలర్ల వద్ద కూడా కొనుగోలు చేసి మిల్లర్లు, బీర్ల ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల లీలలతో డీలరు కాని డీలరు రెండు, మూడు దుకాణాలు నిర్వహిస్తుండగా నియామక ప్రక్రియ ఊసే లేకపోవడం విడ్డూరం. ఇక కొత్త గ్రామ పంచాయతీల్లో డీలర్ల ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది. కిలోమీటర్ల కొద్ది నడిచి సరుకులు తెచ్చుకోవడం వినియోగదారుల వంతవుతోంది.

నియామకంలోనూ బినామీలే

రేషన్ డీలర్ల నియామకంలోనూ బినామీలకే కొమ్ముకాశారన్న విమర్శలుండగా తాజా ప్రభుత్వ ఆదేశాలతో ఆసక్తికరంగా మారింది. అక్రమ నియామకాల గుట్టు రట్టయ్యే అవకాశముంది. హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్‌లో నోటిఫికేషన్ ద్వారా నియామక ప్రక్రియ చేపట్టగా కరీంనగర్ రెవెన్యూ డివిజన్‌లో నోటిఫికేషన్ వెలువరించలేదు. రెండేళ్ల క్రితం సదరు ప్రక్రియ సాగాల్సి ఉండగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వ్యక్తమయ్యా యి. పలువురు బినామీలను డీలర్లుగా నియమించుకుని దశాబ్దాలుగా రేషన్ సరుకులు అందిస్తుండగా, అసలు డీలరుకు బంధువంటూ బోగస్ ధ్రువీకరణ పత్రాలతో రహస్యంగా నియమించారు.

నియామకం జరిగేనా?

రేషన్ దుకాణాలకు శాశ్వత డీలర్లను నియమిస్తేనే ఫలితం ఉండనుండగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించినట్లవుతుంది. సరుకులు సకాలంలో పంపిణీ చేయడంతో పాటు కార్డుదారులకు నిరీక్షణ ఉండదు. కానీ ప్రభుత్వం ఏళ్ల తరబడిగా ఇన్‌చార్జి డీలర్లతో వ్యవస్థను కొనసాగిస్తోంది. కరీంనగర్‌లో అత్యధికంగా ఖాళీలుండగా గంగాధర, చొప్పదండి, రామడుగు, మానకొండూరు, తిమ్మాపూర్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి ప్రాంతాల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. కరీంనగర్, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్లలో 37 గ్రామాలు ఏర్పడగా రేషన్ దుకాణాల అంశం స్పష్టత లేకపోవడం ఆందోళనకర పరిణామం. హుజూరాబాద్ డివిజన్‌లో డీలర్లను నియమించగా అందులోనూ అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రజా సమస్యలు పరిష్కరిస్తా
- నెల గడవకముందే 420 అంటున్నరు
- కాలుకు స్లిప్పర్ లేనోడు.. ఫాంహౌస్‌లు కట్టుకున్నడు
- నియోజకవర్గంలో ప్రధానంగా సాగునీటి కొరత తీరుస్తా
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్: కాంగ్రెస్ కార్యకర్తల కృషి, ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం.. ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా.. ప్రజల సమస్యలు తీరుస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. మంత్రిగా తొలిసారి సైదాపూర్‌కు వచ్చారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. వెన్కెపల్లి సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాలవారీగా కార్యకర్తలతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తప్పకుండా దశలవారీగా పరిష్కరిస్తామని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల గడవకుండానే హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ మేనిఫెస్టోకు 420 స్టిక్కర్ అంటించి మోసం కేసులు పెడతామని బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పదేళ్లలో ఇచ్చిన వందల హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై సెక్షన్ 379(థెఫ్టు) కింద తెలంగాణ ప్రజల ఆస్తిని దొంగతనం కేసు, 384 సెక్షన్ కింద(ఎక్స్‌టార్షన్) అధికార బలంతో ప్రజల సొమ్మును భయపెట్టి లాక్కొన్న కేసు, 382 సెక్షన్ కింద రాబరీ కేసు, 395 సెక్షన్ కింద(డెకాయిట్) దారిదోపిడీ కేసులు వేయడానికి సిద్ధమన్నారు. తాను ఎంపీగా గెలిచినప్పుడు ఎమ్మెల్యేగా గెలిచినోడు అప్పుడు కాలుకు స్లిప్పర్లు లేవు కానీ.. ఇప్పుడు ఫాంహౌస్‌లు కట్టుకొని రూ.కోట్లకు అధిపతులయ్యారని అన్నారు. నాసికరం పనులు చేసి లక్షల కోట్లు దండుకొని కాళేశ్వరం నిర్మిస్తే.. మూడేళ్లకే కూలిందన్నారు. సహచర మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. గతంలో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన వ్యక్తికి అభివృద్ధిపై అవగాహన లేదన్నారు. 2014కు ముందు జరిగిన సాగునీటి కాలువల పనులు, తారు రోడ్లు, పాఠశాలలు మాత్రమే ఉన్నాయని, కొత్తగా ఒక బడి, కాలువ, రోడ్డు పోసిన పాపాన పోలేదని అన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే అధికారులతో మాట్లాడనని, మార్చి తర్వాత పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గోదావరిఖని-కట్కూర్ బస్సు, హుజూరాబాద్ వయా సర్వాయిపేట హుస్నాబాద్ బస్సును పునరుద్ధరిస్తానని అన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతమైన జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, మిట్టపెల్లి కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొత్త మల్లారెడ్డి, ఎంపీటీసీ, మండల మహిళాధ్యక్షురాలు చాడ చైతన్యారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి, రాఘవులు, సింగిల్‌విండో డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, బొమ్మగాని రాజు, నవీన్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు నేడే ఆఖరు

- ఇప్పటి వరకు 2,87,383 దరఖాస్తులు

ఏడు రోజులుగా వచ్చిన అర్జీలిలా

తేదీ	వచ్చిన అర్జీలు	కవరైన గ్రామాలు	వార్డులు
28	28,452	41	24
29	48,230	49	24
30	49,291	56	24
02	50,325	55	12
03	42,725	48	14
04	34,889	33	35
05	33,471	22	23



కరీంనగర్ అర్బన్: ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహిస్తుండగా అర్జీల జాతరను మరిపిస్తోంది. శుక్రవారం జిల్లాలో 22 గ్రామాలతో పాటు 5 మునిసిపాలిటీల్లోని 23 వార్డుల్లో అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ పమేలా సత్పతి పలు ప్రాంతాలను పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. శుక్రవారం గ్యారంటీలకు 33,471 అర్జీలు రాగా ఇతర అర్జీలు 6,015 మొత్తం 39,486 దరఖాస్తులు వచ్చాయి. కాగా శనివారం అర్జీల స్వీకరణకు చివరిరోజు కాగా తదుపరి డేటా ఎంట్రీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే సదరు ప్రక్రియకు శిక్షణనివ్వగా సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు.

ఇతర అర్జీలకు కౌంటర్

ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఇవి కాకుండా ఇతర సమస్యలపైన అర్జీలను స్వీకరిస్తున్నారు. ఇందుకు ప్రజాపాలన కార్యక్రమాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా తెల్ల కాగితాలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 24,937 అర్జీలు రాగా శుక్రవారం 6,015 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. ప్రధానంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు.

నేడు ప్రజాపాలన జరిగే ప్రాంతాలివే

గంగాధర మండలంలోని తాడిజెర్రి, ఉప్పరమల్యాల, వెంకటాయిపల్లి, వెంకంపల్లి, మానకొండూరు మండలంలోని ఊటూరు, వన్నారం, వేగురుపల్లి, వెల్ది, వీణవంక మండలంలోని వల్బాపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమం జరగనుంది. అలాగే హుజూరాబాద్ మున్సిపల్‌లో 29, 30, కొత్తపల్లిలో 12 డివిజన్లలో జరగనుంది.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్/కరీంనగర్ అర్బన్: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావుపై ఈనెల 25న జరిగే అవిశ్వాసంలో నెగ్గి మున్సిపాల్టీపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. ఎక్స్‌అఫిసియో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అనుమతి తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మెజార్టీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. చీలిక వర్గం కౌన్సిలర్లు టచ్‌లో ఉన్నారని వారిని భయభ్రాంతులకు గురిచేయడంతో నిజాలు చెప్పడం లేదన్నారు.

ప్రజాపాలన అర్జీలు ఆన్‌లైన్



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- 17లోగా ప్రక్రియ పూర్తిచేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్/కరీంనగర్ అర్బన్/కొత్తపల్లి: ప్రజాపాలన గ్రామ, వార్డు సభల ద్వారా స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. డిసెంబర్ 28 నుంచి ఈనెల 6 వరకు చేపట్టే ప్రజాపాలన ద్వారా అందే దరఖాస్తులను ఈనెల 17వ తేదీలోగా నమోదు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులకు ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై దిశానిర్దేశం చేశారు. దరఖాస్తులను ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి మండలాల వారీగా బృందాలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతీ ఆపరేటర్ 750 అర్జీల చొప్పున నమోదు చేయాలని సూచించారు. నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలని, ప్రతి అర్జీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ కావాలని ఆదేశించారు. ఇప్పటివరకు దరఖాస్తుల స్వీకరణ సాఫీగా సాగిదని, చివరివరకూ ఇలాగే కొనసాగించాలని చెప్పారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవో మహేశ్వర్, రాజు తదితరులతోపాటు కొత్తపల్లిలోని 10వ వార్డులో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్ గందు రాంబాబు పాల్గొన్నారు.

డ్రాపౌట్లను తగ్గించాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లు లేకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తన చాంబర్‌లో డీఈవో, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ప్రతీనెల మూడో శనివారం జరిగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ప్రగతి తక్కువగా ఉన్న విద్యార్థులపై వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలన్నారు. ప్రజా ప్రతినిధులను సమావేశాలకు ఆహ్వానించాలని చెప్పారు. ప్రతీ బడిలో బుధవారం బోధన కార్యక్రమం నిర్వహించి హాజరు పెంచాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. డీఈవో జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు సహకారం

కరీంనగర్ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన సహకారాన్ని ప్రాధాన్యతాక్రమంలో అందజేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి శివారులోని కరీంనగర్ వైద్య కళాశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. వైద్యకళాశాల భవనం, పరికరాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల స్థితి గతుల గురించి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ కలెక్టర్‌కు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శంతన్, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఆర్ఎంవో నవీన, సూపరింటెండెంట్ ఉదయ్‌ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు వాటర్ ప్లస్ హోదా!

- చక్కటి మురుగు శుద్ధి. పునర్వినియోగానికిగాను హోదా
- ప్రకటించిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ
- హర్షం వ్యక్తం చేసిన మేయర్



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలక సంస్థకు ప్రతిష్ఠాత్మక వాటర్ ప్లస్ హోదా లభించింది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా వాటర్ ప్లస్, ఓడీఎఫ్ హోదాల జాబితా శుక్రవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 15 మున్సిపాల్టీలకు ఈ హోదా లభించగా, రాష్ట్రం నుంచి హైదరాబాద్, కరీంనగర్ గుర్తింపును దక్కించుకున్నాయి. నగరవ్యాప్తంగా డ్రైనేజీ నీళ్లు నిలవకుండా సాఫీగా వెళ్లడం, మురుగు నీటిని ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ద్వారా శుద్ధీకరించి వివిధ నిర్మాణాలు, మొక్కలు, నర్సరీల పెంపునకు వినియోగించడం, స్మార్ట్ టాయిలెట్లు నిర్మించి, పరిశుభ్రంగా ఉంచడంతో ఈ గుర్తింపు వచ్చింది.

గర్వకారణం

నగరపాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం వాటర్ ప్లస్ గుర్తింపు ఇవ్వడం గర్వకారణమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన గుర్తింపులో నగరపాలక సంస్థ తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసుకునేలా ప్రజలను అవగాహన కల్పిస్తున్నట్లు మేయర్ చెప్పారు. హెల్ప్‌లైన్ నెం: 14420 ద్వారా సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడం, వంద శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నెట్ వర్క్ ద్వారా మురుగు నీటిని ఎస్టీపీకి తరలించి ట్రీట్ చేయడం, శుద్ధి చేసిన వాటర్ ను పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా వాటర్ ప్లస్ గుర్తింపు వచ్చిందన్నారు.

హోదా ఎలా ఇస్తారంటే..

వాటర్‌ప్లస్ హోదా రావాలంటే జలవనరులను శుభ్రంగా ఉంచాలి. గృహాలు, వాణిజ్య సముదాయాల నుంచి విడుదలయ్యే మురుగును శుద్ధి చేసిన తర్వాతే విడుదల చేయాలి. ఇలా పక్కాగా చేస్తున్న నగరాలకే వాటర్‌ప్లస్ హోదా ఇస్తారు.

మార్కుల కేటాయింపు ఇలా..

వాటర్ ప్లస్ హోదా ఇవ్వాలన్న నగరపాలక సంస్థ ప్రతిపాదనలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ బృందం గతంలో వివిధ ప్రాంతాలలో పర్యటించింది. మురుగునీటి నిర్వహణ, శుద్ధి చేసిన నీటి పునర్వియోగం.. ఇలా సుమారు తొమ్మిది అంశాలలో మార్కులను కేటాయించింది. ఫీకల్ స్లడ్జ్, మానవ రహిత శుద్ధి, నిర్వహణలో సిబ్బందికి పీపీఈ, రక్షణ కిట్లు, ఎస్టీపీల వద్ద శుద్ధి ప్రక్రియ, రీ యూజ్ విధానం అమలు, ఎస్టీపీ, ఎఫ్ఎస్టీపీల నిర్వహణ, ఆపరేషన్స్, సివరేజీ లీకేజీలు, వాటర్ లాగింగ్, డ్రైనేజీ క్లీనింగ్ ఫిర్యాదులను పరిష్కరిస్తున్న తీరు.. ఇలా అనేక కేటగిరీల్లో పాస్ మార్కులు ఇచ్చి వాటర్ ప్లస్‌కు ఎంపిక చేశారు.

రక్షణ కవచాలు.. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్

- బాల్యానికి భరోసా కల్పిస్తున్న ప్రత్యేక బృందాలు
- 31 వరకు బాల కార్మికుల గుర్తింపు



చింతకుంటలోని ఇటుక బట్టీల వద్ద ఒడిశాకు చెందిన బాల కార్మికులను గుర్తించిన డీఈవో, విద్యాశాఖ బృందం(ఫైల్)

కరీంనగర్: ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు బాల్యానికి భరోసా కల్పిస్తున్నాయి. చిన్నతనంలోనే అమ్మ, నాన్న ఆలనకు దూరమైన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు అనాథలుగా మారి బాల కార్మికుల అవతార మెత్తి దుర్భర జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రతి ఏటా మూడు నెలల కోసారి జిల్లా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, బాలల సంరక్షణ బృందాలు, పోలీసు విభాగం, చైల్డ్ లైన్(1098) బృందాలు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు బాల కార్మికులకు భరోసానిస్తున్నాయి.

దిక్కుతోచక వెట్టిచాకిరి..

ఆడుతూ పాడుతూ సంతోషంగా చదువుకోవాల్సిన చిన్నారులు బాల్య కార్మికులుగా మారుతున్నారు. ఆర్థిక కారణాలతో ఎంతోమంది పిల్లలు బాల కార్మికులుగా మారుతుంటే.. మరికొంతమంది భిక్షాటన చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలు, అనాథలుగా దిక్కుతోచని స్థితిలో వెట్టిచాకిరికి గురవుతున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగానే ప్రతి ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లా సంక్షేమ అధికారి సమక్షంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్(1098), బాలల సంక్షేమ సమితి, ప్రత్యేక బాలల పరిరక్షణ విభాగం, జాతీయ బాల కార్మిక విభాగాలు ఉండి సమన్వయంతో జిల్లాలోని బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది విడతల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 3,388 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆపరేషన్ స్మైల్–10 కార్యక్రమంలో 18 సంవత్సరాల్లోపు వయస్సు గల బాలబాలికలు, వీధి బాలలు, భిక్షాటన చేసే పిల్లలు, అనాథ పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి సంరక్షణ బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో..

కార్మికులుగా మారుతున్న 18 సంవత్సరాల్లోపు బాలలను రక్షించేందుకు జనవరి మాసంలో ఆపరేషన్ స్మైల్ పేరుతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), పోలీసు విభాగం, చైల్డ్ లైన్(1098), లేబర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కలిసి రెస్క్యూ నిర్వహిస్తారు. ఈనెల 31 వరకు 10వ విడత ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నారు. బాలలతో పనులు చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు వీధి బాలలు, తప్పిపోయిన బాలలు, పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పిస్తున్నారు. గుర్తించిన బాలలను రెస్క్యూ తరువాత వారిని ఎక్కడ ఉంచాలనే నిర్ణయాధికారం మాత్రం బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) అధికారులకుంటుంది. అనంతరం సీడబ్ల్యూసీ అధికారుల ఆదేశానుసారం డీసీపీయూ పని చేస్తుంటుంది. అదేవిధంగా ఆపరేషన్ ముస్కాన్ పేరుతో జూలై 1 నుంచి 31 వరకు అదే అధికారుల బృందాలు రెస్క్యూ నిర్వహిస్తారు. అనంతరం ఆరు నెలల వ్యవధిలో పట్టుబడ్డ బాల కార్మికులకు సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద బాలసహాయక కిట్స్ ఇవ్వడంతో పాటు వారి సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వమే చూసుకుంటుంది.

31 వరకు కొనసాగుతుంది



బాల కార్మికులకు ప్రభుత్వం భరోసానిచ్చేందుకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాల కార్మికులుగా మారుతున్న బాలలకు బంగారు భవిష్యత్తివ్వడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఏడాది ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి బాల కార్మికులను గుర్తిస్తున్నాం. గుర్తించిన బాలలను సీడబ్ల్యూసీ ఆదేశానుసారం విద్య, వైద్యం, వసతులు కల్పిస్తున్నాం. ఈనెల 31 వరకు ఆపరేషన్ స్మైల్‌తో బాల కార్మికుల గుర్తింపు కోసం ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. బాల కార్మికుల వివరాలు అందించడంలో ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యం. ఆపదలో ఉన్న బాలబాలికల సమాచారం కోసం పోలీసు, రెవెన్యూ, శిశు సంక్షేమ, కార్మిక విభాగం అధికారులతో పాటు చైల్డ్‌లైన్(1098)కి ఫోన్ చేస్తే వారికి రక్షణ కల్పిస్తాం.

– సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన ఎలేటి జితేందర్‌రెడ్డి (40) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జితేందర్‌రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మనస్తాపంతో తన మామిడితోటలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రేవంత్‌కు సన్మానం



రేవంత్‌ను సన్మానిస్తున్న ఆడెపు రవీందర్ తదితరులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన సర్కారు బడి విద్యార్థి కుంచె నుంచి జాలువారిన అయోధ్య టెంపుల్, రాముడి నమూన చిత్రాలు అదుర్స్ అనిపించాయి. వీటిని ఈనెల 22న ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దాసరి రేవంత్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు ఆడెపు రవీందర్ చేతుల మీదుగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. నిరుపేద నేత కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే అద్భుత కళాచిత్రాలను ఆవిష్కరిస్తున్నందున రూ.3వేల బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, గాజుల వేణు, కొండ నరేశ్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు చే పూరి అశోక్; పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



అరెస్టు చేస్తున్న పోలీసులు

సిరిసిల్లటౌన్: చాలా రోజులుగా చిరు వ్యాపారుల సామగ్రిని దొంగలిస్తూ మార్కెట్‌లో అమ్ముకుంటున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన సిరిసిల్ల పట్టణంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక మున్సిపల్ ఆఫీస్ పక్కన శివాలయం వద్ద దేవయ్య దంపతులు చాలాఏళ్లుగా కొబ్బరిబొండాలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. వరంగల్‌కు చెందిన మహేశ్ రాత్రివేళల్లో కొబ్బరిబొండాలు ఎత్తుకెళ్లి మార్కెట్లో విక్రయిస్తున్నాడు. అంతకుముందు వినాయక ప్రతిమలు తదితరాలు కూడా దొంగతనం చేశాడు. ఆ ప్రాంత చిరువ్యాపారులు అతడిపై నిఘా పెట్టారు. దొంగతనానికి వచ్చి వెళ్తున్న మహేశ్‌ను శుక్రవారం సాయంత్రం పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులు వచ్చే వరకు స్తంభానికి కట్టేశారు. టౌన్ సీఐ ఉపేందర్ సిబ్బందిని పంపించి దొంగను అదుపులోకి తీసుకున్నారు. తాను తాగినమైకంలో తప్పు చేశానని సదరు దొంగ పోలీసులతో చెప్పడం విశేషం.

భార్యపై హత్యాయత్నం.. అరెస్ట్

సిరిసిల్లక్రైం: భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై సిరిసిల్లలో కేసు నమోదైంది. సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరుకు చెందిన దండబోయిన సౌజన్యకు సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠల్‌నగర్‌కు చెందిన దండబోయిన శ్రీకాంత్‌తో గతేడాది వివాహం జరిగింది. పెళ్లి జరిగిన పదిహేను రోజునుంచి రూ.5లక్షలు అదనపు ఇవ్వాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. లేకుంటే చంపుతానని బెదిరించారు. ఈ క్రమంలో కిరోసిన్ పోసే ప్రయత్నం చేశాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, శ్రీకాంత్‌ను రిమాండ్ చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

డీఈడీ పరీక్షలో ఒకరి డిబార్

తిమ్మాపూర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు గురువారం నుంచి జరుగుతున్నాయి. ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సమాజం, విద్య, పాఠ్యప్రణాళిక పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా పరీక్ష రాసేందుకు వచ్చిన సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ విద్యార్థి కాపీ కొడుతూ పట్టుపడ్డాడు. అతడి వద్ద చిట్టీలు దొరకడంతో డిబార్ చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కుత్తాల సరోజనను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త కుత్తాల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అదనంగా కట్నం తేవాలని సరోజనపై ఇటీవలే లక్ష్మణ్ దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెద్దపల్లి, వరంగల్ ఎంపీ సీట్లు మాదిగలకే ఇవ్వాలి



మాదిగశక్తి ర్యాలీలో నాయకులు

పెద్దపల్లిరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ నేతలకు పోటీచేసే అవకాశాన్ని ప్రధాన రాజకీయపార్టీలు కల్పించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పిడమర్తి రవి, మాదిగ రాజకీయ వేదిక చైర్మన్ సోమ చంద్రశేఖర్ కోరారు. పెద్దపల్లిలో శుక్రవారం మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్‌సన్నీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశక్తి ర్యాలీలో పాల్గొన్న వక్తలు.. మాదిగలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. కమాన్ నుంచి డప్పుచప్పుళ్లతో ప్రదర్శనగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో మాదిగలు పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశాన్ని గజ్జెల కాంతంకు ఇవ్వాలన్నారు. పెద్దపల్లిలో మాదిగలకు చాలాకాలంగా అన్యాయమే జరుగుతోందని రాజకీయ వేదిక చైర్మన్ సోమ చంద్రశేఖర్ అన్నారు. ఒక కుటుంబానికే కాంగ్రెస్ ఇప్పటిదాకా టికెట్లు ఇచ్చిందని, ఇప్పటికైనా ఉద్యమకారులకు పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. నాయకులు రవి, కనకరాజు, సురేందర్, నారాయణ, నర్సయ్య, సందీప్, అజయ్, భూమయ్య, కమల, అశోక్, మధు, బబ్లు, సత్యం, లక్ష్మణ్, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమం పేరుతో చందాల వసూలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి, కొదురుపాక తదితర గ్రామాల్లో నాగ్‌పూర్‌లో అనాథాశ్రమం నిర్వహణ పేరుతో ఇద్దరు మోసగాళ్లు చందాలు వసూలు చేస్తున్నారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సీ.రామరాజు శుక్రవారం తెలిపారు. దొంగ సర్టిఫికెట్లు చూపుతూ చందాల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని రామరాజు సూచించారు.

రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న కాసర్ల ఆనంద్

కరీంనగర్‌కల్చరల్: అయోధ్య రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలను శుక్రవారం 10వ డివిజన్‌లో కార్పొరేటర్ కాసర్ల ఆనంద్–లక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికి పంచారు. ఈ కార్యక్రమంలో రాజు, కాసర్ల వేణు, రాజమల్లయ్య, సంపత్, శ్రీనివాస్, ఇళయరాజా, హనుమాండ్లు, లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని గణేశ్‌నగర్ వినాయక టవర్స్, శక్తి టవర్స్‌లలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, నాయకులు డాక్టర్ పి.సుజాతారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామజన్మభూమి అక్షింతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్వేతారెడ్డి, సుమారెడ్డి, రమారెడ్డి, మంజులారెడ్డి, కల్యాణి, అరుణారెడ్డి, విద్యారెడ్డి, విజయారెడ్డి, రజిత పటేల్, మౌనిక, శ్రీదేవి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో పగిలిన స్కూల్ బస్సు అద్దాలు

రామగిరి(మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల బస్టాండ్ సమీపంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం సెంటనరీకాలనీ నుంచి పెద్దపల్లి వైపు స్కూల్, కళాశాల విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును కల్వచర్ల సమీపంలో మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుకాల అద్దం పగిలిపోయింది. వెనుక సీట్లో కూర్చున్న విద్యార్థులపై గాజు పెంకులు పడి స్వల్పంగా గాయపడ్డారు. ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బురదలో పడి వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓ వ్యక్తి బురదలో కాలుజారి పడి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల కుమారస్వామి(40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితమే భార్య చనిపోగా పదేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య చనిపోయిందన్న దిగులుతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఈ నెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. తల్లి పిట్టల భాగ్యమ్మ పొలం పనులకు వెళ్లగా బురదలో పడి ఉండటంతో కేకలు వేసింది. గమనించిన స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తప్పుల్లేకుండా నమోదు చేయండి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మహలక్ష్మీ, రైతు భరోసా, గృహలక్ష్మీ, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై వచ్చిన అర్జీల డేటా ఎంట్రీపై డీటీఎం, డీపీఎం, మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణిచ్చారు. ప్రజాపాలన దరఖాస్తులను, వాటి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. సిబ్బందికి శిక్షణ అందించడం జరుగుతోందని, శిక్షణ అనంతరం సిబ్బందిని రెండు బృందాలుగా చేసి రోజుకు రెండు షిఫ్టులవారీగా నమోదు ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌వో పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీపీవో కొమురయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగదు పురస్కారాలు ప్రదానం



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి, సునీతారెడ్డి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన సెమ్స్ ఒలంపియాడ్ 2023లో జాతీయస్థాయి ర్యాంకులు, నగదు బహుమతులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సెమ్స్ ఒలంపియాడ్ నిర్వాహకులు అరకుల రామచంద్రారెడ్డి, ఎస్.ఎన్.రెడ్డి నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. మానేరు విద్యాసంస్థలకు చెందిన హర్షవర్ధన్, సహస్ర జాతీయస్థాయిలో ఒకటో ర్యాంకు, మూడో ర్యాంకు సాధించి రూ.10,000 చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు. పలువురు విద్యార్థుల సైతం జాతీయ, రాష్ట్రస్థాయి బహుమతులు సాధించి నగదు పారితోషికాలను అందుకున్నారు. వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెమ్స్ ఒలంపియాడ్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో కూడా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఈ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని, పోటీ పరీక్షలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

కరీంనగర్ క్రైం: కట్టరాంపూర్‌కు చెందిన బండమీది రాజ్‌కుమార్(38) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. ఇంట్లోనే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉరేసుకోగా.. అతడి భార్య గమనించి స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేసరికి మృతిచెందినట్లు తెలిపారు. బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదు.

జాతీయస్థాయిలో ఎన్‌సీసీకేడెట్ల ప్రతిభ



అభినందిస్తున్న కమాండింగ్ అధికారి

కరీంనగర్‌సిటీ: జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ కేడెట్లను 9వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ డేనియల్ లోట్‌జామ్ శుక్రవారం అభినందించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 11 మంది ఎన్‌సీసీ కేడెట్లు లక్షద్వీవుల రాజధాని కవరితిలో జరిగిన ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరానికి వెళ్లారని, డిసెంబర్ 22 నుంచి 31 వరకు జరిగిన శిబిరంలో తెలంగాణ నుంచి 11 మంది ఎన్‌సీసీ కేడెట్లు గ్రూప్ డాన్స్‌లో ప్రథమ స్థానం, డిబేట్ పోటీల్లో రెండో స్థానం, క్విజ్‌లో మూడో స్థానం పొందారన్నారు. కేడెట్లు భార్గవ్, సైన్, భార్గవ్‌సాయి, అభిరామ్, అనూష, రాజవర్ధన్‌ను ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, కెప్టెన్ కిరణ్‌జ్యోతి, లెఫ్ట్ అధికారి రాజు అభినందించారు.


అప్పు చేసి ఇల్లు నిర్మించొద్దన్నందుకు..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మొట్లపల్లి గ్రామానికి చెందిన సంఘని రాజయ్య(50)అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రాజయ్య గ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక ఇంటి పనులు నిలిచి పోయాయి. అప్పు తెచ్చి నిర్మాణం కొనసాగించాలని కుటుంబ సభ్యులను కోరాడు. అప్పుతెచ్చి ఇల్లు కడితే అవి తీర్చలేక ఇబ్బందుల పాలవుతామని కుటుంబసభ్యులు నిరాకరించారు. మనస్తాపానికి గురైన రాజయ్య ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

షాక్ కొట్టిన కంచె.. యువకుడికి గాయాలు

చందుర్తి(వేములవాడ): అటవీ జంతువుల నుంచి పంటను కాపాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె షాక్‌కొట్టి ఓ యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. చందుర్తి మండలం రామన్నపేట గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి తన పంటచేల్లోకి వెళ్తుండగా మార్గమధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్‌కంచె షాక్‌తగిలి కాలు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు యువకుడిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పంటల రక్షణ పేరిట రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాపరిధిలో వేటగాళ్లు కొందరు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసిన వన్యప్రాణులను వధిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వన్యప్రాణుల వేటగాళ్లను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఒలింపియాడ్'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్: గతేడాది నవంబర్‌లో రాష్ట్ర స్థాయి ఐఎస్‌టీఎస్‌వో ఒలింపియాడ్ పరీక్షలో మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. పరీక్షల్లో 202 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రెండో లెవెల్ పరీక్షకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్ శుక్రవారం అభినందించారు. పాఠశాల డీన్ విజయకష్ణ, కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి , ప్రైమరీ ఇన్‌చార్జి మమత, ఏవో జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల్లో కరీంనగర్ కవులకు సన్మానం

కరీంనగర్‌కల్చరల్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో శుక్రవారం కరీంనగర్ కవులకు నారాయణభట్టు వేదికపై సన్మానం చేశారు. సభ వేదిక నిర్వాహకులు ఎస్ఆర్ఎస్ కొల్లూరి, కొత్తగూడెం, రాజేశ్ కరీంనగర్ కవులు వైరాగ్యం ప్రభాకర్, నూజెట్టి రవీంద్రనాథ్, సయ్యద్, సమీనా పర్వీన్‌ను సన్మానించారు.

గాయపరిచిన వ్యక్తికి జైలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన ఎర్రం ప్రవీణ్‌ను 2017లో అదే గ్రామానికి చెందిన గంగు లక్ష్మిరాజం గాయపరచడంతో కేసు నమోదైంది. విచారణలో భాగంగా శుక్రవారం లక్ష్మిరాజంకు 9 నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు.

నకిలీ పత్రాలతో భూకబ్జాకు యత్నం

- ఆలస్యంగా వెలుగులోకి.. ముగ్గురిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో సుమారు 10 గుంటల భూమిని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి విక్రయదారుల సంతకాలు ఫోర్జరీ చేసి భూకబ్జాకు యత్నించిన ముగ్గురిపై పట్టణ సీఐ నటేశ్‌గౌడ్ ఈనెల 1న కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన మెట్ట తిరుమల్‌రావు, మెట్ట సురేందర్ రావుకు వారసత్వంగా వచ్చిన భూమిని ఓ రిటైర్డ్ అధికారికి విక్రయించి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇటీవల కోరుట్ల మండలం యెకిన్‌పూర్‌కు చెందిన మిట్టపల్లి బుచ్చిరెడ్డి, మిట్టపల్లి అకిలాకర్, కోరుట్ల ఆదర్శనగర్‌కు చెందిన వేల్పుల కొమురయ్య నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, సంతకాలు ఫోర్జరీ చేసి రిటైర్డ్ అధికారి కొనుగోలు చేసిన భూమి వద్దకు వెళ్లి పత్రాలు చూపిస్తూ భూకబ్జాకు యత్నించారు. దీంతో రిటైర్డ్ అధికారి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కబ్జాకు యత్నించిన వ్యక్తులు తెచ్చిన రిజిస్ట్రేషన్ పత్రాలు, సంతకాలు ఫోర్జరీ అని తేలడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా సదరు భూమి విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుంది.

అల్ఫోర్స్ విద్యార్థులకు కరాటే బెల్ట్‌లు ప్రదానం



బెల్ట్‌లు పొందిన విద్యార్థులతో డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ– టెక్నో స్కూల్‌లో శుక్రవారం అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులకు కరాటే బెల్టులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేసారు. 30 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్, 25 మందికి ఆరెంజ్, 15 మందికి గ్రీన్, ఐదుగురికి బ్లూ, మరో ఐదుగురికి మెరూన్ బెల్ట్‌లను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి అందజేశారు. ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని, బాల్య దశ నుంచే కరాటే నేర్చుకోవడం ద్వారా తనను తాను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్, శిక్షకులు, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే ఇన్‌స్పైర్ మనక్ పోటీలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పరిశోధనాత్మక విధానాన్ని పెంచేందుకు నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలు ఈ ఏడాది ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఆంజనేయులు తెలిపారు. ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి ఈనెల 18వరకు అవకాశం ఉందని తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారని, జాతీయస్థాయిలో ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ చేశారన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 18వ తేదీలోగా విద్యార్థులు నమూనాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని కోరారు. ఈనెల 19 నుంచి 25వరకు మూల్యాంకనం జరుగుతుందని, 28 నుంచి 31వరకు రాష్ట్రస్థాయి పోటీలకు యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఒక్కో విద్యార్థికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించామని, విద్యార్థి సమగ్ర వివరాలతో లాగిన్ కావాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టు వీడియో నిడివి రెండు నిమిషాలు, డాటా 30 ఎంబీ దాటకూడదని తెలిపారు.

16 నుంచి భూసేకరణపై అభ్యంతరాల స్వీకరణ

కరీంనగర్‌రూరల్: జగిత్యాల–వరంగల్ నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి ఈనెల 16 నుంచి వచ్చేనెల 1 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు ఆర్డీవో కె.మహేశ్వర్ తెలిపారు. 16న గంగాధర మండలం వెంకటాయిపల్లి, ఇస్లాంపూర్, 17న గంగాధర, 18న కురిక్యాల, 19న వెదిర, 20న దేశరాజ్‌పల్లి, 23న రామడుగు మండలం కొక్కెరకుంట, 24న వన్నారం, 25న కొత్తపల్లి హవేలి, 27న కరీంనగర్ మండలం నగునూరు, 30న జూబ్లీనగర్, 31న ఎలబోతారం, ఫిబ్రవరి 1న ఇరుకుల్ల గ్రామాలకు చెందిన రైతులు ఆర్డీవో కార్యాలయంలో జరిగే విచారణకు హాజరవ్వాలని కోరారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన మధురోహిత్, సాయికార్తీక్

కరీంనగర్‌స్పోర్ట్స్: హర్యానా రాష్ట్రంలో ఈనెల 5 నుంచి జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఇండియా హ్యాండ్‌బాల్ పోటీలకు రామడుగుకు చెందిన సమంతుల మధురోహిత్, నీలం సాయికార్తీక్ ఎంపికయ్యారు. వీరు స్నేహ ఒకేషనల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి వి.శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ నమికొండ ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సప్తగిరికాలనీ(కరీంనగర్): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర వారి ఆధ్వర్యంలో అయోధ్యలో భవ్యమైన రామ మందిరం పునః ప్రతిష్ట సందర్భంగా ఈనెల 1 నుంచి 15 వరకు జరిగే శ్రీరామ పూజిత అక్షింతలు వితరణ మహోత్సవంలో భాగంగా కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. మంకమ్మతోట, వేంకటేశ్వర కాలనీల్లో గడపగడపకు అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బత్తిని మధు, యువ క్రాంతి, తుమ్మల రమేశ్‌రెడ్డి, కాలనీ మహిళలు కరుణశ్రీ, మాలతి, పద్మ, ఆలయ పారాయణం బృందం, కాలనీవాసులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం నగరంలోని సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.తాజొద్దీన్ కేక్ కట్ చేశారు. నేహాల్ అహ్మద్, పొరండ్ల రమేశ్, షేక్ శౌహెన్షా, షబానా మహమ్మద్, ఊరడి లత, వంగల విద్యాసాగర్, అష్రఫ్, మహమ్మద్ బారి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కరీంనగర్‌కల్చరల్: అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో రెండో యేడు పాతబజార్ చిన్న హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వాములకు 42 రోజుల పాటు అన్నదానం చేసిన కుటుంబ సభ్యులు, దీక్షాపరులకు శుక్రవారం ఆలయంలో సన్మానం చేశారు. అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకుడు అనంతుల పురుషోత్తం, నలమాచు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్యారంటీలు ప్రజలకందేలా చర్యలు

- నగర మేయర్ సునీల్‌రావు



33వ డివిజన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజల దరఖాస్తులకనుగుణంగా ప్రభుత్వ గ్యారంటీలు అందేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ పోలీసు క్వార్టర్స్‌లో కొనసాగుతున్న కేంద్రాన్ని ఆయన సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌కు చెందిన పలువురు మహిళలకు ప్రజాపాలన ఫారాలను అందజేసి, దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు పూరించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించారు. అనంతరం ప్రజాపాలన కేంద్రం వద్దకు వచ్చిన మహిళలు పోలీస్ క్వార్టర్స్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యతో పాటు పలు సమస్యలను నివేదించారు. వెంటనే స్పందించిన మేయర్ విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ ద్వారా సమాచారం అందించి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. పార్క్‌ను నగరపాలక సంస్థ ద్వారా అభివృద్ధి చేస్తామని, డివిజన్‌లో ఉన్న పలు సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాపాలన కార్యక్రమానికి శనివారం చివరిరోజు కాబట్టి మిగిలిన వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా 60 డివిజన్‌లలో ప్రజాపాలన పూర్తయ్యేలోగా దాదాపు 90 వేలకు పైగా దరఖాస్తులు రావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన ఉండి, పథకాలు అర్హులందరికి అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని కోరారు.

పరిశీలించిన కలెక్టర్

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రజాపాలన కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్, కాశ్మీర్‌గడ్డలోని కేంద్రాలను తనిఖీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆయుష్ ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆయుష్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక రాంనగర్‌లోని ఆయుష్ ఆసుపత్రిలో ఆయుష్ శాఖ వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ బి.రవినాయక్ ఆవిష్కరించారు. డాక్టర్ సంజీవ్‌కుమార్, దేవసాని సుధాకర్, సిరిపురం రాజేశ్వర్, విజయేందర్, జలంధర్, పుష్పలత, ఉమాపతి, లక్ష్మణ్, ప్రేమలత, శైలజ, మహేశ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, రీటా సునీత, నిర్మల, బ్రహ్మచారి పాల్గొన్నారు.

పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా తిరుపతి



కరీంనగర్: పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన గంగారపు తిరుపతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మాట్లాడుతూ.. నియమాకం చేసిన కేంద్ర, రాష్ట్ర పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నాయకులు గడ్డం రఘు, వెంకటేశ్, సదానందం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



కొత్తపల్లి ఎంపీపీ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలిస్తున్న ఎంపీడీవో



కరీంనగర్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని 8 గ్రామాల్లో ప్రజాపాలన అభయహస్తం కింద గత నెల 28 నుంచి జనవరి 6 వరకు స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కొత్తపల్లి మండలంలోని 8 గ్రామాల్లో స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 12 కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తపల్లి మండలానికి 12 లాగిన్లు కేటాయించగా.. తొలిరోజు 4 లాగిన్ల ద్వారా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. 8 గ్రామాల్లో గత నెల 28 నుంచి జనవరి 2 వరకు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన శనివారం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో 1,610, బద్దిపల్లిలో 495, చింతకుంటలో 3,042, ఎలగందులలో 1,159, కమాన్‌పూర్‌లో 957, ఖాజీపూర్‌లో 541, మల్కాపూర్‌లో 1,516, నాగులమల్యాలలో 888, మొత్తం 10,408 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ 17వ తేదీ లోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లలో అభయహస్తం దరఖాస్తులను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

13వేల దరఖాస్తులు

కరీంనగర్‌రూరల్: ప్రజాపాలన గ్రామసభల్లో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం కరీంనగర్ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు ప్రక్రియను చేపట్టారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల్లో గత నెల 28 నుంచి ఈనెల 4 వరకు దరఖాస్తులను స్వీకరించారు. శనివారం ఆయా గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు. ఇప్పటివరకు మొత్తం 13,151 దరఖాస్తులను స్వీకరించారు. ఒక కుటుంబానికి ఒకటే దరఖాస్తు చేయాలని ప్రభుత్వం నిర్దేశించినా.. రెండు, మూడు దరఖాస్తులు వచ్చాయి. స్పష్టత లేకపోవడంతో రైతుబంధు, ఆసరా పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు సైతం దరఖాస్తు చేయడంతో అధికారుల అంచనాకు మించి దరఖాస్తులు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారనే మార్గదర్శకాలు రాకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. సర్వే చేసిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తారా ఎలా అనేది ఇంకా ప్రభుత్వం స్పష్టం చేయలేదు. అయితే వచ్చే నెల నుంచి మహిళలకు నెలకు రూ.2,500 అందిస్తామని ప్రకటించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రత్యేకంగా యూనిక్ కోడ్ నెంబర్‌ను కేటాయించి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు ఈనెల 17 వరకు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్, ఎంపీడీవో తెలిపారు.

ధర పతనం.. గిట్టుబాటు గగనం

- పత్తి రైతులకు ప్రతికూల పరిస్థితులు



చెర్లభూత్కూర్‌లో పత్తి ఏరుతున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: ఈ ఏడాది పత్తి రైతులకు నిరాశే మిగిలింది. పత్తి పంట సాగు ప్రారంభం నుంచి కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు వేసేటప్పుడు వర్షాభావ పరిస్థితులతో మొలక దశలోనే ఎండిపోవడంతో రెండోసారి విత్తుకోవాల్సి వచ్చింది. అనంతరం మొక్కలు ఎదిగే సమయంలో భారీ వర్షాలకు పంట దెబ్బతినడంతో పాటు కలుపు విపరీతంగా పెరిగింది. అంతేకాక తెగుళ్లు ఆశించడంతో నియంత్రణ కోసం క్రిమిసంహారక మందులను రైతులు ఉపయోగించినా.. ఆశించిన దిగుబడి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,900 ఎకరాల్లో పత్తి సాగు

కరీంనగర్ మండలంలో వానాకాలం సీజన్‌లో 1,900 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ.25వేల వరకు అవుతున్నాయి. దిగుబడి 10 క్వింటాళ్ల వరకు రావాల్సి ఉండగా.. 8 క్వింటాళ్లు మాత్రమే రావడంతో నష్టపోతున్నామని రైతులు తెలిపారు. 2021తో పోలిస్తే పత్తి ధర క్రమంగా తగ్గుతోంది. ఆ ఏడాది క్వింటాల్‌కు రూ.10వేల నుంచి రూ.12వేలుండగా.. 2022 సంవత్సరం మొదట్లో రూ.9వేల వరకు పలికింది. గతేడాది డిసెంబరు నుంచి ధర పతనమవుతూ వస్తోంది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.6,500 నుంచి రూ.7వేల మధ్య ఉంది.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



మూడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేసిన. దిగుబడి అనుకున్నంతగా రాలె. మొదటి సారి పత్తి ఏరితే 23 క్వింటాళ్లు రాగా.. 13 క్వింటాళ్లను రూ.6,600 చొప్పున విక్రయించిన. ధర లేకపోవడంతో ఇంకా 10 క్వింటాళ్ల వరకు పత్తిని ఇంట్లోనే నిల్వ చేసిన. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

– ఆకుల నర్సయ్య, పత్తి రైతు, చెర్లభూత్కూర్

ఖర్చులు పెరిగాయి



రెండెకరాల్లో పత్తి ఏసిన. తెగుళ్లు సోకడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. ఒకసారి పత్తి ఏరితే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాల్‌కు రూ.6,700 చొప్పున విక్రయించిన. పత్తి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది.

– కదారి సంపత్‌కుమార్, పత్తి రైతు, చెర్లభూత్కూర్

ప్రేమోన్మాది దాడులను ఖండించండి



కావ్యను పరామర్శిస్తున్న నాయకులు

కరీంనగర్: కొత్తపల్లి పట్టణానికి చెందిన కావ్యపై ప్రేమోన్మాది దాడి చేయడం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తీవ్రంగా ఖండిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రిలో కావ్యను పరామర్శించారు. యువతిని ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురి చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ మధ్యకాలంలో ప్రేమోన్మాది దాడులు మరింత పెరిగిపోతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అమ్మాయిలకు రక్షణ కల్పించి రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కావ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ–2020) రద్దుకు ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాలు, 16 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నూతన జాతీయ విద్యావిధానం ఒక లోపాల పుట్ట అని, కొత్త విధానాల పేరుతో పాత సంస్కృతికి స్వస్తి పలుకుతున్నారని, విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని, విద్య పూర్తిగా ప్రయివేట్‌వారి చేతుల్లోకి వెళ్తుందని, తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు విద్యాసంస్థలు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నునవత్ శ్రీనివాస్‌నాయక్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, శ్రీకాంత్, అడపా సాయికృష్ణ, బొల్లి సాయి, వినయ్‌రెడ్డి, రాహుల్ నాని, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



సిమెంట్ పైపుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్‌రూరల్: నల్లగుంటపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్న పనులు వివాదాస్పదమవుతున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఐదు నెలల క్రితం రక్షిత తాగునీటి బావికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే పొలాల నడుమ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌పై తీసుకొచ్చేందుకు గ్రామస్తులు పడరాని పాట్లు పడ్డారు. భారీ వర్షాలతో పొలాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు గ్రామ శివారులో గద్దె నిర్మించగా.. స్థానికులు కూల్చేశారు. అనంతరం సిమెంట్ పైపుపై తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పోచమ్మ గుడి దారిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోట గద్దె నిర్మించి ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మూడు రోజుల నుంచి శ్మశానవాటికకు స్థానికులకు సమాచారమివ్వకుండానే అధికారులు కొత్త విద్యుత్ లైన్ వేయడం వివాదాస్పదంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు స్థానికులను సంప్రదించకుండానే ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని దుర్శేడ్ సింగిల్ విండో డైరెక్టర్ వేల్పుల రమేశ్ ఆరోపించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు పట్టుకున్న ఇసుక లారీ



కిష్టంపేట ఇసుక క్వారీ వేబిల్లు

కరీంనగర్‌రూరల్: చేగుర్తిలో శుక్రవారం గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఇసుక క్వారీని రద్దు చేయాలంటూ లారీల ఎదుట బైఠాయించి డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను తరలించేందుకు టీఎస్ ఎండీసీ ఆధ్వర్యంలో చేగుర్తి శివారులో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. లారీల రాకపోకలతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని, భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, ఇసుక క్వారీని రద్దు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి గత నెలలో వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొన్ని రోజుల పాటు ఇసుక రవాణాను నిలిపేసిన నిర్వాహకులు.. ఇటీవల మళ్లీ లారీలకు పర్మిట్లు జారీ చేస్తున్నారు. శుక్రవారం గ్రామస్తులు లారీలను అడ్డుకొని ఆందోళన చేపట్టడంతో.. ఆర్ఐ కె.వాస్తవిక్ వచ్చి విచారణ చేపట్టారు. ఎలాంటి అనుమతులు, వేబిల్లు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు గాలిపల్లి రవీందర్, సంపత్ తదితరులు ఆర్ఐకి తెలిపారు. అక్కడే ఉన్న ఓ లారీ డ్రైవర్ దగ్గర ఉన్న వేబిల్లును ఆర్ఐ పరిశీలించగా.. పెద్దపల్లి జిల్లా కిష్టంపేటలోని క్వారీగా గుర్తించారు. అనంతరం లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

జాతీయ యువజనోత్సవాలకు 'అక్షయ' విద్యార్థిని



కొత్తపల్లి(కరీంనగర్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజనోత్సవాలకు కరీంనగర్‌లోని అక్షయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని సీహెచ్ ఉషశ్రీ ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల వర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన వివిధ అంశాల్లో ఉషశ్రీ అద్భుతంగా రాణించి వర్సిటీ తరఫున జాతీయ యువజనోత్సవాల్లో ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైనట్లు చెప్పారు. శుక్రవారం బొకేతో సత్కరించి అభినందించారు. ప్రిన్సిపాల్ జి.శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సునీల్, సిబ్బంది

సైబర్ అవగాహన సదస్సు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ప్రభుత్వ ఐటీఐ జూనియర్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో యువత పార్ట్ టైం జాబ్ పేరుతో డబ్బులు పోగొట్టుకుంటున్న విధానం, తెలియని వ్యక్తులతో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ లాంటి సోషల్ మీడియా సాధనల ద్వారా డబ్బులు లాక్కుంటున్న విధానం, తల్లిదండ్రులకు తెలియకుండా వారి ఫోన్ల నుంచి డబ్బులను గుర్తుతెలియని వ్యక్తులకు పంపించి మోసపోతున్న విధానం మొదలగు విషయాలపై విద్యార్థులు, కళాశాల యాజమాన్యానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ సునీల్, సిబ్బంది వసీం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ టాప్

- పదో స్థానంలో తెలంగాణ
- రాజ్యసభ స్థాయీ సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'ఆయుష్మాన్ భారత్'లో భాగంగా పేదల ఆరోగ్యానికి చేస్తున్న ఖర్చులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్‌లో ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక కూడా విడుదల చేసింది. 2022–23లో ఏపీ ప్రభుత్వం రూ.3,338 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొంది. రూ.2,623 కోట్లతో గుజరాత్ రెండోస్థానంలో, రూ.1,932 కోట్లతో మధ్యప్రదేశ్ మూడోస్థానంలో, రూ.1,724 కోట్లు ఖర్చు చేసి రాజస్తాన్ నాలుగోస్థానంలో ఉంది. రూ.1,155 కోట్లతో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఏటా ఏపీలో ఆయుష్మాన్‌భారత్ పథకం కింద చేస్తున్న ఖర్చు పెరుగుతోంది. 2018–19లో రూ.415.94 కోట్లు, 2019–20లో రూ.1,409 కోట్లు, 2020–21లో రూ. 1,908 కోట్లు, 2021–22లో రూ.2,715 కోట్లు ఖర్చు చేసినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఏపీలో 2022–23లో 15.42 లక్షలమంది లబ్ధిదారులుగా ఉన్నారు. లబ్ధిదారులపరంగా ఏపీ దేశంలో మూడోస్థానంలో ఉంది. 23.13 లక్షలతో కర్ణాటక మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న రాజస్తాన్‌లో 16.40 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తెలంగాణ 5.59 లక్షల మందితో 10వ స్థానంలో ఉంది.

ఏ ఆరోగ్యబీమా లేనివారు 30 శాతం

దేశంలో ఏ ఆరోగ్యబీమా అందనివారు 30 శాతం ఉన్నారు. వారంతా మధ్యతరగతి ప్రజలేనని రాజ్యసభ ఆరోగ్యస్థాయీ సంఘం నివేదిక తెలిపింది. 51 శాతం మంది ప్రభుత్వ పథకాలతో నేరుగా ఆరోగ్య బీమా అందుకుంటున్నారు. 10 శాతం మంది సామాజిక ఆరోగ్య బీమా పథకాలు అంటే ప్రభుత్వ ఉద్యోగులు, ఈఎస్‌ఐ ద్వారా లబ్ధిపొందే కార్మికులు ఉన్నారు. 9 శాతం మంది ప్రైవేట్ ఆరోగ్య బీమా పథకాల్లో ఉన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను ఒక్కటిండు మినహా అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. ఇప్పటికే 23 రాష్ట్రాల్లో ఏదో ఒక స్థానిక ఆరోగ్య పథకాలున్నాయి. వాటిని ఆయుష్మాన్ భారత్‌తో కలిపి చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద అయ్యే ఖర్చులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం 14 శాతం

దేశంలో ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం ఏటా 14 శాతం. ఇది ప్రపంచంలోనే ఎక్కువ. ప్రభుత్వం ఆరోగ్యంపై పెట్టే ఖర్చు జీడీపీలో రెండు శాతమే. ఇది ప్రపంచంలోనే అత్యల్పం. ప్రపంచసగటు 10 శాతంగా ఉంది. అందరికీ ఆరోగ్యబీమా అందజేయాలంటే ప్రభుత్వ కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ బీమా పథకాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల భాగస్వామ్యం పెంచాలి. ఇది జరగాలంటే కవరయ్యే వ్యాధుల సంఖ్య పెంచి ప్యాకేజీ రేట్లు కూడా ఎప్పటికప్పుడు సవరించాలి. అప్పుడు పేద రోగులకు ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ కిరణ్ మాదల,
ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

నారా దారి.. అడ్డదారి

ఊతకర్రల సాయంతో చంద్రబాబు దింపుడుకళ్లెం ఆశలు

ఎన్నికల వేళ జగన్‌ను ఎదుర్కోవటానికి కుట్రలు కొత్త పుంతలు

- అన్ని పార్టీలూ తన అవసరాల కోసమే మోహరింపు.. కాంగ్రెస్, బీజేపీని తన మనుషుల ద్వారా నడిపిస్తున్న వైనం
- అవసరమైనప్పుడల్లా పార్టీలకు ఇం'ధనం'.. ప్రత్యేక విమానాల సేవలు
- శిష్యుడు రేవంత్ సహా తెలంగాణ నేతల అందరినీ కాంగ్రెస్ గూటికి చేర్చిన బాబు
- ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక సీఎం పీఠంపై కూర్చోవడానికీ సహకారం..

నిజం చెప్పడు... నేరుగా పోరాడడు.. అవకాశవాదమే కాదు అలవోకగా అబద్ధాలాడేసే నైజం. ఇచ్చిన మాటంటే లెక్కే ఉండదు. ఏరు దాటాక తెప్పని బూడిద చేసి నీట్లో కలిపేసే రకం. అధికారం కోసం దేనికైనా రెడీ. శత్రువుల కాళ్లు పట్టుకోవటానికైనా... మిత్రుల కాళ్లు నరికేయడానికైనా...!! ఎంతసేపూ... తనకు ఎవరు, ఎలా ఉపయోగపడతారనే యావే. బహుశా! ఆధునిక రాజకీయాల్లో నారా చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడెవరినీ చూడలేం. పురాణాల్లోనూ ఇలాంటి పాత్ర కనిపించదు. ఎందుకంటే వాటిలోని పాత్రల లక్షణం ఒక్కటీ ఈయనలో ఉండదు. ఈయనకున్న అవ లక్షణాలు పురాణాల్లోని ఏ ప్రతినాయకుడికీ ఉండవు. కానీ చంద్రబాబులోని ఈ అవలక్షణాలన్నిటికీ విజన్... చాణక్యం... వ్యూహ చాతుర్యం.. దార్శనికత.. అనే అందమైన ముసుగులేసి ఆయనో ఘనమైన నాయకుడని నమ్మించింది ఓ వర్గం మీడియా. బాబు మినహా అధికారంలో ఎవరున్నా... ఈ రాష్ట్రం నాశనమైపోతోంది.. దివాలా తీసేసింది... అంటూ విష్రచారం చేస్తుందీ మీడియా. వీళ్ల దృష్టిలో బాబు ఏం చేసినా... అది రాష్ట్ర ప్రయోజనాల కోసమే. ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా... ప్రజాస్వామ్యం కోసమే!!. ఔరా.. ఇంత దౌర్భాగ్యమా??

ఇలా నిలువెల్లా దుర్మార్గాన్ని, విషాన్ని నింపేసుకున్న 63 కిలోల.. 73 ఏళ్ల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవటానికి కుతంత్రాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రజాబలం లేక ఓటమి తరుముకొస్తుండటంతో వాటిని పతాక స్థాయికి చేరుస్తున్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన సీఎం జగన్‌ను తను, తన పార్టీ ఏమీ చేయలేమని తెలుసు గనక జనసేన, సీపీఐ, సీపీఎం లాంటి పార్టీలన్నిటినీ కూడగడుతున్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ కూడా... తనకు అనుకూలంగానే పనిచేసేలా వాటిలోని తన మనుషుల ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. 2019లో చంద్రబాబు ఓడిపోగానే ఆయన ఆదేశాల మేరకు బీజేపీలోకి ఫిరాయించిన సి.ఎం.రమేశ్, సుజనా చౌదరి ఇప్పటిదాకా బాబు–బీజేపీలను కలపటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. సి.ఎం.రమేశ్ ఓవైపు ఆ పని చేస్తూనే మరోవైపు బీటెక్ రవిని రంగంలోకి దింపడంతోపాటు వైఎస్ షర్మిలకు ప్రత్యేక విమానాలు సమకూర్చి సేవలందిస్తున్నారు. చంద్రబాబు కాంగ్రెస్‌లోకి పంపిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావటంతో టీడీపీ–కాంగ్రెస్ సంబంధాలు మరింత బలపడ్డాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ ద్వారా వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించిన నాటి నుంచి హస్తంతో చంద్రబాబు అక్రమ బంధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ వ్యూహకర్తగా తన సామాజిక వర్గానికే చెందిన సునీల్‌ను నియమించి తెరచాటున పనులు చక్కబెడుతున్నారు. చంద్రబాబు ఎవరెవరిని ఎలా వాడుకుంటున్నారో ఒక్కసారి చూద్దాం...

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటం, గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం గోచరిస్తుండటంతో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంపై దింపుడు కళ్లం ఆశలతో అరాచకత్వానికి పాల్పడుతున్నారు. గత ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో విడిగా పోటీ చేయించిన చంద్రబాబు ఇప్పుడు అధికారం కోసం అర్రులు చాస్తూ జనసేనతో జత కలిశారు. తెలంగాణలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ఆపార్టీకి ఇం'ధనం'సమకూర్చిన చంద్రబాబు ఆ ఎన్నికల్లో ఓడిపోయాక అక్కడ టీడీపీ నేతలందరినీ 'హస్త'గతం చేశారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తనకు అత్యంత సన్నిహితులైన రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, సుజనా చౌదరి లాంటి వారిని బీజేపీలోకి పంపి అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రమేష్ ద్వారా ప్రత్యేక విమానాలను సమకూరుస్తూ కుట్రలకు పదును పెట్టారు. తన శిష్యుడైన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపి నోట్ల కట్టలు వెదజల్లి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టేలా చేసిన చంద్రబాబు ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక మరోసారి ఇం'ధనం'సమకూర్చి సీఎం పీఠంపై కూర్చోవడానికి సహకరించారు. కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా పని చేస్తున్న సునీల్ కనుగోలు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. చంద్రబాబు చెప్పినట్లు ఆడేందుకు, బాబు ప్లాన్‌ను అమలు చేసేందుకు ఆయన సదా సిద్ధంగా ఉంటారు.



పరాకాష్టకు కుట్రలు, కుతంత్రాలు..

సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ రోజుకు రోజుకు పెరుగుతోందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో ఆపార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ లాంటి జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు పూర్తిగా కోల్పోవడంతో టీడీపీ ఉనికి కూడా చాటుకోలేదని ఆ సర్వేలు తేల్చి చెప్పాయి. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన చంద్రబాబు అడ్డదారి పట్టారు. అనాదిగా మైనార్టీలు కాంగ్రెస్ వెనుకే ఉంటారన్న ఓ పాచిపోయిన భావనను తనకు అనుకూలంగా మార్చుకోవాలన్నది ఆయన ఎత్తుగడ. వైఎస్సార్‌సీపీలో టిక్కెట్ దక్కని వారికి తన శక్తుల ద్వారా కాంగ్రెస్ టికెట్లు ఇప్పించి ఇం'ధనం'సమకూర్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బాబు ప్లాన్. ఒకవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను చీల్చడం.. మరోవైపు బీజేపీ వ్యతిరేక ఓటు వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయడం దీని వెనుకున్న మరో ఎత్తుగడ. ఇలా ఓవైపు కాంగ్రెస్‌ను తానే నడుపుతూ స్వార్థానికి వాడుకోవడమే కాకుండా.. ఇంకోవైపు బీజేపీని కూడా తన వైపు తిప్పుకుని అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్న తన మనుషులు, తాను సృష్టించిన పాత్రల ద్వారా ఈ ఎత్తుగడలను అమలు చేసే ప్రణాళిక వేశారు.

శిథిలమైన కాంగ్రెస్‌తో శూన్యమే..

2014లో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించింది. విభజనతో పూడ్చలేని నష్టాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మిగిల్చింది. తరతరాలపాటు రాష్ట్ర ప్రజానీకాన్ని కోలుకోనివ్వకుండా దెబ్బ తీసింది. ఏపీకి తీరని అన్యాయం చేసింది కాబట్టే కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు అధఃపాతాళానికి తొక్కేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు లభించగా నోటాకు 1.28 శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శిథిలమైన కాంగ్రెస్ నుంచి చంద్రబాబు ఆశించే ప్రయోజనం ఒనగూరే అవకాశమే లేదని రాజకీయ పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. హఠాన్మరణం తర్వాత కూడా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన పార్టీకి ఏపీలో ఎవరు నేతృత్వం వహించినా ప్రజలు మద్దతు ఇవ్వరని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

గోదావరి చెంతన తెలుగు సభల నిర్వహణ భేష్

ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

- ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- తొలి రోజు మూడు వేదికలపై సందడి చేసిన కవులు, కళాకారులు



జ్యోతి ప్రజ్వలనం చేసి సభలను ప్రారంభిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి చెంతన సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఇక్కడి గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజరాజనరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, ఆదికవి నన్నయ భారతాన్ని ఆంధ్రీకరించి వెయ్యేళ్లయిన సందర్భంగా ఈ సభలు నిర్వహిస్తున్నారు. రాజరాజ నరేంద్రుడు, నన్నయ భట్టారక, నారాయణభట్టు వేదికలపై నిర్వహిస్తున్న ఉత్సవాలను గవర్నర్ విశ్వభూషణ్, విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. గవర్నర్ విశ్వభూషణ్ మాట్లాడుతూ.. సంస్కృతి, రచనలకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం విరాజిల్లుతోందన్నారు. అలాంటి గడ్డపై తెలుగు మహాసభలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. కావ్యాలు, పురాణేతిహాసాలను తెలుగు వాళ్లు అనువదించినట్టు ఎవరూ చేయలేదన్నారు. తెలుగులో ఎన్నో యాసలు, ప్రాసలు, ఉపభాషలు ఉన్నాయన్నారు. పోతన భాగవతం, అన్నమయ్య కీర్తనల్లోని పదాలు చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఆర్‌ఎస్ఎస్ జాతీయ కార్యకారి వారణాసి రామ్‌మాధవ్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి అందెశ్రీ, జేఎన్‌టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ పాల్గొన్నారు.

ఇదేమి వాదన?

- వివేకా హత్య కేసులో సీబీఐపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సీబీఐ న్యాయవాదిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాచారం లేకుండా 'ఐ థింక్ సో'అంటూ వాదనలు వినిపించడం సరికాదని చెప్పింది. వాదనలకు వచ్చే ముందే అధికారులు, ఇతర న్యాయవాదుల నుంచి సమాచారం తీసుకుని రావాలని వ్యాఖ్యానించింది. వైఎస్ వివేకా హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ గత నెల శివశంకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యతో శివశంకర్‌రెడ్డికి సంబంధంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేసిందన్నారు. సీబీఐ చెప్పినట్లు దస్తగిరి(ఏ–4) వాంగ్మూలం ఇచ్చాడని.. అందుకే అతని బెయిల్‌కు దర్యాప్తు సంస్థ పూర్తిగా సహకరించిందని తెలిపారు. అనంతరం సీబీఐ తరఫున న్యాయవాది అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. తీర్పు కాపీ ఉందా అని ప్రశ్నించారు. కనీసం ఎస్ఎల్‌పీ (పిటిషన్) నంబర్ అన్నా చెప్పండి అని అడగగా.. సీబీఐ న్యాయవాది నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు.

విచారణ పక్కదారి..?

- వేధింపులు తాళలేక బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం
- ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నా చర్యలు శూన్యం!
- సంబంధం లేని విషయాలపై కమిటీ సభ్యుల ప్రశ్నలు
- చివరికి పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. విచారణ కమిటీ సభ్యులు సంబంధం విషయాలపై ప్రశ్నలు వేయడం అనుమానాలకు తావిస్తోంది. గత ఏడాది డిసెంబర్ 9న కోటపల్లి రేంజ్ పరిధిలోని యెంచపెల్లి బీట్ ఆఫీసర్ జీ.లత ఆత్మహత్యాయత్నం చేసింది. ఇందుకు తన పై అధికారి ఎఫ్ఆర్‌ఓ రవి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, క్లర్క్ ఖరీమ్ వేధింపులు కారణమని ఆరోపించింది. గత డిసెంబర్ 11న నిర్వహించిన గ్రీవెన్స్‌లో మహిళా బీట్ ఆఫీసర్లు జిల్లా అటవీ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను విన్నవించారు. అటవీశాఖలో చర్చనీయాంశంగా మారగా.. బాధితురాలు ఫిర్యాదు చేయలేదని మొదట అధికారులు కొట్టిపడేశారు. బాధితురాలు ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ అయిన తర్వాత డిసెంబర్ 18న రాతపూర్వకంగా డీఎఫ్ఓ శివ్ ఆశిష్‌సింగ్, సీఎఫ్ఓ శాంతారాంలకు ఫిర్యాదు చేసింది. అటవీశాఖ ఉద్యోగుల మహిళా ఫిర్యాదుల పరిష్కార కమిటీ(ఉమెన్స్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సెల్) విచారణకు ఆదేశించారు. డిసెంబర్ 30న విచారణ కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి అధ్యక్షతన ఇరువర్గాల వారిని విచారించారు. వారం రోజులు కావొస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఘటనకు సంబంధం లేని విషయాలపై విచారణ జరిగినట్లు సమాచారం. సంఘటనను తప్పుదోవ పట్టించే విధంగా వ్యక్తిగత విషయాలు ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ విచారణ బాధితురాలిని మానసికంగా కుంగదీసిందనే ఆరోపణలున్నాయి. నెల రోజులు కావొస్తున్నా న్యాయం జరగకపోవడంతో బాధితురాలు రెండోసారి కోటపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో రవిని పిలిపించి పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా.. ఫిర్యాదు వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని తెలిపారు. కాగా, మహిళా అధికారి ఆత్మహత్యాయత్నం ఘటనపై జిల్లా అటవీశాఖ అధికారులు మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఘటనపై డీఎఫ్ఓ శివ్ ఆశిష్‌సింగ్‌ను సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్పడం గమనార్హం.

ఏడేళ్లుగా అక్కడే..

ఎఫ్ఆర్‌వో రవి కోటపల్లి రేంజ్‌లో ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక అధికారి మూడేళ్ల కాల పరిమితితో పని చేయాలి. ఆ తర్వాత మరోచోటికి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఏడేళ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తించడం, కోటపల్లికి 50కిలోమీటర్ల దూరంలోని మంచిర్యాల నుంచి రాకపోకలు సాగించడం గమనార్హం.

విచారణ పూర్తి కాలేదు..

లత ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ పూర్తి కాలేదు. మరికొందరికి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరిపి అధికారులకు నివేదిక అందజేస్తాం.

– కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి

కట్టడికి త్రిముఖ వ్యూహం



సమావేశమైన పోలీసు అధికారులు(ఫైల్)



హాజరైన కేంద్ర పోలీసు బలగాలు(ఫైల్)

- మావోయిస్టుల కదలికలపై నిఘా
- ఉమ్మడిగా సమాచార సేకరణ
- సమన్వయంతో ప్రణాళికల అమలు
- రామగుండం కమిషనరేట్ కేంద్రంగా ఆపరేషన్
- ఇటీవల సమావేశమైన మూడు రాష్ట్రాల పోలీస్ బాస్‌లు

గోదావరిఖని: మావోయిస్టుల కట్టడికి పోలీస్‌శాఖ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందు కోసం మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ బాస్‌లు సమాచార సేకరణ, సమన్వయం చేసుకోవడం, పక్కాగా అమలు చేయడంలో నిమగ్నమైయ్యారు. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసు అధికారులు సమష్టి నిర్ణయం తీసుకున్నారు.

'అసెంబ్లీ' ఫార్ములా అమలు..

- రాష్ట్రంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.
- మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న గ్రామాల్లోనూ ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.
- త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో కేంద్ర ఎన్నికల సంఘం ఉండటంతో పోలీసు యంత్రాంగం అందుకు అనుగుణంగా అప్రమత్తమైంది.
- ఈక్రమంలో మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు ఉన్న రామగుండం పోలీస్ కమిషనరేట్ కీలకంగా మారింది.
- ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే ముఖ్య నేతలకు మావోయిస్టుల ముప్పు లేకుండా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నారు.
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు అధికారులు మావోయిస్టుల సమాచారం ఇచ్చి పుచ్చుకునేందుకు రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఇటీవల కీలక సమావేశం జరిగింది.
- మూడు రాష్ట్రాల పోలీసు ముఖ్య అధికారులు హాజరయ్యారు.
- ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- ప్రచారానికి వచ్చే ముఖ్య నాయకులు, ఓటర్లు భయపడకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవడం కోసం ప్రణాళిక రచించారు.

'పార్లమెంట్'కు కసరత్తు

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. గోదావరి నదీ తీరం వెంట విస్తరించి ఉన్న అడవులు, ఆయా రాష్ట్రాల పోలీసుస్టేషన్లు తదితర ప్రాంతాలపై ఉమ్మడిగా దృష్టి సారించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా మావోయిస్టుల సమాచారం, వారి ఉనికిని ఎప్పటికప్పుడు పంచుకోవాలని నిర్ణయించారు. ఈమేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కీలక సమావేశం నిర్వహించి రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. ఈక్రమంలో ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులు హెలిక్యాప్టర్ ద్వారా ఇటీవల కమిషనరేట్‌కు చేరుకుని విస్తృతంగా చర్చించారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి

- రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వెళ్లే నాయకులు స్వేచ్ఛగా పర్యటించేందుకు చేపట్టబోయే చర్యలపై పోలీసు యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసింది.
- సాధారణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, స్టాటిటిక్స్ బందోబస్తు, రూట్ బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించే పోలీసులు, ఎస్ఎస్‌టీ టీంల డ్యూటీలు, ఎల్‌డబ్ల్యూ ఏరియాలో ఏరియా డామినేషన్, కార్డెన్ అండ్ సెర్చ్, కీలకమైన పాయింట్ల వద్ద సెంట్రల్ ఫోర్స్ తీరుపై సమీక్షించారు.
- అలాగే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాపై ఫోకస్ పెట్టారు.

ఉట్నూర్ సీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు

- 90శాతం మార్కులతో రాష్ట్రంలోనే మొదటి స్థానం



వైద్యులు, సిబ్బందితో సూపరింటెండెంట్ ఉపేందర్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. వైద్యసేవలు, నిర్వహణ, నాణ్యత ప్రమాణాలు తదితర విషయాల్లో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు లభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ తెలిపారు. తొమ్మిది విభాగాల్లో 90 శాతం సగటు మార్కులతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ గుర్తింపు ద్వారా ఆసుపత్రి అభివృద్ధి కోసం ఏటా రూ. 27 లక్షల చొప్పున మూడేళ్ల పాటు ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయి. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ చంగ్‌సన్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

కేక్ కట్ చేసి సంబరాలు..

సీహెచ్‌సీకి ప్రత్యేక గుర్తింపు దక్కిన నేపథ్యంలో ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఎన్‌క్వాస్ నోడల్ అధికారి కపిల్ జాదవ్ ప్రత్యేక చొరవ, అందరి సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యపడిందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహేందర్, కపిల్, అరవింద్, రవి, రత్నమాల, పూజిత, స్వరూప, నిఖిష, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

మందమర్రిరూరల్: అయోధ్యకు సైకిల్‌పై వెళ్తున్న మద్ది లక్ష్మయ్యకు మంచిర్యాల జిల్లా మందమర్రిలో శుక్రవారం స్థానికులు స్వాగతం పలికారు. భువనగిరి నుంచి ఐదు రోజుల క్రితం అయోధ్య రామ మందిరం వద్దకు సైకిల్‌యాత్రగా బయల్దేరినట్లు లక్ష్మయ్య తెలిపాడు. అయోధ్యకు చేరుకోవడానికి మరో 45 రోజులు పడుతుందని పేర్కొన్నాడు. మల్లేష్, రాజ్‌కుమార్, వాసు, సందీప్ తదితరులు స్వాగతం పలికి పండ్లు, పానీయాలు అందజేశారు.



లక్ష్మయ్యకు స్థానికుల స్వాగతం

ధనలక్ష్మీ అవతారం



చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఏర్పాటు చేసి వాసవిమాతను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ. 33,33,333 కరెన్సీతో ధనలక్ష్మీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో రూ.10, 20, 50, 100, 200, 500 కరెన్సీ నోట్లు వినియోగించి అమ్మవారిని అలంకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే ప్రక్రియ ప్రారంభిస్తాం

- చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే ప్రక్రియ మొదలు పెడతాం
- హామీలు మరిచినందుకే కేసీఆర్‌ను ఓడించారు
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలోని ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిపించేందుకు ప్రక్రియ ప్రారంభిస్తామని, తొందరలోనే ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రెండు పర్యాయాలు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడంతోనే ప్రజలు తిరస్కరించారని జీవన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడెకరాలు ఇస్తానని అనేక హామీలిచ్చి మరిచారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు గడుస్తున్నా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తుందనే నమ్మకంతోనే రాష్ట్రప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. హామీల అమలు చేసేందుకే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం తమ హయాంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఛీటింగ్‌కు కేరాఫ్ అడ్రస్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఖైదీల రూటు జ్యూట్ వైపు

చైతాలి దాస్ సాధించిన విజయం

కలకత్తా వాసి చైతాలి దాస్ వయసు 50 ఏళ్లు. గోల్డెన్ ఫైబర్‌గా పిలిచే జ్యూట్ పరిశ్రమను స్థాపించడంలోనే కాదు అందుకు తగిన కృషి చేసి గోల్డెన్ ఉమన్‌గా పేరొందింది చైతాలి. ముఖ్యంగా ఖైదీలతో కలిసి జనపనార ఉత్పత్తులను తయారు చేస్తూ, వ్యాపారిగా ఎదిగి ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది. 'జనపనారను పర్యావరణ అనుకూలమైన, విస్తృతంగా అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయంగా చెప్పుకోవచ్చు. ఇది మన సాంస్కృతిక గొప్పతనాన్నీ పెంచుతుంది. నా ఫౌండేషన్ ద్వారా ఖైదీలను ఆదుకోవాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను' అని వివరించే చైతాలి ఆలోచనలు మన దృష్టి కోణాన్ని కూడా మార్చుతుంది. చైతాలి మొదలు పెట్టిన ప్రయాణం ఆమె మాటల్లోనే...



"నేను పుట్టి పెరిగింది పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్. మా ఇల్లు సెంట్రల్ జైలు, ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్ మధ్య ఉండేది. ఎందుకో తెలియదు కానీ ఆ జైలు జీవితం గడుపుతున్నవారి గురించి తెగ ఆలోచించేదాన్ని. మా నాన్న లాయర్ కావడం కూడా అందుకు మరో కారణం. నాన్నతో కలిసి ఆయన ఆఫీసుకు, పోలీస్ స్టేషన్‌కు, సెంట్రల్ జైలుకు వెళ్లడం వల్ల నాలో అక్కడి వాతావరణం ఒక ఉత్సుకతను రేకెత్తించేది. జైలు గోడల లోపలి జీవితం ఆశ్చర్యపోయేలా చేసేది. కటకటాల వెనుక ఉన్న జీవితాలను, అక్కడ వాళ్లు ఎలా ఉంటారో చూపించే సినిమాలను చూడటం స్టార్ట్ చేశాను. రాత్రిళ్లు నిద్రపోయాక మా ఇంటికి సమీపంలో ఉన్న జూ నుంచి పులుల గర్జనలు వినిపించేవి. అర్ధరాత్రి సమయాల్లో పోలీసుల విచారణ, ప్రజల అరుపులు, కేకలు వినిపిస్తుండేవి. ఆ శబ్దాలు నాలో భయాన్ని కాకుండా దృష్టికోణాన్ని మార్చాయి.



శాశ్వత ముద్ర

నా చిన్నతంలో కొన్నిసార్లు మా నాన్న గారు కోర్టుకు తీసుకెళ్లారు. మొదటిసారి వెళ్లినప్పుడు నిందితులను కోర్టు హాలుకు తీసుకురావడం, పోలీసు వ్యాన్‌లో నుంచి వ్యక్తులు దిగడం గమనించాను. నా ఉత్సుకత తారస్థాయికి చేరుకుంది. మా నాన్న సహోద్యోగులలో ఒకరిని 'ఎవరు వాళ్లు' అని అడిగాను. తప్పు చేసినవారిగా ముద్రపడి, పర్యవసనాలను ఎదుర్కొనేవారు అని చెప్పారు. నేను అక్కడే నిలబడి గమనిస్తూ ఉన్నాను. వారి కుటుంబ సభ్యులు వారి వైపు పరిగెత్తుకుంటూ రావడం, ఆ వెంటనే వారి మధ్య ఉద్వేగభరితమైన సంభాషణలు విన్నాను. వారి బాధలు చూస్తుంటే ఏదైనా సాయం చేయాలనిపించేది.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి..

కాలక్రమంలో చదువుతోపాటు ఇతరులకు సాయం చేసే మార్గం కోసం చాలా అన్వేషించాను. అందులో భాగంగా వివిధ ఎన్జీవోలతో కలిసి పనిచేశాను. 2015లో చైతాలి రక్షక్ ఫౌండేషన్‌కు పునాది పడింది. ఈ ఫౌండేషన్ మగ, ఆడ ఖైదీలు, ఇతర నిరుపేద మహిళలకు సాధికారత కల్పించడంపై దృష్టి పెడుతుంది. మొదటిసారి కరెక్షనల్ హోమ్‌లో నా పనిని ప్రారంభించాను. మొదట్లో స్పోకెన్ ఇంగ్లిషుపై దృష్టి పెట్టాను. మహిళలు, ఖైదీలతో కుకీలను తయారు చేయించడం, యోగాను పరిచయం చేయడం, చెక్కపనిలో పాల్గొనడం, పెయింటింగ్ సెషన్‌లు నిర్వహించడం వంటి అనేక ప్రాజెక్ట్‌లు చేపట్టాను. ఆ ప్రాజెక్ట్‌లు విభిన్న కార్యక్రమాలను ప్రతిబింబించేవి.

అంతర్జాతీయంగా...

బెంగాల్ జనపనార పరిశ్రమలో సుమారు 40 లక్షల మంది ఉన్నారు. నేను, ఖైదీలతో జనపనార ఉత్పత్తులను రూపొందించడంలో నిమగ్నమై ఉన్నాను. వివిధ ప్రదేశాలలో వారి సృజనాత్మక ఉత్పత్తులను ప్రదర్శనకు పెడుతుండేదాన్ని. ఆ తర్వాత వివిధ ఈ-ప్లాట్‌ఫార్మ్స్, జాతీయ- అంతర్జాతీయ వేదికలపైకి కూడా వారి జనపనార ఉత్పత్తులను తీసుకెళ్లాను. ఖైదీలకు శిక్షణ ఇవ్వడానికి నేషనల్ జ్యూట్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎన్‌జెబి)తో కనెక్ట్ అయ్యాను. శిక్షణ ద్వారా ఉత్పత్తులు కూడా పెరిగాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా జ్యూట్ ఉత్పత్తుల తయారీలో దాదాపు మూడు వేల మంది ఖైదీలకు శిక్షణ ఇచ్చాం. దీంతో ఈ ప్రాజెక్ట్ 'రూట్ టు జ్యూట్'గా రూపుదిద్దుకుంది. ముఖ్యంగా దీనిని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇంక్యుబేట్ చేసింది. మా స్టార్టప్ హస్తకళలు, రగ్గులు, హ్యాండ్‌బ్యాగులు వంటి జనపనార ఉత్పత్తులను తయారు చేస్తుంది. 2021 జనవరి 7న రూపొందించిన అతిపెద్ద జ్యూట్ బ్యాగ్ గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది.

యువత కోసం..

ప్రత్యేకంగా విభిన్నరకాల ఉత్పత్తులను అందిస్తున్నాం. ఫ్యాషన్‌లో భాగంగా యువతకు చూపుతున్నాం. యూనివర్శిటీ లేదా కాలేజ్ నుండి బయటికి వచ్చే విద్యార్థులు జ్యూట్ బ్యాగ్‌లను ధరించి వెళుతుండగా చిత్రీకరించి ప్రదర్శిస్తుంటాం. ఇది వారిలో ఆసక్తిని పెంచుతుంది. తప్పు చేసిన వారిని ప్రజలు నేరస్తులుగా చూస్తారు. అయినప్పటికీ ఈ వ్యక్తులు ఉత్పత్తులను రూపొందించడంలో నిమగ్నమైనప్పుడు వారి అవగాహనలో మార్పు కలుగుతుంది. జనం కూడా వారిని అభినందించడం ప్రారంభిస్తారు. ఇలా క్రమంగా అందరిలోనూ అంగీకారం పెరుగుతుంది. తప్పు చేసినవారు లేదా దోషులుగా ముద్రపడిన వ్యక్తులు కూడా మార్పు చెందగలరు' అని తన కృషి ద్వారా చూపుతోంది చైతాలి.



అది హైదరాబాద్, దారుల్‌షిఫా, మలక్‌పేట్, నూర్‌ఖాన్ బజార్‌లోని బాల్‌షెట్టీ ఖేత్ గ్రౌండ్. పది నుంచి పదిహేనేళ్ల వయసు బాలికలు ఆనందంగా కేరింతలు కొడుతున్నారు. వారి మధ్యలో ఓ అరవై ఏళ్ల మహిళ. ఆ మహిళకు హైఫైవ్ ఇస్తూ, ఫిస్ట్ పంచ్‌లతో ఆడుకుంటున్నారు. ఆ బాలికలు సంతోషంగా రెక్కలు విచ్చుకోవడానికి కారణం ఆ మహిళ. ఆమె పేరు రుబీనా నఫీస్ ఫాతిమా. అమ్మాయిలు గడపదాటి బయటకు రావడానికి ఆంక్షలున్న కుటుంబాల ఆడపిల్లలకు ఆకాంక్షల రెక్కలు తొడిగారామె. ఆశయాల లక్ష్యాలను వారి మెడలో హారంగా వేశారు. ఇందుకోసం సఫా అనే సంస్థను స్థాపించారు. బాలికలు తమ కలలను సాధించుకోవడానికి తగిన సాధన కోసం గ్రౌండ్‌ను వారి కోసం కేటాయించేలా చేశారు. ఇస్లాం సంప్రదాయాల గౌరవానికి విఘాతం కలగని విధంగా దుస్తులు ధరించి ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తారు. పదిహేనేళ్లుగా వ్యవస్థీకృతంగా సేవలందిస్తున్న **రుబీనా నఫీస్ ఫాతిమా** తన స్వచ్ఛంద సేవా ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

స్వావలంబనకు చుక్కాని... రుబీనా!

తాతగారి స్ఫూర్తితో...

"మా నాన్న లెఫ్టినెంట్ కల్నల్ ఖాన్. అమ్మ మిలటరీ స్కూల్‌లో టీచర్. మా కుటుంబం అభ్యుదయ భావాలతో ఎదగడానికి కారణం మా తాతగారు సులేమాన్ ఆఫ్తాబ్ అలీ (అమ్మవాళ్ల నాన్న). మహిళలు చదువుకోవాలని, ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకూడదని, అప్పుడే సమాజంలో మహిళకు గౌరవం దక్కుతుందని చెప్పేవారు. ఆయన అమ్మను అలాగే పెంచారు. ఇక పేరెంట్స్ ఉద్యోగరీత్యా దేశంలోని అనేక ప్రాంతాల్లో పెరిగాను. సెక్యులర్ వాతావరణంలో పెరగడంతోపాటు అన్ని రకాల సంస్కృతులను గౌరవించడం నేర్చుకున్నాను. ఆడపిల్ల అనే కారణంగా ఇంట్లో నాకు ఎటువంటి ఆంక్షలూ లేవు. బాడ్మింటన్ ప్లేయర్‌గా జాతీయస్థాయిలో ఆడాను కూడా. ఇరవై ఏళ్లకే స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేశాను. పెళ్లి తర్వాత భర్తతోపాటు సౌదీ అరేబియాకు వెళ్లాను. అక్కడ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం చేసిన భారతీయ మహిళను. కొంతకాలానికి ఇండియాకి వచ్చేశాం. ఇక్కడకు వచ్చిన తర్వాత సొంతంగా బిజినెస్ మొదలుపెట్టి దారుణమైన నష్టాలను చూశాను. ఆ తర్వాత నాకు బాగా తెలిసిన పర్యాటక రంగంలో శిక్షణ, ప్లేస్‌మెంట్స్ నన్ను విజేతగా నిలిపింది. నాకు సర్వీస్ మీదున్న ఆసక్తికొద్దీ కొంత సమయం మహిళల కోసం పని చేయడం మొదలుపెట్టాను. సేవలను మరింత సమగ్రంగా చేయడం కోసం సీఎస్ఐఎమ్ నుంచి సర్టిఫికేట్ కోర్సులు చేశాను. మా తాత, నాన్న గారి పేర్లు కూడా వచ్చేటట్లు నా సేవా సంస్థకు సఫా అనే పేరు ఖాయం చేసుకున్నాను. సఫా ద్వారా 2008 నుంచి ముస్లిమ్ మహిళల ఆర్థిక సామాజిక పురోగతి కోసం పని మొదలుపెట్టాను. అప్పటి నుంచి కొత్త అనుభవాలు ఎదురయ్యాయి.



ఈ గ్రౌండ్‌లో క్రీడాకారులు పుట్టారు!

సాధారణంగా మగపిల్లలను స్వేచ్ఛగా పెరగనిస్తారు. బాలికలకు కూడా ఆడుకోవాలని ఉంటుంది. వాళ్లు ఆడుకోవడానికి నేను అండగా నిలిచాను. ఒకరోజు ఓ వ్యక్తి బైక్‌తో నేరుగా గ్రౌండ్ మధ్యకు వచ్చేసి బాలికలు ఆడుకోవడాన్ని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న ఆడపిల్లల మీద మగపిల్లలు రాళ్లు రువ్వారు. జీహెచ్ఎమ్‌సీ అధికారులతో మాట్లాడి ఈ గ్రౌండ్‌ను రోజూ రెండు గంటలపాటు బాలికల కోసం రిజర్వ్ చేయించాను. ఆ సమయంలో మగవాళ్లు గ్రౌండ్‌లో అడుగుపెట్టడానికి వీల్లేకుండా అడ్డుకోగలిగాం. ఇప్పుడు రోజూ బాలికలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆడుకుంటున్నారు. ఈ గ్రౌండ్ నుంచి ఇద్దరు బాలికలు డిస్ట్రిక్ట్ లెవెల్ ఫుట్‌బాల్ ప్లేయర్‌లుగా ఎదిగారు. నగరంలో 542 గ్రౌండ్స్ ఉన్నాయి. ప్రతి గ్రౌండ్ లోనూ బాలికల కోసం రెండు గంటలు కేటాయించి ఆటలను ప్రోత్సహించాలి. క్రీడాకారులుగా ఎదుగుతారు. కనీసం సూర్యరశ్మి తగిలేలా మెలిగితే శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. 'గోల్స్ ఫర్ గాల్స్' సంస్థ బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి శిక్షణనిస్తుంది. ఆ శిక్షణ కోసం పాత బస్తీ నుంచి బాలికలు వెళ్లడం గొప్ప విజయం అనే చెప్పాలి. పేదమహిళల ఆర్థిక స్వావలంబన సాధన మాత్రమే కాదు, ఒక గొప్ప సామాజిక సంస్కరణ చేయగలిగానని గర్వంగా చెప్పగలను.

– రుబీనా నఫీస్ ఫాతిమా, సంఘ సేవకురాలు

ఇంటింటికీ వెళ్లాను!

మహిళలను చైతన్యవంతం చేయడానికి గడపగడపకూ వెళ్లాను. వాళ్ల ఇళ్లలో కూర్చుని బయట ప్రపంచం గురించి చెప్పాను. మహిళ ఎలా ఎదగవచ్చో వివరించాను. వాళ్లతో మాట్లాడిన తరవాత నాకు తెలిసినదేమిటంటే... మహిళలకు ఆలోచనలున్నాయి, ఆశయాలున్నాయి, ఆకాంక్షలున్నాయి. వాటన్నింటినీ మొగ్గలోనే తుంచి వేస్తున్న ఆంక్షలు కూడా ఉన్నాయి. పెద్దల గౌరవానికి భంగం కలిగించకుండా, మనోభావాలకు విఘాతం కలగకుండా ఎదగడం నేర్పించాను. బోలానగర్‌లో చిన్నగదిలో రెండు సెకండ్ హ్యాండ్ టైలరింగ్ మెషీన్‌లతో మొదలైన నా సర్వీస్ ఇప్పుడు స్కిల్ ట్రైనింగ్, లైవ్లీహుడ్, క్లౌడ్ కిచెన్, ధనక్‌బజార్ వంటి పదిహేను ప్రాజెక్టులకు విస్తరించింది. ఆరువందల మందికి వండగలిగిన ఇండస్ట్రియల్ కిచెన్ ఉంది. లుక్మా బ్రాండ్‌తో మా మహిళలు తయారు చేసే ఆహార ఉత్పత్తులకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది. 'ఆర్టిజానియా' పేరుతో టైలరింగ్ సెంటర్‌లు నడుస్తున్నాయి. ఉద్యోగం కోసం బయటకు వెళ్లడానికి ఇష్టపడని వాతావరణం ఇంకా ఉంది. అలాంటి కొంతమంది ఇళ్లలోనే హ్యాండీక్రాఫ్ట్స్, ఇతర వస్తువులు తయారు చేసి వారానికొకసారి మేము ఏర్పాటు చేసే ధనక్ బజార్‌లో స్టాల్ పెట్టుకుని విక్రయిస్తారు. చదువుకు నోచుకోక ఇంతవరకూ పెన్ను వాడని వాళ్లు కూడా పెన్ హోల్డర్‌లు తయారు చేస్తున్నారు. వీటన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేయడం ఒక ఎత్తయితే బాలికలను క్రీడాకారులుగా తయారు చేయడం మాత్రం కత్తిమీద సాములా మారింది.

శిక్షణనిచ్చాను... పని చూపించాను!

నేను ఎవరికీ ఏదీ ఉచితంగా ఇవ్వలేదు. పని నేర్పిస్తాను, పని చేసుకునే వెసులుబాటు కల్పిస్తాను. వాళ్లు తమ కాళ్ల మీద తాము నిలబడాలి. ఒకరు సంపాదించి, ఐదుగురు తినాలంటే ఆ ఇల్లు ఆర్థికంగా ఎదిగేది ఎప్పటికి? ఇద్దరు సంపాదిస్తుంటే... పిల్లలకు మంచి చదువు సాధ్యమవుతుంది. అందుకే మహిళల ఆర్థిక వృద్ధి మీద దృష్టి కేంద్రీకరించాను. స్వయం ఉపాధి మార్గాల కోసం జీహెచ్ఎంసీతో అనుసంధానమయ్యాం. స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుంటూ మహిళలు సాధికారత సాధిస్తున్నారు. సఫా సేవలు హైదరాబాద్ నగరంలో 48 స్లమ్ ఏరియాలకు విస్తరించాయి. మొత్తానికి పాతబస్తీలో ఒక నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకురాగలిగాను. బాలికలు చదువుకుంటున్నారు, మహిళలు సొంతంగా డబ్బు సంపాదించుకుంటున్నారు. పిల్లల, పోషణ, పెంపకం గురించి బాధ్యతగా ఉంటున్నారు. తల్లి సంపాదిస్తున్నప్పుడే పిల్లలు ఆమెను గౌరవిస్తారు అని తాతగారు చెప్పిన మాటను ఆచరణలో చూస్తున్నాను" అన్నారు రుబీనా నఫీజ్ ఫాతిమా.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **మోర్ల అనిల్ కుమార్**

పచ్చనాకు సాక్షిగా...

'వ్యవసాయం బాగుండాలంటే రసాయన ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడాలి' అనే నమ్మకం బలంగా పాతుకుపోయిన గ్రామంలో సేంద్రియ వ్యవసాయం గురించి ప్రచారం చేస్తే ఎలా ఉంటుంది? పెద్దగా స్పందన కనిపించదు. అంగిసింగి అనే ఊళ్లో కూడా అచ్చం అలాగే జరిగింది. అయితే 'కృషిమిత్ర' గీత వల్ల ఆ ఊరు మారింది. పచ్చనాకు సాక్షిగా పచ్చటి తోవలో నడుస్తోంది...

కృషిమిత్ర గీత



పెళ్లయిన తరువాత అంగిసింగి (నయాగఢ్ జిల్లా–ఒడిశా) అనే ఊళ్లోని అత్తగారింట్లోకి అడుగు పెట్టింది గీతారాణి సత్పతి. అంగిసింగి అనేది వ్యవసాయ ఆధారిత గ్రామం. అయితే రైతులు మాత్రం 'ఎన్ని రసాయన ఎరువులు వాడితే వ్యవసాయానికి అంత మంచిది' అనే ధోరణిలో ఉండేవారు. రైతులు పోటీ పడి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడడం వల్ల గ్రామంలో ఆస్తమా బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండేది. గీత పిల్లలు కూడా ఆస్తమా బారిన పడ్డారు. ఈ నేపథ్యంలోనే గీత 'కృషిమిత్ర'ల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది.

గ్రామాలలో పర్యావరణహిత వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కలిగించే స్వయం సహాయక బృందం సభ్యులను 'కృషిమిత్ర' అంటారు. తన గ్రామంలోని అస్తవ్యస్త వ్యవసాయ పద్ధతులను దృష్టిలో పెట్టుకొని శిక్షణ తరువాత గీత కూడా 'కృషిమిత్ర'గా మారింది.

'తక్కువ ఖర్చుతో పర్యావరణ హిత వ్యవసాయం చేయవచ్చు' అనే నినాదంతో రైతుల దగ్గరకు వెళ్లింది గీత. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల కలుగుతున్న నష్టాల గురించి వారికి వివరించింది.

ప్రచారంతోపాటే తాను స్వయంగా సేంద్రియ వ్యవసాయం చేయడం మొదలుపెట్టింది. రైతుల భార్యలను పొలానికి తీసుకువెళ్లి తాను ఆచరిస్తున్న పద్ధతులను పరిచయం చేసేది. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించేది. 'తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం' కాన్సెప్ట్‌తో గీత చేసిన సేంద్రియ వ్యవసాయం విజయవంతం అయింది.

ఇక అప్పటినుంచి రైతుల్లో కదలిక మొదలైంది. గీతను వెదుక్కుంటూ వచ్చి, సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకునేవారు. 'ఒకప్పుడు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే కృషిమిత్ర నేను ఒక్కరినే. నేను చేస్తున్న వ్యవసాయాన్ని గమనించిన తరువాత ఇప్పుడు చాలామంది మహిళలు కృషిమిత్రగా మారారు' అంటుంది గీత.

ఒకవైపు ఇంటిపనులు, పొలం పనులు చేసుకుంటూనే మరోవైపు రైతుల పొలాల దగ్గరికి వెళ్లి వారికి అవసరమైన సలహాలు ఇస్తుంటుంది గీత. మొబైల్ ఫోన్ ద్వారా విజువల్స్, సమాచారాన్ని చేరవేస్తుంటుంది. గీత దినచర్య వేకువ జామునే మొదలవుతుంది.

ఆగిపోయిన చదువును దూరవిద్య ద్వారా తిరిగి కొనసాగించాలని నిర్ణయించుకుంది గీత.

ఒకప్పుడు ఆమెను నిరుత్సాహపరిచిన భర్త, గీత మాటల వల్ల గ్రామ వ్యవసాయ పద్ధతుల్లో వస్తున్న మార్పులు, రైతులు చూపిస్తున్న గౌరవం చూశాక భార్యకు వెన్నుదన్నుగా ఉంటూ వస్తున్నాడు.

మా ఊరు

ఒకప్పుడు ఇంటికి మాత్రమే పరిమితమైన నేను కృషిమిత్ర స్వయం సహాయక బృందంలో చేరడం వల్ల వ్యవసాయం, పర్యావరణానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. నాకు తెలిసిన విషయాలను చుట్టుపక్కల వారితో పంచుకుంటున్నాను. ఆశను, ఆశయాలనూ ఎప్పుడూ వదులుకోవద్దు. కాస్త ఆలస్యం అయినా ఫలితం తప్పకుండా వస్తుంది అని చెప్పడానికే మా ఊరే నిదర్శనం.


– గీతా రాణి సత్పతి, కృషిమిత్ర



● ముగ్గు-ముచ్చట



పద్మావతి
భారతం మిట్ట,
పాకాల,
తిరుపతి జిల్లా



57 చుక్కలు
సరిచుక్క
19 వరుసలు, 19 వచ్చేవరకు



చుండూరు
రాజ్యలక్ష్మి
ప్రశాంత్‌నగర్ కాలనీ,
హైదరాబాద్

13 చుక్కలు
సరి చుక్క, 1 వచ్చేవరకు



కె. మేరి
వుడా కాలనీ,
విజయనగరం

21 చుక్కలు
1 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com





బాలనాగు
వీరసోమమ్మ
రామంతపూర్,
హైదరాబాద్




17 చుక్కలు
7 వరుసలు, 7 వచ్చేవరకు



పద్మావతి
కడప, వైఎస్సార్ జిల్లా

13 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు







ఆకు వైద్యం



ఆకుకూరలు తినడం ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అందుకే ఇంచుమించు అందరూ ఆకుకూరలు తింటారు. అయితే కొన్ని రకాల వ్యాధులకు గురి అయినపుడు కొన్ని రకాల ఆకుకూరలు తీసుకోవడం వల్ల కూడా శరీరానికి సమృద్ధిగా పోషకాలు సమకూరి రోగ నిరోధక శక్తి పెరిగి ఆ వ్యాధి నుంచి తేలికగా బయటపడొచ్చుననే విషయం మాత్రం అందరికీ తెలియదు. అందుకే ఏయే వ్యాధులకు ఏయే ఆకుకూరలు తినడం మంచిదో తెలుసుకుందాం.

కొన్ని రకాల అనారోగ్య లక్షణాలకు కొన్ని రకాల ఆకుకూరలు ఎంతో మేలు చేస్తాయి. అవేమిటో చూద్దాం...

అవిసె ఆకుకూర

● అవిసె ఆకులు రుచికి కారంగా... కొంచం చేదుగా ఉంటాయి. కడుపులోని నులిపురుగుల్ని హరించడంలో ఇవి అద్భుతంగా పనిచేస్తాయి ● ఏకాదశి, శనివారం, శివరాత్రి వంటి ఉపవాసాల్లో ఉన్నవారు ఈ ఆకుకూరని తప్పకుండా తినాలి. దానివల్ల ఉపవాసం మూలంగా వచ్చిన నీరసాన్ని బాగా తగ్గించి, ఉత్సాహాన్నిస్తుంది. గాయాలకు, దెబ్బలకు ఇది మంచి మందు. దీని ఆకులు నూరి చర్మం మీద పట్టుగా వేస్తే తొందరగా తగ్గుతాయి. జలుబు, రొంప ఉన్నప్పుడు అవిసె ఆకుల రసాన్ని కొన్ని చుక్కలు ముక్కులో వేసుకుంటే రొంప, తలనొప్పి తగ్గుతాయి. చిన్నపిల్లలకు ఈ ఆకురసంలో తేనె కలిపి ఇస్తే మంచిది.

కరివేపాకు

● కరివేపాకును మన ఆహారంలో భాగం చేసుకోవడం వలన శరీరంలో కఫం, వాతం సమతుల్యంలో ఉంటాయి ● విపరీతమైన జిగురుతో కూడిన విరేచనాలు కూడా కరివేపాకు తినడం వల్ల తగ్గుతాయి. కరివేపాకును ముద్దలా చేసి విషజంతువుల కాట్లకు, దద్దుర్లకు బ్యాండేజీలా కడితే సులువుగా తగ్గుతాయి ● కరివేపాకు చెట్టు ఆకుల కషాయం కలరా వ్యాధిని నివారిస్తుంది.





గంగపాయల కూర

● రుచికి పుల్లగా ఉండే ఈ ఆకు పాలకంటే, వెన్నకంటే మంచిది ● దీనిలో ఎ, బి విటమినులు సమృద్ధిగా ఉన్నాయి. పాలకంటే, వెన్నకంటే కూడా జీవశక్తి అధికంగా ఉందని పరిశోధనలలో తేలింది. అదేవిధంగా రోగ నిరోధక శక్తి అధికం ● ఈ కూరలో ఐరన్, కాల్షియం ఎక్కువగా ఉన్నాయి ● రక్తహీనత ఉన్న వారు దీనిని తీసుకోవడం వలన చాలా మంచి ఫలితాలు ఉంటాయి ● శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ అనే దుష్టపదార్థాలను తొలగించి బయటకి పంపడంలో దీనిని మించింది లేదు ● ఎముకలు, దంతాల పెరుగుదలకు అది అత్యంత అవసరం ● కుష్ఠు, మూత్రాశయంలో రాళ్ల వంటి సమస్యలతో బాధ పడేవారు ఈ కూరని ఆహారంలో భాగం చేసుకోవాలి ● వెంట్రుకలకు బలాన్ని ఇస్తుంది.

కొత్తిమీర

● కొత్తిమీర కషాయంలో పాలు, పంచదార కలిపి సేవిస్తే రక్తంతో కూడిన మొలల వ్యాధి, అజీర్ణ విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపులో గ్యాస్... వంటి సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది ● కొత్తిమీర రసాన్ని చనుపాలతో కలిపి కళ్లలో వేస్తే నేత్రరోగాలు నయం అవుతాయి. కొత్తిమీరను వెచ్చచేసి కళ్ళకి వేసి కట్టినా సమస్య తీరుతుంది ● కొత్తిమీర కషాయంలో పంచదార కలిపి పుచ్చుకుంటే బాగా ఆకలి పుట్టిస్తుంది ● నోరు పూసినప్పుడు కొత్తిమీర రసంతో పుక్కిలిస్తే అద్భుతంగా పనిచేస్తుంది.

చామాకు

● చామ ఆకు కూర చాలా మంచిది. జబ్బుపడి లేచి నీరసపడిన వారికి ఈ ఆకుకూర అద్భుతంగా పనిచేస్తుంది ● పైల్స్‌తో బాధపడేవారు దీనిని తీసుకోవడం చాలా మంచిది ● మూత్రవ్యాధులున్న వారికి మంచి మందు ● నోటికి రుచి తెలియకపోవడం వంటి సమస్యని నివారిస్తుంది ● ఆకలి పుట్టిస్తుంది ● ఈ ఆకుని పైన వేసి కట్టు కడితే గాయాలు మానతాయి.



కామంచి ఆకు కూర




● చాలా చిన్న సైజులో అంటే కంది గింజంత సైజులో ఉండే కామంచి పళ్లని చాలామంది తింటారు. అయితే దీని ఆకులు నూరి ముద్దగా చేసి కట్టుకుంటే నొప్పులు తగ్గుతాయి. ఇదే ముద్దని చర్మం పైన రాసి నలుగు పెట్టుకుంటే చర్మసంబంధమైన సమస్యలు తగ్గుముఖం పడతాయి ● శరీరం ఉబ్బుతో కూడి ఉన్న వ్యక్తులకు ఈ ఆకుకూర అద్భుతంగా పనిచేస్తుంది ● కామంచి ఆకుల రసాన్ని చెవిలో పిండుతూ ఉంటే చెవిపోటు తగ్గి చీముని కూడా హరిస్తుంది.

గుంటగలగర

● జుట్టు సమస్యలకు వాడే మందుగా మాత్రమే ఇది అందరికీ తెలుసు కానీ, దీనిని లోపలికి తీసుకోవడం వల్ల శరీరంలోని వాత, కఫాలను పోగొడుతుంది ● దంతాలకు, చర్మానికి చాలా మంచిది ● తల నొప్పి, వాపు, దురదలని నివారిస్తుంది ● హెర్నియా, ఆయాసం, పొట్టలోని క్రిములు రుమాటిజం, భయంకరమైన రక్తక్షీణత , గుండెజబ్బు, చర్మరోగం వంటి వాటికి బాగా పని చేస్తుంది ● గుంటగలగర నేత్రాలకు చలువచేస్తుంది. ఈ ఆకుపసరు సాయంతో తయారైన కాటుక పెట్టుకోవడం వలన కంటిజబ్బులు నయం అవుతాయి ● చెవిపోటుగా ఉన్నప్పుడు ఈ ఆకుపసరు ఒకటి రెండు చుక్కలు చెవిలో వేస్తారు. ● గుంటగలగర జ్వరాన్ని తగ్గిస్తుంది .



గోంగూర



● గోంగూర ఆకులనే కాకుండగా పువ్వుల్ని కూడా పచ్చడి చేసుకుంటారు ● రేజీకటి రోగం కలవారికి ఈ కూర చాలా మేలు చేస్తుంది ● గోంగూర ఉడికించిన నీళ్ల తాగుతూ చప్పిడి పథ్యం చేస్తే ఉబ్బురోగాలు తగ్గుతాయి ● గోంగూరను నేతితో ఉడికించి వృషణాలకు కడితే వరిబీజాలు నయం అవుతాయి ● బోదకాలు వ్యాధి ఉన్నవారు వేపాకుతో పాటు గోంగూరని నూరి కాళ్లకు కడితే గుణకారిగా ఉంటుంది.

మీరు ఎంత సానుకూలం?



సాటివారిపట్ల ప్రేమ, అనురాగం, అభిమానం, ఆప్యాయత వంటి గుణాలు కలిగున్న మనిషి ఆరోగ్యంగా ఉంటాడని మనస్తత్వ శాస్త్రవేత్తలతోపాటు వైద్యులు కూడా చెబుతున్నారు. అలాగే .... సానుకూలమైన అనుభూతులతో ఉన్న మనిషిలో తెల్ల రక్తకణాలు వృద్ధి చెంది, వ్యాధికారక క్రిములు పెరగకుండా నిరోధిస్తాయి. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

కోపం, ద్వేషం, దుఃఖం, విచారం, అసూయ వంటి ప్రతికూల భావోద్వేగాలు మనిషిని మానసికంగా ఒత్తిళ్లు, ఆందోళనలకు గురిచేసి తెల్ల రక్తకణాలను తగ్గిస్తాయి. ఫలితంగా మనిషి అనారోగ్యానికి గురవుతాడు. అందుకే మంచి ఆలోచనలు ఉంటే ఆనందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయి.

ఒంటరితనం వద్దు

ఒంటరిగా ఉన్న మనిషిలో ప్రతికూల ఆలోచనలు ఎక్కువ. ఫలితంగా మనిషిలో తెల్ల రక్త కణాలు తక్కువవుతుంటాయి. ఎన్నో శారీరక సమస్యలు మొదలవుతాయి. ఆహార విహారాలపై అవగాహన లోపిస్తుంది. శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉండవచ్చు. మనసు ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది. ఆ కారణంగా జ్ఞాపకశక్తి తగ్గుతూ అల్జీమర్స్ వంటి ఆరోగ్య సమస్యలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఒంటరిగా ఉన్నవారు ఏదో ఒక పనిలో నిమగ్నమైనప్పుడు మెదడు నిర్మాణాత్మకంగా పనిచేస్తూ, సానుకూల ఆలోచనలకు తెరలేపుతుందన్నది చికాగోలోని రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ శాస్త్రజ్ఞుల సూచన. సానుకూల ఆలోచనల కోసం మెదడుకు తగు తర్ఫీదు ఇవ్వాలి.

ఇతరులతో మాట్లాడేటప్పుడు సానుకూల శబ్దాలు మాత్రమే ఉపయోగించే అలవాటు చేసుకోవాలి.. ఎవరికి వారు సానుకూల స్వయం సలహాలు ఇచ్చుకుంటుండాలి. ఆత్మవిశ్వాసంతో కూడిన మాటలు, చేతలకు మాత్రమే ప్రాధాన్యతనివ్వాలి. ఇతరుల పట్ల కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలి. తప్పులు జరిగినప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వైఫల్యాలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా గతంలో సాధించిన విజయాలను గుర్తుచేసుకుని, ప్రస్తుతం జరిగిన వాటిని విశ్లేషించుకోవాలి.

విజయాల బాటలో నడిచిన వారిని చూసి అసూయ చెందకుండా వారి నుంచి ప్రేరణ పొందడం అలవాటు చేసుకోవాలి. ప్రతికూల ఆలోచనలు వచ్చినప్పుడు... వాటిని సానుకూలం గా మార్చుకునే ప్రయత్నం చేయాలి. పెదవుల మీద చిరునవ్వు చెదరనీయకూడదు. మంచి జరగబోతోందని ఊహించుకోవాలి. ఉట్టి పుణ్యానికి బద్ధకంతో పనులు వాయిదా వేసే అలవాటు మానుకోవాలి.

సెల్ఫ్ రిలాక్సేషన్ పద్ధతి నేర్చుకునే ప్రయత్నం చేయాలి. ఇతరులతో ప్రేమగా వ్యవహరించడం..... నవ్వుతూ... నవ్విస్తూ ఉండడం వల్ల ఎంత పెద్ద జబ్బునైనా నయంచేసుకోవచ్చన్న నిపుణుల సలహాను పరిగణనలోకి తీసుకోవాలి. తీసుకునే ఆహారంతోనే ఆలోచనా విధానం ముడిపడి ఉందని అంటున్నారు నిపుణులు. తాజా పండ్లను, కూరగాయలను తినడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి మంచి ఆహారాన్ని తీసుకోవడం అన్ని విధాలా మంచిది.

ప్రతికూల ఆలోచనలు వద్దు

నెగెటివ్ ఆలోచనల వల్ల ఆత్మవిశ్వాసం కోల్పోతారు. ఎదుటివాళ్లకి మన మీద నమ్మకం లేకుండా చేస్తాయి. ఇలాంటి ప్రతికూల ఆలోచనల నుంచి బయటపడటానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుందని చెబుతున్నారు మానసిక నిపుణులు.

ప్రతికూల ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని ఓ పుస్తకంలో రాసుకోవాలి. అవి మనం తీసుకొనే నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవాలి. అసలు ఇలాంటి ఆలోచనలు ఎందుకు కలుగుతున్నాయో కనుక్కోవాలి. వాటినుంచి బయట పడాలనే బలమైన తపన ఉండాలి. భవిష్యత్తు గురించి అతిగా ఆలోచించడం వల్ల ఫలితం ఉండదు. భవిష్యత్తు గురించి అసలు ఆలోచన చేయకుండా ఉండటం ఎంత తప్పో, భవిష్యత్తులో అలా జరుగుతుందేమో... ఇలా జరుగుతుందేమో అని అతిగా ఆలోచించడ కూడా అంతే తప్పు. దానివల్ల ఆరోగ్యం పాడవుతుంది. అందువల్ల అంతా మంచే జరుగుతుందనే ఆలోచన మంచిది.

ఎప్పుడైతే మనమీద మనకు నమ్మకం లేదో అప్పుడు ప్రతికూల ఆలోచనలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి అయేలా చేస్తాయి. అందువల్ల మనమీద మనకు ఇష్టం, గౌరవం, నమ్మకం ఉండేలా చూసుకోవడం అత్యవసరం. గతంలో సంభవించిన అపజయాలు, ఎదురైన చేదు అనుభవాల వల్ల ప్రతికూల ఆలోచనలు రావడం సహజం. అలాంటప్పుడు గతాన్ని మర్చిపోవాలి. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి.

మనల్ని మనం ప్రేమించుకోవాలి. సంతోషంగా ఉండడానికి ప్రయత్నించాలి. అప్పుడే మనం ఏడాదంతా కాదు.. ఎప్పటికీ ఆరోగ్యం గా ఆనందంగా ఉండగలుగుతాం.

మీకు తెలుసా?



వార్తలు వినడం, చదవడం, చూడడం ద్వారా మనచుట్టూ ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిందే. సామాజిక, రాజకీయ, మానవీయ కథనాల ద్వారా ప్రపంచంతో సంబంధం కలిగి ఉండాలి కూడా. అయితే మానవీయ కథనాలకంటే మనసును గాయపరిచే కథనాల మీద ఎక్కువగా దృష్టి పెట్టడం వల్ల మంచికంటే చెడు ఎక్కువగా ఉంటుంది. అలాంటి సంఘటనలను ఒక వార్తగా తెలుసుకోవడం వరకే పరిమితం చేయాలి. నేర కథనాలను చూసేటప్పుడు మనసు ఉద్వేగానికి లోనవుతుంది, ఆ మేరకు దేహంలో రక్తప్రసరణ వేగం పెరగడం, హార్మోన్‌లు ప్రభావితం కావడం వంటి మార్పులు చోటు చేసుకుంటాయి. క్రైమ్ వార్తల ఆధారంగా అల్లుతున్న సుదీర్ఘ కథనాలకు మన రోజులో ఎక్కువగా చోటివ్వకూడదని చెప్తున్నారు యూఎస్ ఆధారిత మేయో క్లినిక్ హెల్త్ సిస్టమ్ ప్రతినిధులు. పిల్లలు, వయసు మీరినవాళ్లు ఇంట్లో ఉన్న సమయంలో క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను పెట్టకూడదు. వీటివల్ల పిల్లలు తరచూ మానసిక ఆందోళనలకు లోనవుతుంటారు. పెద్దవాళ్లలో గుండె వేగం పెరిగిపోతూ ఉంటుంది. ఇలా రోజూ జరుగుతుంటే ఈ పరిస్థితి గుండె సమస్యలకు దారి తీస్తుంది. అందుకే లైఫ్ వెల్‌బీయింగ్‌కి క్రైమ్ స్టోరీలకు దూరంగా ఉండడం కూడా ప్రధానమే.

సినిమా

కిష్టయ్య.. అంజి.. ఓ మంచి స్నేహం




● 'అల్లరి' నరేశ్, నాగార్జున

"దేవుడే తన చేతితో రాసిన ఒక కావ్యం. అంజిది.. కిష్టయ్యది... వీడదీయని ఒక బంధం.. చిరు నవ్వులు పూసే స్నేహం.. చిరుగాలికి ఈలల పాఠం" అంటూ సాగుతుంది 'నా సామిరంగ' సినిమాలోని 'విజిల్ థీమ్ సాంగ్'. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. ఈ సినిమాలో కిష్టయ్య పాత్రలో నాగార్జున, అంజి పాత్రలో 'అల్లరి' నరేశ్, భాస్కర్ పాత్రలో రాజ్ తరుణ్, వరలక్ష్మి పాత్రలో ఆషికా రంగనాథ్, కుమారి పాత్రలో రుక్సార్, మంగ పాత్రలో మిర్నా మీనన్ నటించారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం 'విజిల్ థీమ్ సాంగ్' లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే ఈ పాటకు ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి సాహిత్యం అందించగా, శాండిల్య పిసాపాటి పాడారు.

ఆ రేంజ్ ఎమోషన్ సైంధవ్‌లో ఉంది

- నిర్మాత వెంకట్ బోయనపల్లి



"హిట్' ట్రైలర్ చూసి, డైరెక్టర్ శైలేష్‌తో ఓ సినిమా చేయాలనుకున్నాను. వెంకటేశ్‌గారికి శైలేష్ కథ చెప్పారు. సాధారణంగా వెంకటేశ్‌గారితో సినిమా అంత సులభంగా వర్కౌట్ కాదని, సురేష్‌బాబుగారు కథల విషయంలో స్ట్రిక్ట్‌గా ఉంటారనే మాటలు వినిపిస్తుంటాయి. కానీ నేను ఇండియాలో విమానం ఎక్కి, అమెరికాలో దిగే సరికి 'సైంధవ్' సినిమా ఓకే అయ్యింది" అన్నారు వెంకట్ బోయనపల్లి. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన 'సైంధవ్' ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్ బోయనపల్లి చెప్పిన విశేషాలు.

● వెంకటేశ్-నానీగార్ల కాంబినేషన్‌లో మా బ్యానర్‌లో ఓ సినిమా చేయాలనుకున్నాను.. కుదర్లేదు. మా బ్యానర్‌లో తొలి సినిమాగా నానీగారు హీరోగా 'శ్యామ్ సింగరాయ్' తీశాం. ఇప్పుడు వెంకటేశ్‌గారి 75వ సినిమా 'సైంధవ్'ను నిర్మించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇక వెంకటేశ్-నానీగార్ల మల్టీస్టారర్ ఫిల్మ్‌కు మంచి కథ కుదిరితే నిర్మించడానికి రెడీగా ఉన్నాను. ● 'సైంధవ్'ను వెంకటేశ్, సురేష్‌బాబుగార్లు చూసి, హ్యాపీ ఫీలయ్యారు. కృష్ణా, గుంటూరు జిల్లా హక్కులను సురేష్‌గారే తీసుకున్నారు. ఈ సినిమా కథ విన్నప్పుడే భారీ ఖర్చుతో కూడుకున్నది అర్థమై, గ్రాండ్‌గా నిర్మించాం. 'సైంధవ్'ను చూసే ప్రేక్షకులు దాదాపు గంటసేపు కన్నీళ్లు పెట్టుకుంటారు. ఆ రేంజ్ ఎమోషన్ ఈ సినిమాలో ఉంది. ● పాన్-ఇండియా అంటూ కొంత బడ్జెట్ కేటాయించి మరీ ఇతర రాష్ట్రాల్లో ప్రమోషన్‌కు పరిగెడుతున్నారు. ఈ క్రమంలో తెలుగును మర్చిపోతున్నారు. కానీ మేం తెలుగుకు ప్రాధాన్యం ఇచ్చాం. 'కాంతార' వంటి కన్నడ చిత్రాలు ముందుగా మాతృ భాషలో విడుదలై, ఆ తర్వాత ఇతర భాషల్లోనూ హిట్ అయ్యాయి. ప్రస్తుతం నిర్మాతలకు పాన్ ఇండియా మార్కెట్ అంత లాభసాటిగా ఏం లేదు. మా వరకు ఓటీటీ, శాటిలైట్ బిజినెస్ బాగా జరిగింది. ఈ సంక్రాంతి రేసు నుంచి 'ఈగల్'ను వాయిదా వేయడం ఆ చిత్రం యూనిట్ గొప్పదనం.


చూపే పడితే మటాషే...!

శివ కందుకూరి హీరోగా నటించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. రాశీ సింగ్ హీరోయిన్. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్ కానుంది. శుక్రవారం ఈ సినిమాలోని 'కేస్ ఏదైనా.. ప్లేస్ ఏదైనా.. చూపే పడితే మటాషే..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. పురుషోత్తం రాజ్, సురేష్ బనిశెట్టి ఈ పాట రాయగా, ఈ చిత్రం సంగీతం దర్శకుడు శ్రీ చరణ్ పాకాల పాడారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్.



● శివ కందుకూరి

బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా...



● గోపీచంద్

ఫిబ్రవరిలో థియేటర్స్‌కు వస్తున్నాడు 'భీమా'. గోపీచంద్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ 'భీమా'. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో పోలీసాఫీసర్ భీమా పాత్రలో నటిస్తున్నారు గోపీచంద్. సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేసి, సినిమాను ఫిబ్రవరి 16న విడుదల చేయనున్నట్లుగా ప్రకటించారు. 'ఈ రాక్షసుల్ని వేటాడే బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా' అనే వాయిస్ టీజర్‌లో వినిపిస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

వాళ్ల నాశనం కోరుకోనయ్యా...



● మమ్ముట్టి, జీవా

'ఏన్నా.. ఇంత రాత్రి అయినా నిద్ర పోకుండా ఈడ ఏం చేస్తున్నావన్నా' అంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రధారి జీవా డైలాగ్‌తో 'యాత్ర 2' టీజర్ విడుదలైంది. 'యాత్ర' వంటి హిట్ మూవీకి సీక్వెల్‌గా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'మా వైఎస్ఆర్ కొడుకు వస్తున్నాడంట.. ఆయన కోసం ఎదురు చూస్తున్నానన్నా' (వైఎస్ఆర్ అభిమాని), 'కాదన్నా.. మీ వైఎస్ఆర్ కొడుకు వచ్చి మీ ముందు నిల్చున్నా మీకు కనపడదు కదా అన్న' (జీవా), 'నాకు ఆయన కనపడకపోయినా నేను ఆయనకు కనపడతా కదా అన్న, నాలాంటోళ్లు ఆయన వెనకాల ఉన్నామని తెలియడానికే నేను ఇక్కడున్నానన్నా' (వైఎస్ఆర్ అభిమాని), 'నా రాజకీయ ప్రత్యర్థినైనా, శత్రువునైనా ఓడించాలనుకుంటానే కానీ, మీ నాయకుడిలాగా వాళ్ల నాశనం కోరుకోనయ్యా' (వైఎస్ఆర్ పాత్రధారి మమ్ముట్టి) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు మహి వి. రాఘవ్. మహేశ్ మంజ్రేకర్, సుజానె బెర్నెర్ట్, కేతకీ నారాయణన్, 'శుభలేఖ' సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మది, సంగీతం: సంతోష్ నారాయణన్.

కన్నప్పలో మంచు వారసుడు అవ్రామ్



● అవ్రామ్, విష్ణు మంచు

మంచు ఫ్యామిలీ వారసుడు అవ్రామ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. ఈ సినిమాలో తన తనయుడు అవ్రామ్ మంచు నటించనున్నట్లుగా శుక్రవారం విష్ణు వెల్లడించారు. "సినిమా అనే విశ్వంలోకి 'కన్నప్ప' చిత్రంతో నా కొడుకు అవ్రామ్ వస్తున్నాడని చెప్పడానికి థ్రిల్లింగ్‌గా ఉంది. మంచు కుటుంబంలో మరో అధ్యాయం మొదలైంది. 'కన్నప్ప' సినిమాకు నా జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఇది మా కుటుంబానికి చెందిన మూడు తరాల కలయికతో వస్తోన్న అరుదైన చిత్రం" అన్నారు మంచు విష్ణు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్‌పై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానున్నట్లుగా తెలుస్తోంది.


లవ్ మౌళి నాకు దగ్గరగా అనిపించింది - నవదీప్



● పంఖురి, నవదీప్

"నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' సినిమా దగ్గరగా అనిపించింది" అని నవదీప్ అన్నారు. అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో జూక్ బాక్స్‌ని హీరో రవితేజ విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో ఈ సినిమాలోని పాటలను పాడిన వారితోనే పాటలను విడుదల చేయించారు.

రామ్‌చరణ్ సినిమాలో...



● శివ రాజ్‌కుమార్

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌ను సంప్రదించింది యూనిట్. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో భాగంగా శివ రాజ్‌కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారని సమాచారం.

ఒక్కొక్కరు ఒక్కో రకం

'ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి అని అన్నాడు ఓ మహాకవి' అని నటుడు-దర్శకుడు-రచయిత తనికెళ్ల భరణి చెప్పే డైలాగ్‌తో మొదలవుతుంది 'శ్రీరంగ నీతులు' సినిమా టీజర్. సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ప్రవీణ్ కుమార్ దర్శకత్వంలో బల్మూరి వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'నేను బాగు పడాలా.. నీకు నచ్చినట్లు ఉండాలా?', 'మరి మన గురించి ఎలా తెలుస్తుంది అందరికీ?', 'ఇక్కడ ఒక్కొక్కరు ఒక్కో రకం..' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. "ఈ తరం యువత ఆలోచనలు, భావోద్వేగాలు ఎలా ఉంటున్నాయనేది ఈ సినిమాలోని పాత్రల ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఆసక్తికరమైన కథ, కథనాలతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తూనే, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా కథనం ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.



● సుహాస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	179 / 72,026
నిఫ్టీ ▲	53 / 21,711

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 9.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,582	▲	73
డోజోన్స్	37,532	▲	93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,700	▼	23
డాక్స్	16,630	▲	13
హాంగ్‌సెంగ్	2,929	▼	25
నికాయ్	33,377	▲	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,540
బంగారం (99.5 స్వచ్ఛత)	62,290
వెండి (కిలో)	71,550

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.84	83.86
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.42	106.97
€	యూరో	ఎస్‌బీఐ	90.02	92.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.87	58.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.89	56.83
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.50	12.58

బ్రూక్‌ఫీల్డ్ చేతికి ఏటీసీ ఇండియా

డీల్ విలువ రూ. 20,800 కోట్లు



న్యూఢిల్లీ: కెనడియన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్రూక్‌ఫీల్డ్.. తాజాగా అమెరికన్ టవర్ కార్పొరేషన్(ఏటీసీ)కు చెందిన దేశీ బిజినెస్ కొనుగోలుకి తెర తీసింది. ఇందుకు మొత్తం 2.5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 20,800 కోట్లు) డీల్ కుదుర్చుకుంది. 2 బిలియన్ డాలర్ల ఎంటర్‌ప్రైజ్ విలువ(రూ. 16,630 కోట్లు)లో లావాదేవీ కుదిరింది. దీనికి 2023 అక్టోబర్1 నుంచి టికింగ్ ఫీజు సైతం జత కలవనుంది. వెరసి మొత్తం 2.5 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. నియంత్రణ సంస్థల అనుమతుల తదుపరి 2024 ద్వితీయార్ధంలో డీల్ ముగిసే వీలున్నట్లు అంచనా. డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్(డీఐటీ) ద్వారా ఏటీసీ ఇండియా బిజినెస్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి ఏటీసీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. ఏటీసీ ఇండియాకు దేశీయంగా సుమారు 78,000 టెలికం సైట్స్ ఉన్నాయి. డీల్ ద్వారా ప్రస్తుత మారకపు ధర ప్రకారం దాదాపు రూ. 21,000 కోట్ల నగదును అందుకోనున్నట్లు ఏటీసీ వెల్లడించింది. నిధులను రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఇది దేశీయంగా టెలికమ్యూనికేషన్స్ విభాగంలో బ్రూక్‌ఫీల్డ్ చేపట్టిన మూడో కొనుగోలుకావడం గమనార్హం!

1,75,000 టవర్లు

రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ హోల్డింగ్స్ నుంచి 2020లో బ్రూక్‌ఫీల్డ్ 1,75,000 టవర్ల పోర్ట్‌ఫోలియోను సొంతం చేసుకుంది. 2022లో 5,000 ఇన్‌డోర్ బిజినెస్ సొల్యూషన్ సైట్లు, స్మాల్ సెల్ సైట్లను కొనుగోలు చేసింది. వీటిద్వారా టెల్కోలకు 5జీ సేవలు, క్లిష్టమైన ప్రాంతాల్లో కవరేజీ విస్తరణకు వీలు కల్పించనుంది. తాజా కొనుగోలుతో దేశీ టెలికం టవర్ల పోర్ట్‌ఫోలియో విస్తరణసహా పటిష్టపరచేందుకు కృషి చేయనున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ మధ్యప్రాచ్యం, భారత్ కార్యకలాపాల మౌలిక సదుపాయాల హెడ్ అర్పిత్ అగర్వాల్ చెప్పారు. దీంతో తమ కస్టమర్లు, భాగస్వాములకు విస్తారిత సేవలు అందించనున్నట్లు తెలిపారు.

టాటా ప్యాసింజర్ ఈవీ రైడ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహన విభాగమైన టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ వచ్చే ఏడాదిన్నరలో అయిదుకుపైగా ఈవీలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పూర్తిస్థాయి ఆధునిక ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థ అయిన యాక్టి.ఈవీ ప్లాట్‌ఫామ్‌పై విభిన్న బాడీ, సైజుల్లో ఇవి రూపుదిద్దుకుంటాయని కంపెనీ శుక్రవారం వెల్లడించింది. యాక్టి.ఈవీ ఆధారంగా తొలుత పంచ్ ఈవీ వస్తోందని ప్రకటించింది. ఈ ఈవీ మోడళ్లలో 300 నుండి 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించే యాక్టి.ఈవీ బ్యాటరీ ప్యాక్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. గ్లోబల్ ఎన్‌సీఏపీ, భారత్ ఎన్‌సీఏపీ భద్రతా ప్రమాణాలను అనుసరించి మోడళ్ల తయారీ చేపడతామని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ ప్రొడక్ట్స్ ఆఫీసర్ ఆనంద్ కులకర్ణి తెలిపారు. కాగా, పంచ్ ఈవీ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. రూ.21,000 చెల్లించి కారు బుక్ చేసుకోవచ్చు.

టయోటా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ రంగ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ వాహనాల ధరలను సవరించింది. ఎంపిక చేసిన మోడళ్లు, వేరియంట్లపై 0.5 నుంచి 2.5 శాతం వరకు ధర పెంచింది. జనవరి 1 నుంచి నూతన ధరలు అమలులోకి వచ్చాయని కంపెనీ ప్రకటించింది. పెరుగుతున్న వ్యయాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దాదాపు అన్ని కంపెనీలు వాహనాల ధరలను జనవరి నుంచి అధికం చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి.

అదానీ మళ్లీ కుబేర్ నంబర్ 1

దేశ సంపన్నుల్లో మొదటి స్థానం ● రెండో స్థానానికి ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మళ్లీ మొదటి స్థానానికి చేరుకున్నారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రెండో స్థానానికి దిగిపోయారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా గణాంకాల ప్రకారం గౌతమ్ అదానీ సంపద విలువ 97.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో ముకేశ్ అంబానీ నికర విలువ 97 బిలియన్ డాలర్ల వద్ద ఉంది. అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు 30 శాతం వరకు ఇటీవలి కాలంలో ర్యాలీ చేయడంతో ఆయన సంపద విలువ 4.41 బిలియన్ డాలర్లు పెరిగింది. దీంతో ప్రపంచ కుబేరుల్లో 16వ స్థానం నుంచి 12వ స్థానానికి చేరుకున్నారు. ప్రపంచ కుబేరుల్లో ముకేశ్ అంబానీ 13వ స్థానంలో ఉన్నారు. ఏడాది తర్వాత గౌతమ్ అదానీ తిరిగి దేశ అత్యంత సంపన్నుడి స్థానానికి చేరారు. 2023 జనవరిలో అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీలపై సంచలన ఆరోపణలతో నివేదిక విడుదల చేయడం తెలిసిందే. దీని తర్వాత గ్రూప్ కంపెనీల షేర్లు భారీ పతనం కావడంతో అదానీ సంపద విలువ గణనీయంగా తగ్గింది. సదరు ఆరోపణలపై సుప్రీంకోర్టు నుంచి దాదాపు క్లీన్‌చిట్ ఇవ్వడంతో గ్రూప్ కంపెనీల షేర్లు ర్యాలీ చేస్తున్నాయి. ఒక దశలో 127 బిలియన్ డాలర్ల విలువతో అదానీ ప్రపంచంలో మూడో అత్యంత సంపన్నుడి స్థానానికి కూడా వెళ్లడం గమనార్హం.

ఐపీవో బాటలో మొబిక్విక్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 700 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ యూనికార్న్ మొబిక్విక్ సిస్టమ్స్ లిమిటెడ్ రెండేళ్ల తర్వాత మరోసారి పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 700 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. కంపెనీ ఇంతక్రితం 2021 జూలైలో రూ. 1,900 కోట్ల సమీకరణ ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు ప్రణాళికలు వేసింది. ఇందుకు వీలుగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే ఆపై ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా పబ్లిక్ ఇష్యూ యోచనను విరమించుకుంది. 2021 నవంబర్‌లో ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంది. కాగా.. ప్రస్తుత ప్రణాళికల ప్రకారం రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. ఐపీవోకంటే ముందుగా సెక్యూరిటీల కేటాయింపు ద్వారా రూ. 140 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇది జరిగితే ఆమేరకు ఐపీవో పరిమాణం తగ్గనుంది. కంపెనీలో ప్రధాన వాటాదారు పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్‌తోపాటు.. బజాజ్ ఫైనాన్స్, అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్‌కు పెట్టుబడులున్నాయి.

పబ్లిక్ ఇష్యూ యోచనలో ఐఐఎఫ్‌సీఎల్

ప్రభుత్వ రంగ సంస్థ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సీఎల్) పబ్లిక్ ఇష్యూ చేపట్టే యోచనలో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25)లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ఎండీ పీఆర్ జైశంకర్ పేర్కొన్నారు. ఇందుకు త్వరలోనే కన్సల్టేషన్ కార్యక్రమానికి తెరతీయనున్నట్లు కంపెనీ వ్యవస్థాపక రోజు సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీలో కేంద్రానికి 100% వాటా ఉంది. కంపెనీ ఏర్పాటయ్యాక ఇప్పటివరకూ 750 ప్రాజెక్టులకు రూ. 2.5 లక్షల కోట్ల రుణాలందించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ. 1,076 కోట్ల నికర లాభం ఆర్జించగా.. ఈ ఏడాది(2023-24) రూ. 1,500 కోట్ల లాభం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

సేవలు స్పీడ్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం డిసెంబర్‌లో పురోగతి సాధించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ డిసెంబర్‌లో 59కి ఎగసింది. నవంబర్‌లో సూచీ 56.9 వద్ద ఉంది. సానుకూల ఆర్థిక పరిస్థితులు, డిమాండ్ ధోరణులు దీనికి కారణమని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనమిస్ట్ ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	598-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
5-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

స్వల్ప లాభాల ముగింపు

- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు
- ఆదుకున్న ఐటీ, ఆటో షేర్లు
- మళ్లీ 72 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 21,700 పాయింట్లు ఎగువకు నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ సంకేతాలతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. ఐటీ, టెక్నాలజీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 179 పాయింట్లు పెరిగి 72,026 వద్ద, నిఫ్టీ 53 పాయింట్లు బలపడి 21,711 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధంలో స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 309 పాయింట్లు బలపడి 72,156 వద్ద, నిఫ్టీ 90 పాయింట్లు ఎగసి 21,750 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. అయితే మిడ్ సెషన్‌లో తలెత్తిన అనూహ్య అమ్మకాలతో సూచీలు లాభాలన్నీ కోల్పోయాయి. ట్రేడింగ్ చివర్లో మరోసారి కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ఫార్మా, బ్యాంకింగ్, షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్‌తో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 0.61%, 0.19% చొప్పున రాణించాయి.




- డిసెంబర్ క్వార్టర్ ఫలితాల వెల్లడికి ముందు(గురువారం నుంచి) ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కోఫోర్జ్, టీసీఎస్ షేర్లు 2% పెరిగాయి. ఎల్‌టీఐఎం, ఎంఫసీస్, పర్‌సిస్టెంట్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, విప్రో షేర్లు ఒక శాతం లాభపడ్డాయి.
- ఎవర్ రెన్యూ ఎనర్జీ లిమిటెడ్ నుంచి 225 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్ ఆర్డర్‌ను దక్కించుకోవడంతో సుజ్లాన్ ఎనర్జీ షేరు 5% లాభపడి రూ.41 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

కావేరీ సీడ్ షేర్ల బైబ్యాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విత్తన తయారీ సంస్థ కావేరీ సీడ్ కంపెనీ షేర్ల బైబ్యాక్ ప్రకటించింది. టెండర్ ఆఫర్ రూట్‌లో రూ.325 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. 9% ప్రీమియంతో ఒక్కో షేరు ధరను రూ.725గా నిర్ణయించారు. గరిష్టంగా 44.82 లక్షల షేర్లను కంపెనీ కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్‌నకు 59.9% వాటా ఉంది. బైబ్యాక్ వార్తల నేపథ్యంలో కావేరీ సీడ్స్ షేరు ధర బీఎస్‌ఈలో శుక్రవారం 1.18% ఎగసి రూ.662.60 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో యూకీ బాంబ్రీ జోడీ

బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ-రాబిన్ ద్వయం 7-6 (7/5), 7-6 (7/5)తో నథానియల్ లామోన్స్-జేక్సన్ విత్రో (అమెరికా) జంటపై విజయం సాధించింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకోగా... టైబ్రేక్‌లలో యూకీ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని అందుకుంది.

రెండో స్థానానికి పడిపోయిన భారత్

ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా మరోసారి నంబర్‌వన్‌గా నిలిచింది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు రెండో స్థానానికి పడిపోయింది. పాక్‌పై ఆసీస్ 2-0తో సిరీస్ గెలుచుకోగా, దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను 1-1తో ముగించడంతో భారత్ ర్యాంక్ మారింది. ప్రస్తుతం ఆసీస్ 118 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో, భారత్ 117 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాయి.

భారత మహిళల విజయ గర్జన

- తొలి టి20లో 9 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- టిటాస్ సాధుకు 4 వికెట్లు
- షఫాలీ, స్మృతి అర్ధ సెంచరీలు


టిటాస్ సాధు 4/17


షఫాలీ, స్మృతి

ముంబై: ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌ను 0-3తో చేజార్చుకున్న భారత జట్టు టి20 సిరీస్‌లో మెరుపు విజయంతో శుభారంభం చేసింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో ఆసీస్‌ను కట్టడి చేసిన మన జట్టు... ఆపై అలవోకగా లక్ష్యాన్ని ఛేదించి సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబర్చింది. శుక్రవారం డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన తొలి టి20లో భారత్ 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 19.2 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. 2020 టి20 ప్రపంచకప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత ఆసీస్ జట్టు మళ్లీ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (32 బంతుల్లో 49 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఎలైస్ పెరీ (30 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. పవర్‌ప్లే ముగిసేసరికి 33/4 స్కోరుతో ఆసీస్ ఇబ్బందుల్లో పడిన స్థితిలో లిచ్‌ఫీల్డ్, పెరీ ఐదో వికెట్‌కు 52 బంతుల్లోనే 79 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. యువ పేస్ బౌలర్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిటాస్ సాధు (4/17) పదునైన బంతులతో ప్రత్యర్థిని కుప్పకూల్చగా... శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసి గెలిచింది. షఫాలీ వర్మ (44 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మృతి మంధాన (52 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 93 బంతుల్లోనే 137 పరుగులు జోడించడం విశేషం. తొలి ఓవర్లో ఎక్స్‌ట్రాల రూపంలోనే 14 పరుగులు రావడంతో మొదలైన ఛేదనలో చివరి వరకు భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ముఖ్యంగా గత రెండు వన్డేల్లో తుది జట్టులో స్థానం దక్కించుకోలేకపోయిన షఫాలీ ఇప్పుడు మళ్లీ అవకాశం రాగానే చెలరేగిపోయింది. విజయానికి ఐదు పరుగుల దూరంలో స్మృతి వెనుదిరిగినా... షఫాలీతో కలిసి జెమీమా (6 నాటౌట్) మ్యాచ్ ముగించింది. సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజలో నిలవగా, రెండో మ్యాచ్ ఆదివారం ఇదే మైదానంలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌తో స్మృతి అంతర్జాతీయ టి20ల్లో 3 వేల పరుగులు పూర్తి చేసుకొని హర్మన్‌ప్రీత్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచింది.

జూన్ 9న... న్యూయార్క్‌లో...

టి20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ పోరు ● జూన్ 1 నుంచి 29 వరకు టోర్నీ



దుబాయ్: అమెరికా అభిమానుల సాక్షిగా టి20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. న్యూయార్క్ నగరం వేదికగా జూన్ 9న టి20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో దాయాది జట్లు తలపడతాయి. ఈ ఏడాది జరిగే మెగా టోర్నీ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం రాత్రి విడుదల చేసింది. న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక ఐసన్ హోవర్ పార్క్ స్టేడియంలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుంది. ఈ పార్క్‌లో ఇప్పటి వరకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫుట్‌బాల్ ఫీల్డ్‌లు మాత్రమే ఉండగా... ప్రపంచకప్ కోసం కొత్తగా క్రికెట్ మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. జూన్ 1 నుంచి జూన్ 29 వరకు జరిగే ఈ ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడనుండగా... వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు.

- **గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్** లీగ్ దశలో తమ తొలి మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌తో, జూన్ 9న పాకిస్తాన్‌తో, జూన్ 12న అమెరికాతో, జూన్ 15న కెనడాతో తలపడుతుంది.
- గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, మాజీ విజేత ఆస్ట్రేలియా, నమీబియా, స్కాట్లాండ్, ఒమన్ జట్లు ఉన్నాయి.
- గ్రూప్ 'సి'లో న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్, ఉగాండా, పపువా న్యూగినీ జట్లకు చోటు కల్పించారు.
- గ్రూప్ 'డి'లో దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ జట్లు ఉన్నాయి.
- లీగ్ దశ తర్వాత ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు ముందంజ వేస్తాయి. ఆ తర్వాత ఎనిమిది టీమ్‌లతో 'సూపర్ ఎయిట్' దశ జరుగుతుంది. ఆపై సెమీఫైనల్స్, ఫైనల్‌ను నిర్వహిస్తారు.
- వెస్టిండీస్‌లో 6 వేదికల్లో (బార్బడోస్, ట్రినిడాడ్, గయానా, ఆంటిగ్వా, సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్)... అమెరికాలోని 3 వేదికల్లో (న్యూయార్క్, ఫ్లోరిడా, డాలస్) కలిపి మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.
- టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి (అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి) జరుగుతాయి.

రాహుల్ సింగ్ డబుల్ సెంచరీ

తిలక్ వర్మ అజేయ శతకం ● హైదరాబాద్ 474/5 డిక్లేర్డ్


రాహుల్


తిలక్

దీమాపూర్: ఈసారి రంజీ ట్రోఫీలో 'ప్లేట్' డివిజన్‌లో పోటీపడుతున్న హైదరాబాద్ జట్టు తొలి మ్యాచ్‌లోనే పరుగుల వరద పారించింది. నాగాలాండ్ జట్టుతో శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 76.4 ఓవర్లలో 5 వికెట్లకు 474 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఆట ముగిసే సమయానికి నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కోల్పోయి 35 పరుగులు సాధించింది. అంతకుముందు నాగాలాండ్ బౌలర్ల భరతం పట్టిన హైదరాబాద్ బ్యాటర్ రాహుల్ సింగ్ గహ్లోత్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. కెప్టెన్ తిలక్ వర్మ అజేయ శతకం (112 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) నమోదు చేయగా... తన్మయ్ అగర్వాల్ (80; 12 ఫోర్లు) కూడా రాణించాడు. గతంలో సర్వీసెస్ జట్టుకు ఆడిన రాహుల్ 157 బంతుల్లో 23 ఫోర్లు, 9 సిక్స్‌లతో 214 పరుగులు చేసి అవుటయ్యాడు. రాహుల్ 143 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో రవిశాస్త్రి తర్వాత రంజీ ట్రోఫీలో వేగవంతమైన డబుల్ సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా రాహుల్ గుర్తింపు పొందాడు.

12 ఏళ్ల 284 రోజులకు...



రంజీ ట్రోఫీలో పిన్న వయస్సులోనే అరంగేట్రం చేసిన నాలుగో ప్లేయర్‌గా బిహార్ జట్టుకు చెందిన వైభవ్ సూర్యవంశీ (12 ఏళ్ల 284 రోజులు) గుర్తింపు పొందాడు. పట్నాలో ముంబై జట్టుతో శుక్రవారం మొదలైన ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో వైభవ్ బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీలో పిన్న వయస్సులోనే మ్యాచ్ ఆడిన ప్లేయర్ల జాబితాలో అలీముద్దీన్ (రాజ్‌పుతానా: 12 ఏళ్ల 73 రోజులు: 1942), ఎస్‌కే బోస్ (బిహార్: 12 ఏళ్ల 76 రోజులు: 1959), మొహమ్మద్ రంజాన్ (నార్తర్న్ ఇండియా: 12 ఏళ్ల 247 రోజులు: 1937) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

దబంగ్ ఢిల్లీకి ఆరో గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ, యు ముంబా జట్లు తమ ఖాతాలో ఆరో విజయాన్ని జమ చేసుకున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీ 38-37తో పట్నా పైరేట్స్‌ను ఓడించగా... యు ముంబా 40-35తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	9	8	1	0	41
దబంగ్ ఢిల్లీ	10	6	3	1	35
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
జైపూర్ పింక్ పాంథర్స్	9	5	2	2	33
యు ముంబా	8	6	2	0	31
పట్నా పైరేట్స్	10	5	5	0	28
హరియాణా స్టీలర్స్	9	5	4	0	26
బెంగళూరు బుల్స్	11	4	7	0	26
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పాకిస్తాన్ 68/7


హాజల్‌వుడ్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులోనూ పాకిస్తాన్ జట్టుకు ఓటమి తప్పేలా లేదు. 14 పరుగుల స్వల్పఆధిక్యాన్ని పొందిన పాకిస్తాన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లు ఆడి 68 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం పాకిస్తాన్ 82 పరుగుల ఓవరాల్ ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియా పేస్ బౌలర్ హాజల్‌వుడ్ (4/9) ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 116/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 299 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (60; 6 ఫోర్లు), మిచెల్ మార్ష్ (54; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ బౌలర్ ఆమెర్ జమాల్ (6/69) ఆసీస్‌ను కట్టడి చేశాడు.

అనుస్తుప్ సెంచరీ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర జట్టుతో శుక్రవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగాల్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 289 పరుగులు సాధించింది. అనుస్తుప్ మజుందార్ (125; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ చేయగా... ఓపెనర్ సౌరవ్ పాల్ (96; 10 ఫోర్లు) త్రుటిలో సెంచరీని చేజార్చుకున్నాడు. అనుస్తుప్, సౌరవ్ మూడో వికెట్‌కు 189 పరుగులు జోడించడం విశేషం. ప్రస్తుతం కెప్టెన్ మనోజ్ తివారీ (15 బ్యాటింగ్), భారత జట్టు పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ తమ్ముడు మొహమ్మద్ కైఫ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, షోయబ్ ఖాన్‌లకు ఒక్కో వికెట్ లభించింది.

'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' రేసులో కోహ్లి, జడేజా





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వార్షిక అవార్డుల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' కోసం భారత్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు పోటీ పడుతున్నారు. విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా ఈ అవార్డు రేసులో ఉన్నారు. 2023లో టెస్టులు, వన్డేలు కలిపి 35 మ్యాచ్‌లలో కోహ్లి 2048 పరుగులు చేయగా... 35 మ్యాచ్‌లలో కలిపి 613 పరుగులు చేసిన జడేజా 66 వికెట్లు కూడా పడగొట్టాడు. మరోవైపు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం భారత స్పిన్నర్ అశ్విన్ బరిలో నిలిచాడు. 2023లో అశ్విన్ 17.02 సగటుతో 41 వికెట్లు పడగొట్టాడు.

క్లుప్తంగా...

గవర్నర్‌కు కాగ్ నివేదిక



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ఆర్థిక, ద్రవ్య వినిమయ గణాంకాల నివేదికను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఈ నెల రెండో తేదీన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు అందించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ చేసిన నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ధ్రువీకరించిన నివేదికను అందించినట్లు డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ రూపా డి షెనాయ్ తెలిపారు. ఈ నివేదికను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం సభ ముందు ఉంచనుంది.

భారత్‌-అమెరికా రక్షణ వాణిజ్యం 25 బిలియన్ డాలర్లు

- హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్



సాక్షి, హైదరాబాద్‌: భారత్‌తో అమెరికా ద్వైపాక్షిక రక్షణ వాణిజ్యం (బైలేటరల్ డిఫెన్స్ ట్రేడ్) 2008లో సున్నా స్థాయి నుంచి 2023 చివరి నాటికి 25 బిలియన్ డాలర్లకు చేరుకుందని హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ చెప్పారు. రెండు దశాబ్దాల్లో భారత్‌కు రక్షణ సామగ్రి, పరికరాల సరఫరాలో యూఎస్ ముఖ్యమైన సరఫరాదారుగా, భారత్‌కు సంబంధించి అతిపెద్ద సైనిక విన్యాసాలు, ప్రదర్శన (మిలిటరీ ఎక్సర్‌సైజ్) భాగస్వామిగా అమెరికా నిలుస్తోందని వివరించారు. అందరికీ స్వేచ్ఛ, వికసిత, అనుసంధానం, సుసంపన్నమైన, స్థితిస్థాపక, సురక్షిత ప్రాంత (ఫ్రీ, ఓపెన్, ఇంటర్ కనెక్టెడ్, ప్రాస్పరస్, రిసైలెంట్, సెక్యూర్ రీజియన్) సాధనకు యూఎస్ కట్టుబడి ఉందని ఆమె స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్, కోల్‌కతా యూఎస్ కాన్సులేట్ జనరల్స్, సీయూటీఎస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 'డిఫెన్స్ న్యూస్ కాంక్లేవ్: స్టోరీస్ ఆఫ్ యూఎస్–ఇండియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ పార్టనర్‌షిప్'అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. జెన్నిఫర్ మాట్లాడుతూ హైదరాబాద్‌తో సహా భారత్‌లోని పలు ప్రాంతాల్లో భారత కంపెనీల భాగస్వామ్యంలో వివిధ యూఎస్ ఎయిరోస్పేస్ కంపెనీలు పనిచేస్తూ సాంకేతికత బదిలీతో పాటు ఇండియాలో దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు దోహదపడుతున్నాయని వెల్లడించారు.

'పర్యావరణ సమతుల్యతలో పక్షులపాత్ర కీలకం'



సాక్షి, హైదరాబాద్‌: పర్యావరణ సమతుల్యత పరిరక్షణలో పక్షులు కీలకపాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. పక్షులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జాతీయ పక్షుల దినోత్సవం జరుపుకొంటున్నామని తెలిపారు. పక్షిజాతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ముఖ్యమైన విషయాలను ప్రస్తావిస్తూ పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్‌ను మంత్రి సురేఖ విడుదల చేశారు.

యుద్ధం కన్న అనాథలు

ప్రపంచంలో ఎంతో మంది ఒక పూట తిండి కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మరెంతో మంది కన్న ప్రేమను కోల్పోయి తల్లడిల్లుతున్నారు.
- మదర్ థెరెసా

నాటి ప్రపంచ యుద్ధాల నుంచి నేటి రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం దాకా..

తమవారిని కోల్పోయి భవిష్యత్తు కానరాక తల్లడిల్లుతున్న పిల్లలు

నేను ఎందుకిలా అయ్యానో తెలియదు



ఈ చిత్రంలోని అమ్మాయి పేరు మసిక. వయసు పన్నెండేళ్లు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ)లో జరుగుతున్న అంతర్యుద్ధంలో తిరుగుబాటుదారులు ఆమె కళ్ల ముందే తల్లిదండ్రులను కాల్చి చంపేశారు. ఎవరూ దిక్కులేక తన స్నేహితురాలి తల్లితో కలసి జీవిస్తోంది. నాటి ఘటనను తలచుకుని కుమిలిపోతూ.. తినేందుకు తిండి, సరైన రక్షణ లేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. "అసలు వాళ్లెవరో, ఎందుకోసం ఇలా చేస్తున్నారో, మా అమ్మానాన్నను ఎందుకు చంపేశారో, నేను ఎందుకిలా బతకాల్సి వస్తోందో నాకు తెలియదు.." అంటూ మసిక ఆవేదన వ్యక్తం చేస్తోంది.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలై దాదాపు రెండేళ్లు. ఇరువైపులా ఎంతో మంది మరణించారు. రష్యా దాడులు తట్టుకోలేక ఉక్రెయిన్ నుంచి లక్షలాది మంది వలసపోయారు. అటు పాలస్తీనాలో ఇజ్రాయెల్ దాడులతోనూ లక్షలాది జీవితాలు అతలాకుతలం అయ్యాయి. అంతా యుద్ధ నష్టం గురించి, ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడుకుంటుంటే.. అభంశుభం ఎరుగని ఎందరో చిన్నారులు యుద్ధం మిగిల్చిన అనాథలుగా భవిష్యత్తు ఏమిటో తెలియని దుస్థితిలో పడిపోయారు. జనవరి 6న (శనివారం) ప్రపంచ యుద్ధ సంక్షుభిత అనాథ పిల్లల దినోత్సవం (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నేపథ్యంలో ఈ అంశంపై ప్రత్యేక కథనం..

అమ్మానాన్నను కోల్పోయి..



ఈ చిన్నారి పేరు కరీనా. వయసు ఏడేళ్లు. ఉక్రెయిన్‌లోని చెర్నిగివ్ ప్రాంతంలోని ఓ గ్రామం. రష్యా యుద్ధం మొదలుపెట్టాక తమ ఊరిని విడిచిపోతున్న సమయంలో.. జరిగిన బాంబు దాడిలో కరీనా తల్లిదండ్రులు చనిపోయారు. ఇప్పుడు ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంలో తమ బంధువుల ఇంట్లో ఉంటోంది. తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ, బాంబు దాడిలో అయిన గాయాలతో బాధపడుతూ గడుపుతోంది.

ఏనాటి యుద్ధమైనా.. పిల్లలూ సమిధలే..

ఏ పిల్లలకైనా తల్లిదండ్రులే అన్నీ. చదువు కోసమో.. ఉద్యోగం కోసమో దూరంగా ఉంటున్నా.. తల్లడిల్లేది వారి గురించే. అమ్మ ఒడికి, నాన్న చెంతకు చేరితేనే సాంత్వన. అలాంటి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోతే.. కొన్నిసార్లు తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోతే.. ఆ బాధ వర్ణనాతీతం. అలాంటిది అస్తిత్వం కోసమో, అన్నం కోసమో, ఆక్రమణ కోసమో.. మానవ నాగరికత మొదలైన నాటి నుంచీ జరుగుతున్న యుద్ధాల్లో ఎందరో పిల్లలు అనాథలుగా మారుతున్నారు. తమ వారంటూ ఉన్న బంధువుల మధ్య పెరుగుతున్నవారు కొందరు.. ఏతోడూ లేకుండా కునారిల్లిపోతున్నవారు మరికొందరు. సరైనదారిలో పడ్డవారు మంచి జీవితం గడపగలిగితే.. 'దారి తప్పిన'వారి బతుకులు ఆగమైపోతున్నాయి.

ప్రపంచ యుద్ధాలతో ముమ్మరమై..

రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అనాథ చిన్నారులను మిగిల్చాయి. అధికారిక అంచనాల ప్రకారమే.. అప్పట్లో పోలాండ్‌లో 3 లక్షలు, యుగోస్లేవియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలయ్యారు.

'యూనిసెఫ్ (ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి)' గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా సంక్షుభిత ప్రాంతాల్లో 25 కోట్ల మందికిపైగా చిన్నారులు కనీస అవసరాలైన ఆహారం, మంచినీరు, నిలువనీడ లేక అవస్థ పడుతున్నారు. ఇందులో సుమారు 14 కోట్ల మంది తండ్రినిగానీ, తల్లిదండ్రులు ఇద్దరినీగానీ కోల్పోయి అనాథలుగా బతుకీడుస్తున్నారు.

అనాథలుగా మారినవారిలో సుమారు 6 కోట్ల మంది ఆసియా దేశాల్లో, 5 కోట్లకుపైగా ఆఫ్రికా, మరో కోటిన్నర మందికిపైగా లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంత దేశాల్లో ఉన్నారు.

యుద్ధాలు, తిరుగుబాట్లతో అట్టుడుకుతున్న మధ్య ప్రాచ్యం, ఆసియా, దక్షిణ అమెరికా దేశాల్లో.. ముఖ్యంగా సిరియా, ఇరాక్, అఫ్గానిస్తాన్ వంటి దేశాల్లో.. ఆఫ్రికా ఖండంలోని సూడాన్, కాంగో, ఉగాండా, సోమాలియా వంటి దేశాల్లో అనాథ పిల్లల సమస్య పెరుగుతోంది. ఇలాంటి చోట్ల చాలా మంది చిన్నారులు తిరుగుబాటు దళాల్లో సైనికులుగా తుపాకులు చేతబట్టాల్సి వస్తోంది.

సూడాన్‌లో అయితే ప్రతి వంద మంది చిన్నారుల్లో పది మంది అనాథాశ్రమాల్లో, వీధుల్లో బతుకు వెళ్లదీస్తున్నారు.

ఇటీవల ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన హమాస్ దాడికి ప్రతిగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడటంతో.. వేల మంది మరణించారు. లక్షలాది మంది వలసపోయారు. ఈ యుద్ధంలోనూ పెద్ద సంఖ్యలో చిన్నారులు అనాథలయ్యారు.



మొదటి ప్రపంచ యుద్ధంలో యూరప్‌లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన యూదు చిన్నారులు వీరు. వారికి కొత్త జీవితం అందించడం కోసం 1921లో అమెరికాలోని న్యూయార్క్‌కు తరలించినప్పుడు హార్బర్‌లో తీసిన ఫొటో ఇది.

ఉక్రెయిన్‌లో రెండేళ్లుగా పిల్లల గోస

రష్యా–ఉక్రెయిన్ ఒకప్పుడు ఒకే సోవియట్ యూనియన్‌లో భాగం. అందుకే ఇరు దేశాల మధ్య రాకపోకలూ, సంబంధ బాంధవ్యాలూ సాధారణమే. కానీ ఇరు దేశాల మధ్య పొరపొచ్చాలు, యుద్ధంతో ఇరువైపులా ఉండిపోయిన మరోదేశపు కుటుంబాలు ఆగమైపోయాయి. మరణించిన, వలస వెళ్లినవారి పిల్లలు, సైనికులు బలవంతంగా తల్లిదండ్రుల నుంచి విడదీసినవారు.. ఇలా ఎందరో చిన్నారులు అనాథలుగా మారారు. ఈ నేపథ్యంలోనే అమెరికాకు చెందిన 'కిడ్‌సేవ్' అనే స్వచ్ఛంద సంస్థ తమ ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేసింది. ఉక్రెయిన్‌కు మిలటరీ సాయమేకాదు.. యుద్ధంతో అనాథలైన చిన్నారులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరింది.

బలవంతంగా క్యాంపులకు చిన్నారులు

2022 ఫిబ్రవరి చివరివారం నాటికి ఉక్రెయిన్‌లో అనాథ పిల్లల సంఖ్య లక్ష వరకు ఉండగా.. ఆ తర్వాత ఈ సంఖ్య మరింతగా పెరిగింది. కానీ సంక్షుభిత పరిస్థితుల్లో లెక్కలు తేల్చేదెలాగని, వేల మంది చిన్నారులు క్యాంపుల్లో మగ్గుతున్నారని అమెరికాకు చెందిన కాన్‌ఫ్లిక్ట్ అబ్జర్వేటరీ సంస్థ గతంలోనే పేర్కొంది. మరోవైపు రష్యా తమ దేశంలోని సుమారు 14 వేల ఉక్రెయిన్ కుటుంబాల పిల్లలను తల్లిదండ్రుల నుంచి బలవంతంగా విడదీసి క్యాంపులకు తరలించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

ఫ్రెంచ్ ఆర్గనైజేషన్ చొరవతో.. ప్రత్యేక రోజుగా..

ఫ్రాన్స్‌కు చెందిన 'ఎస్‌ఓఎస్ ఎన్‌ఫాంట్స్ ఎన్ డెట్రెసెస్' స్వచ్ఛంద సంస్థ చొరవతో యూనిసెఫ్ ఏటా జనవరి 6న 'వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్ డే'గా నిర్వహిస్తోంది. యుద్ధాలు, తిరుగుబాట్ల కారణంగా అనాథలుగా మారుతున్న చిన్నారులు.. వారు శారీరకంగా, మానసికంగా తీవ్ర దుస్థితిని ఎదుర్కొంటున్న అంశంపై అవగాహన కల్పించడం, వారిని ఆదుకోవడం లక్ష్యంగా చర్యలు చేపట్టడమే దీని లక్ష్యం. అనాథలను ఆశ్రమాల్లో చేర్చడంతోపాటు చదువుకోవడానికి, సాధారణ జీవితం గడపడానికి తోడ్పడాలని స్వచ్ఛంద సంస్థలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

- సాక్షి సెంట్రల్ డెస్క్

ఫిబ్రవరి 3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

తిరుమల: సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలో దేశంలోని ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక సంస్థలతో సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవోలో ఆయన ప్రసంగించారు. అయోధ్యలో 22న రామచంద్రులవారి విగ్రహ ప్రతిష్ఠ, శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా భక్తులకు లక్ష లడ్డూలను శ్రీవారి ప్రసాదంగా అందించనున్నట్టు తెలిపారు. జనవరి 16వ తేదీన శ్రీవారి పార్వేట ఉత్సవం, 25న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి వైభవంగా నిర్వహిస్తామన్నారు. కాగా, తిరుమలలో 25 రోజుల పాటు జరిగిన అధ్యయనోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యాన్ని ఆపాలి

- దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు 'సౌత్ సేన' లేఖ

సాక్షి, హైదరాబాద్‌: దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు సౌత్ సేన విజ్ఞప్తి చేసింది. దక్షిణాదిలో వివిధ రూపాల్లో ఉత్తర భారతీయుల వలసలు పెరగడం.. అన్ని రంగాల్లో వారు విస్తరించడంతో దక్షిణాది ప్రజలు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. జనరల్ స్టోర్స్, హోటల్స్, జ్యువెల్లరీ, గ్రానైట్, మార్బుల్, శానిటరీ, ఎలక్ట్రానిక్స్, మొబైల్ యాక్సెసరీస్ వంటి వ్యాపారాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్, పాండిచ్చేరి సీఎం రంగస్వామికి.. ఈ సంఘ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రమేష్, సభ్యుడు జగదీష్ లేఖలు రాశారు.

లేఖలో ముఖ్యాంశాలు

- అన్ని కంపెనీల్లో దక్షిణ భారతీయులకు మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- దక్షిణ భారతీయుల వ్యాపారాలకు రక్షణ కల్పించాలి. ఉత్తర భారతీయుల ఆధిపత్యానికి చెక్ పెట్టాలి
- సినిమాల్లో నటీనటులు, కార్మికులకు దక్షిణాదివారినే తీసుకోవాలి.
- దక్షిణాది సినిమాలకే థియేటర్లు కేటాయించాలి. హిందీ సినిమాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు.
- ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసెస్ అధికారుల్లో దక్షిణాదివారే కీలక స్థానాల్లో ఉండాలి. ఉత్తరాది అధికారుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి.
- విద్యార్థులపై హిందీ భాషను రుద్దకూడదు. దాన్ని కేవలం ఆప్షన్‌గా మాత్రమే ఉంచాలి.

జీవితమంతా విద్యార్థిగా ఉండాలి

- వినయం, విధేయతతోనే విజయాలు.. జేఎన్‌టీయూ కాన్వొకేషన్‌లో ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.పి. సోమనాథ్



బాలానగర్‌: విద్యార్థి ప్రయాణానికి గుర్తింపు డిగ్రీ పట్టాల ప్రదానోత్సవమని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.పి. సోమనాథ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ)లో జరిగిన 12వ కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన 54 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, పలువురికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ ఏ వ్యక్తికైనా స్థిరమైన ప్రయత్నం, నిబద్ధత ద్వారానే గుర్తింపు వస్తుందన్నారు. 'విద్యార్థులు చేసే పనిని అంకితభావంతో చేయాలి. మీ ప్రయత్నంలో కొన్నిసార్లు విఫలం కావచ్చు. కానీ ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు. జీవితమంతా విద్యార్థిగా ఉండాలి. దానికితోడు వినయం, నిజాయతీ కలిగి ఉంటే విజయాలు మీ వెన్నంటే ఉంటాయి'అని అన్నారు. ఈరోజు తాను చూస్తున్న యువతీయువకులంతా భవిష్యత్తులో కొత్త తరం నాయకులు కావాలని సోమనాథ్ ఆకాంక్షించారు. విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, వారి ప్రతిభ, పట్టుదలపై తనకు నమ్మకం ఉందని చెప్పారు. అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఎప్పుడూ పెద్దపెద్ద కలలు కనాలని కోరారు. ఎంచుకున్న రంగంలో ఆత్మస్థైర్యం ప్రదర్శిస్తేనే కలలు సాకారం అవుతాయన్నారు. విజయం శాశ్వతంగా ఉండదని.. కాబట్టి వినయం నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా సమాజంలో ప్రయాణం ఉండాలన్నారు. అంతకుముందు జేఎన్‌టీయూ ఉప కులపతి కట్టా నరసింహారెడ్డి ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, రెక్టార్ గోవర్ధన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఆల్ ఇండియా పోలీస్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్



సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా పోలీస్ విభాగాలు, ప్రత్యేక పోలీస్ దళాలకు చెందిన అశ్వికదళాలు పోటీపడిన 42వ ఆల్ ఇండియా పోలీస్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్, మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్–2023 ముగిసింది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో పది రోజులుగా ఈ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో హరియాణా పోలీస్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. రెండో స్థానంలో అసోం రైఫిల్స్, మూడో స్థానంలో హరియాణా బీ టీమ్, నాలుగో స్థానంలో పంజాబ్ టీమ్ నిలిచాయి. పోటీల ముగింపు వేడుకకు ముఖ్యఅతిథిగా దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్ వీఎస్ఎం ఎయిర్ మార్షల్ ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలు అసాధారణ ప్రతిభను వెలికితీయడంతోపాటు చట్టాన్ని అమలు చేసే వివిధ పోలీసు విభాగాల మధ్య సమన్వయం పెంచేందుకు ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు. ఇందులో పలు కేంద్ర పోలీసు సంస్థలు, కేంద్ర సాయుధ పారామిలిటరీ బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 22 బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 605 మంది పురుషులు, 14 మంది మహిళా అధికారులు, సిబ్బంది వన్ డే ఈవెంట్ వన్‌స్టార్, డ్రస్సేజ్, టెంట్ పెగ్గింగ్, షో జంపింగ్, మెడ్లీ రిలే, హ్యాక్స్, మెంటల్ హజార్డ్ టెస్ట్ మొదలైన పోటీల్లో తమ ప్రతిభా పాటవాలను చూపారు.

గ్రంథాలయ సంస్థల చైర్మన్లు, సభ్యులపై వేటు

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ, జిల్లా గ్రంథాలయ సంస్థల అధ్యక్షులు, సభ్యులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 35 మందిని పదవుల నుంచి తొలగించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ తొలగింపు: సమాచార, ప్రజా సంబంధాల డైరెక్టర్ రాజమౌళిని కూడా ప్రభుత్వం తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన రాజమౌళిని గత ప్రభుత్వం డైరెక్టర్‌గా నియమించింది. ఆయనను పదవి నుంచి తొలగిస్తూ సమాచార శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి అశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పిటిషన్ల విచారణ అర్హత తేలుస్తాం

'గవర్నర్ కోటా'ఎమ్మెల్సీ పిటిషన్లపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్‌: ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కేబినెట్ సూచించిన తమ పేర్లను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదంటూ దాఖలైన రెండు పిటిషన్ల విచారణార్హత తేలుస్తామని హైకోర్టు పేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలు అందజేయాలని వాది, ప్రతివాదుల న్యాయవాదులను ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను సూచిస్తూ రాష్ట్ర కేబినెట్ పంపిన నోట్‌ను తిరస్కరిస్తూ 2023, సెప్టెంబర్ 19న గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అదిత్యా సోధీ, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం కేబినెట్ నిర్ణయాలను ఆపే అధికారం గవర్నర్‌కు లేదన్నారు. దీనికి సంబంధించి గతంలో ఇచ్చిన పలు తీర్పులను వెల్లడించారు. గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.అశోక్ ఆనంద్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం పిటిషనర్లకు ఈ పిటిషన్ వేసే అర్హతలేదన్నారు. పిటిషన్లపై అభ్యంతరాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి కూడా పిటిషన్లపై అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. అభ్యంతరాలకు సంబంధించి రాతపూర్వక వివరాలు అందించాలని కోరుతూ విచారణను 24కు వాయిదా వేసింది.

సంక్రాంతికి 4,484 ప్రత్యేక బస్సులు

- రేపటి నుంచి 15 వరకు అందుబాటులో..
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ టికెట్ చార్జీలే
- 'మహాలక్ష్మి' రద్దీ నేపథ్యంలో ఏపీకి ఈసారి తక్కువ బస్సులు



సాక్షి, హైదరాబాద్‌: సంక్రాంతి పండుగ రద్దీని తట్టుకునేందుకు అదనంగా 4,484 బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇది గతేడాది సంక్రాంతి సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల సంఖ్య కంటే దాదాపు 200 అదనం. కానీ, తెలంగాణ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు 1,500 ప్రత్యేక బస్సులు అవసరమని గుర్తించినప్పటికీ, కేవలం 600 సర్వీసులను మాత్రమే తిప్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ఉండటంతో బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ఉన్న బస్సులు సరిపోవటం లేదు. ఇప్పటికిప్పుడు కొత్త బస్సులు అందే అవకాశం లేకపోవటంతో పండగ ప్రత్యేక బస్సుల్లో సింహభాగం తెలంగాణ ప్రాంతంలోనే నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఏపీకి నడిపేందుకు చాలినన్ని బస్సులు లేకపోవటంతో, డిమాండులో సగానికంటే తక్కువ బస్సులతోనే సరిపుచ్చాలని నిర్ణయించినట్టు తెలిసింది.

626 సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం

ఇప్పుడు నడిపే 4,484 ప్రత్యేక బస్సుల్లో 626 సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈనెల ఏడో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి నేపథ్యంలో, సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో కూడా రద్దీ విపరీతంగా ఉండనున్నందున.. ఎక్కువ ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు పల్లెవెలుగు బస్సులను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సమీక్ష

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత ఉన్నతాధికారులతో సమీక్షించి ప్రత్యేక బస్సుల నిర్వహణ, 'మహాలక్ష్మి'రద్దీని తట్టుకునే చర్యలపై చర్చించారు. ఎంజీబీఎస్, జేబీఎస్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్ ప్రాంతాలలో ప్రత్యేక బస్సులు ఎక్కువగా అందుబాటులో ఉంటున్నందున ఆయా ప్రాంతాలకు సిటీ బస్సులను కూడా అదనంగా తిప్పాలని నిర్ణయించారు. ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా జమయ్యే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో నీడ కోసం షామియానాలు, మంచినీటి వసతి, కుర్చీలను సిద్ధం చేయాలని, ప్రయాణికుల సందేహాలను తీర్చే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రద్దీ ప్రాంతంలో ఇద్దరు డీవీఎం ర్యాంక్ అధికారులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో అదనంగా ఎలాంటి చార్జీ ఉండదని, సాధారణ టికెట్ చార్జీలే వర్తిస్తాయని తెలిపారు.

ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు 1,450

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ సర్వీసులకు అదనంగా 1,450 బస్సులు తిప్పుతున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈనెల 10 నుంచి 13 వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇవి తిరుగుతాయని పేర్కొన్నారు. వీటిల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తారని, ఎలాంటి అదనపు చార్జీలుండవని తెలిపారు. రద్దీ నేపథ్యంలో 11వ తేదీ నుంచి 13 వరకు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు , మాచర్ల వైపు వెళ్లే బస్సులు ఎంజీబీఎస్‌కు బదులు, దాని ఎదురుగా ఉన్న ఓల్డ్ సీబీఎస్ (గౌలిగూడ బస్టాండు)లో ఆగుతాయని వెల్లడించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.